# ఆంధ్రప్రదేశ్

జూలై 1968



★

30 పైసలు

# ఆంధ్రప్రదేశ్‌ను గురించి....

| | |
|---|---|
| విస్తీర్ణం | 1,06,286 చ. మై. |
| జిల్లాలు | 20 |
| తాలూకాలు | 189 |
| గ్రామాలు | 28,997 |
| పట్టణాలు, నగరాలు | 212 |
| మొత్తం జనసంఖ్య (1961) | 359.83 లక్షలు |
| జన సాంద్రత (1961) | 339 చ. మై. 1 కి. |
| అక్షరాస్యులు (1961) | 76.27 లక్షలు |
| షెడ్యూల్డు కులాలవారు (1961) | 49.74 లక్షలు |
| షెడ్యూల్డు తెగలవారు (1961) | 13.24 లక్షలు |
| నమోదైన కర్మాగారాలు | 3,928 |
| విశ్వవిద్యాలయాలు | 4 |
| పంచాయతీలు | 15,266 |
| పంచాయతీ సమితులు | 321 |
| ఆంధ్రప్రదేశ్ నుండి పార్లమెంటు సభ్యులు | 61 |
| విధానసభ సభ్యులు | 288 |
| శాసనమండలి సభ్యులు | 90 |

# ఆంధ్ర ప్రదేశ్

సంపుటి: 12 ]

జులై - 1968

ఆషాఢ—శ్రావణ. — 1890 శా.శ.

[సంచిక: 9

ప్రధాన సంపాదకులు

బి. యస్. రామన్, ఐ. ఎ. యస్.

సంపాదకులు

ఎస్. వి. గోపాలశాస్త్రి

## ఈ సంచికలో

★

ముఖ చిత్రం : సాలార్‌జంగ్ మ్యూజియంలో "నైట్ వాచ్‌మన్" కాంస్య విగ్రహం

మూడవ అట్ట : తిరుమల దేవస్థానము

నాలుగవ అట్ట : హార్స్లీ కొండలమీద సూర్యోదయ దృశ్యం

★

[ఈ సంచికలోని రచయితల అభిప్రాయాలు ప్రభుత్వానికి సంబంధించినవి కావు. సం॥]

57—1

పేజీ



# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక సంబంధాలు

## ఆర్థిక కమీషన్‌కు ముఖ్యమంత్రి లేఖ

ఆర్థిక కమీషన్ వారికి వ్రాసిన ఒక లేఖలో ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి యిలాఅన్నారు. "వివిధరాష్ట్రాలలో వివిధ పార్టీప్రభుత్వాలు ఏర్పడిన దృష్ట్యా కేంద్ర–రాష్ట్ర సంబంధాలకు సంబంధించిన సమస్య ప్రాముఖ్యత సంతరించుకున్నది. విభిన్న దృక్పథాలతో ఉన్న రాష్ట్రప్రభుత్వాలు దేశ రాజకీయ సమైక్యత, ఆర్థిక అభివృద్ధి వంటి విషయాలలో కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందానికి రావడంలో విఫలమైనప్పుడల్లా దేశ సమైక్యతకే భంగం వాటిల్లే ప్రమాదం ఏర్పడుతుంటుంది. అయితే ఆర్థిక విషయాలకు సంబంధించిన కేంద్ర–రాష్ట్రాల సంబంధాలు తరచుగా జాతీయ సమైక్యతను భంగం కలిగించే విధంగా పరిణమిస్తుంటాయని మరికొంత లోతుగా ఆలోచిస్తే స్పష్టమవుతుంది."

దేశంలోని వివిధ ప్రాంతాలలో ఆర్థిక అభివృద్ధిలో అసమానత కొనసాగడం, ఫెడరల్ ఆర్థిక విధానంలో ఆచరణ ద్వారా కేంద్ర సహాయం జరగనిదే యీ అసమానత తొలగదనే భావన ప్రబలడం వల్ల ఫెడరల్ సమైక్యతకు చాలవరకు విఘాతం ఏర్పడుతున్నది.

"ఒకవైపు రాష్ట్రాల వనరుల అభివృద్ధిపెంపుదలకు దోహదం చేసే విధంగాను మరోవైపు జాతీయ ఆర్థిక పటిష్ఠతకు వీలు కల్పించే విధంగాను కేంద్ర–రాష్ట్ర సంబంధాలను నిర్ణయించే విధానాలను రూపొందించాలి.

ఉత్పత్తి రంగంలో ప్రతిరాష్ట్రం యొక్క ప్రస్తుత ఆదాయ స్థాయిని మొదట నిర్ణయిస్తారు. ప్రణాళికా కాలంలో సాధించాల్సిన రాష్ట్ర ఆదాయపెంపుదల రేటును ప్రణాళికలు నిర్ణయిస్తాయి. ప్రణాళిక ప్రారంభంలోను అంతంలోను అఖిలభారత సగటు తలసరి ఆదాయం ఆధారంగా రాష్ట్ర తలసరి సగటు ఆదాయం దృష్టితో పెరుగుదల శాతాన్ని సూచనచేస్తారు. తద్వారా ప్రాంతీయ అసమానతలను క్రమంగా తొలిగించ వీలు కలుగుతుంది.

రాష్ట్రం ఆదాయం పెంపుదలకు అవసరమైన విధంగా పెట్టుబడులను ప్రతి రాష్ట్రానికి నిర్ణయిస్తారు. రాష్ట్రవారీగా పెట్టుబడులను ఆ విధంగా నిర్ణయించిన తర్వాత జాతీయప్రణాళికలో నిర్దేశించిన ప్రాధాన్యతా క్రమాన్ని అనుసరించి వివిధ రంగాలకు నిధులను కేటాయిస్తారు " అని ముఖ్యమంత్రి అన్నారు.

ప్రణాళికలోని ఉత్పత్తేతర రంగాలకు సంబంధించినంత వరకుసహాయం పూర్తిగా గ్రాంటు రూపంలో ఉంటుంది. రాష్ట్రంలో అటువంటి ప్రతి రంగంలో సాధించాల్సిన అభివృద్ధిని నిర్ణయిస్తారు. ప్రణాళిక ఆరంభం, ఆఖరులలో అఖిల భారత సగటు స్థాయిని, ప్రణాళికా కాలంలో సాధించాల్సిన అభివృద్ధి స్థాయిని ప్రణాళిక నిర్ణయిస్తుంది.


ప్రస్తుతం, ప్రణాళికా సంఘం ఆమోదించిన ప్రత్యేక పథకాలకు కట్టుబడి రాజ్యాంగం 282 అధికరణ క్రింద ప్రణాళికా పథకాలకు అవసరమైన గ్రాంట్లను మంజూరు చేస్తున్నారు. ఈ విధంగా సహాయాన్ని కట్టుబాటు చేయడం, రాజ్యాంగం క్రింద తమకు సంబంధించిన రంగాలలో రాష్ట్ర స్వేచ్ఛను అరికట్టడమే అవుతుంది. అందువల్ల రాజ్యాంగంలోని 275 అధికరణ క్రింద తగిన విధంగా గ్రాంట్లను మంజూరు చేయాలని సూచించబడింది.

ఆర్థిక అభివృద్ధి పథకాల నిమిత్తం వినియోగించబడిన ఋణాల మొత్తాలను జాతీయ ప్రణాళికలో అంతర్భాగంగా పరిగణించాలి. ప్రతి రాష్ట్రం తనకు ఏ యే గ్రాంట్లకు అర్హత ఉన్నదో తెలుసుకుని, తదనుగుణంగా తమ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుకొనేందుకు వీలు కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లవిధానం ఉండడం అవసరమని ఆయన అన్నారు.

అఖిల భారత సర్వీసులలో నియమ కాలాలలో ప్రతి రాష్ట్రానికి సమాన వాటా లభించే విధంగా ఏదో ఒక విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. "సర్వీసుల స్థాయిలో కొన్ని రాష్ట్రాలకు ఎక్కువ ప్రాతినిధ్యం ఉన్న కారణంగా కేంద్రం నుండి కొన్ని రాష్ట్రాలకు న్యాయం జరగడం లేదనే భావన ఉన్నది."

★

# మత సామరస్యం



జన సంబంధ శ్రామిక మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ జూన్ 13 వ తేదీన జూబిలీహాల్లో ఏర్పాటుచేసిన మత సామరస్య సమావేశంలో ముఖ్య మంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రసంగిస్తున్న దృశ్యం.

మతసామరస్యాన్ని నెలకొల్పే నిమిత్తం సూచనలు చేయడానికిగాను, శాసనసభ్యులు, కార్పొరేషను సభ్యులు, వివిధ సంస్థల ప్రతినిధులతో కూడిన ఒక సమావేశాన్ని జనసంబంధశ్రామిక మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ఏర్పాటు చేశారు. హైదరాబాదులో జూన్ 13వ తేదీన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఆహ్వానితులకు దిగువ ఆహ్వానం అందజేయబడింది :—

ప్రియమైన శ్రీ...............

సంఘంలో వివిధ వర్గాల మధ్య మతసామరస్యం సత్సంబంధాల విషయాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ముఖ్యంగా హైదరాబాద్ నగరం ఆదర్శప్రాయంగా వుంటున్నవి. సహనానికి ఔదార్యానికి, మిశ్రమ సంస్కృతికి హైదరాబాద్ పేరెన్నికగన్నది. భారతదేశానికి ప్రతిబింబంగా హైదరాబాద్ నగరం అందరిచేత గుర్తింపబడుట గర్వకారణమైన విషయం.

అయినప్పటికి కొంతమంది మతోన్మాదులు సంఘంలో మత విషయికంగా ఆలోచిస్తూ, ప్రవర్తిస్తూ, మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు అట్టి మతోన్మాదులు అవకాశంకొరకు కాచుకొని ఉండడమేగాక. తమతమ దురాలోచనలకు దుర్లక్ష్యాలకు అనుగుణంగా సన్నివేశాలను సృష్టించేందుకు ప్రయత్నిస్తారు.

ఇటీవల హైదరాబాద్లో కొన్నిచోట్ల జరిగిన విచారకర మత విషయిక అల్లర్లు నగర పౌరులందరికీ అవమానకరమైనవి. మతోన్మాదులు, సంఘంలోని దుష్టశక్తులూ ఏ విధంగా సంఘంలో అరాచకం కలిగిస్తారో అనే విషయంపై ఈ సంఘటనలు కనువిప్పు కలిగిస్తాయి.

కాబట్టి అల్లర్లు జరిగిన ప్రాంతంలో వివిధ వర్గాల మధ్య సత్సంబంధాలు తిరిగి నెలకొల్పడం, మత వైషమ్యాలు చెలరేగకుండా చూచేందుకు తగిన చర్యలు తీసికొనడం సమంజసం.

ఈ సందర్భంలో పై పేర్కొన్న లక్ష్యాలను సాధించే విషయంలో సలహాలందజేయుటకై బాధ్యతాయుతులైన పెద్దలనందరిని సమావేశపరిచేందుకు 13-6-68 తేదీ సాయంకాలం 5 గం॥ కు జూబిలీహాలులో ఒక సమావేశం ఏర్పాటుచేయడమైంది. ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షత వహించుటకు దయతో అంగీకరించారు.

ఈ సమావేశం క్రింది విషయాలను గూర్చి ఆలోచిస్తుంది.

(1) ఇటీవల మత ద్వేషాలు చెలరేగిన ప్రాంతంలో మత సామరస్య సాధనకై తీసికొనవలసిన చర్యలు.

(2) జాతీయసమైక్యత పటిష్ఠంచేయడం, మత వైషమ్యాల నిర్మూలనకు తీసికొనవలసిన చర్యలు.

ఈ సమావేశంలో మీరు పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

కొండా లక్ష్మణ్ బాపూజీ

ఈ సమావేశంలో ప్రసంగించిన వివిధసంస్థల ప్రతినిధులు, శాసనసభ్యులు, మత సామరస్య సాధనకు అనేక సూచనలను చేశారు. ఇరువర్గాలవారు పరస్పర విశ్వాసానికి కృషి చేయాల్సిన ఆవసరాన్నిగూర్చి వారు నొక్కిచెప్పారు. నగరంలో యిటీవల

జరిగిన అల్లరులలో నష్టపడ్డవారికి తగిన సహాయం అందజేయాలని వారు అభ్యర్థించారు.

ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ మతకలహాలను రూపుమాపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "స్వప్రయోజనపరులు" చిన్నచిన్న సంఘటనలకు మతం రంగు పూస్తున్నారని చెప్పుతూ, బాధ్యతగల కొందరు నాయకులు మత కలహాలను ప్రోత్సహించే కార్యక్రమంలో పాల్గొంటున్నారని ముఖ్యమంత్రి తమ విచారం ప్రకటించారు. "ఇక్కడ అటువంటి సంఘటనలు జరగడాన్ని నేను అనుమతించను, ఈ విషయంలో నేను దృఢనిశ్చయం చేసుకున్నాను." ఇటీవల నగరంలో జరిగిన అల్లర్లను ఉద్రిక్తకరమైనవిగాను, అసహ్యకరమైనవిగాను ముఖ్యమంత్రి వర్ణించారు. అవి పెద్ద ఎత్తున జరిగిన మత సంఘర్షణలు కావని ఆయన అన్నారు. సమావేశంలో కొందరు ప్రతినిధులు పోలీసులను విమర్శించడాన్ని ప్రస్తావిస్తూ పోలీసులు పొరపాటు చేయడం సాధ్యంకావచ్చునని అయితే నేరస్థులను అరెస్టుచేయడంలో ప్రజలు పోలీసులకు తోడ్పడాలని ముఖ్యమంత్రిఅన్నారు. పోలీసులు మరింత అప్రమత్తతతో ఉండాలనే విషయం నిజమేనని అయితే పోలీసులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంలో ప్రజలుకూడ సహాయపడాలనీ ఆయనఅన్నారు. అల్లరులను సృష్టిస్తున్న సమాజ వ్యతిరేకశక్తులను కనిపెట్టడంలో పోలీసులకు పౌరుల సహాయం అవసరమని ఆయన అన్నారు.

మత కలహాలను ప్రోత్సహించే వార్తాపత్రికలను అదుపులో పెట్టడానికి అవసరమైన శాసనాన్ని రాష్ట్రప్రభుత్వం త్వరలోనే రూపొందిస్తుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రజలను పెడత్రోవ పట్టించే కట్టుకథలను, ఉద్రేకపూరితమైన ప్రసంగాలను ప్రచురించిన పత్రికలను ముఖ్యమంత్రి తీవ్రంగా గర్హించారు. మతవైషమ్యాలను ప్రోత్సహించే పత్రికలను అదుపుచేసే అధికారాలు ప్రభుత్వానికి ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు.

ఈ సమావేశాన్ని ఏర్పాటుచేసిన జనసంబంధ, శ్రామిక మంత్రి, శ్రీ కొండాలక్ష్మణ్ బాపూజీ ప్రసంగిస్తూ నగరంలోని కొన్ని వాడలలో మతవైషమ్యాలు తలెత్తడం విచారకరమని అన్నారు. మతసామరస్యాన్ని కొనసాగించడంలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శవంతమైనదిగా భావించబడుతున్నదని ఆయన అన్నారు.

జాతీయ సమైక్యత, శాంతిసాధనకృషిలో ప్రభుత్వం, ప్రజలు కలిసి పని చేయాలని ఆయన నొక్కి చెప్పారు.

పార్లమెంటు సభ్యుడు శ్రీ బాకర్ అలీమీర్జా ప్రసంగిస్తూ మతకలహాలను ఉద్దేశపూర్వకంగా నిర్వహించడం చాలా ప్రమాదకరమైన విషయమని అన్నారు. మత కలహాలను ప్రోత్సహించే వ్యక్తులను శిక్షించాలని ఆయన ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈవిషయంలో యిటీవల జరిగిన సంఘర్షణలగూర్చి న్యాయవిచారణ జరపాలని ఆయన సూచించారు.

అంజుమన్ తరఖీ కార్యదర్శి శ్రీ హబీబుర్రహ్మాన్ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన సంఘటనల సందర్భంలో అరెస్టయిన అమాయకులైన ప్రజలను విడుదల చేయాలనీ, నష్టపడిన వారికి తక్షణమే సహాయం అందజేయాలనీ అన్నారు.

సంఘటనలను గురించి న్యాయ విచారణ జరిపించాలని శాసన మండలి సభ్యుడు శ్రీ మగ్దూమ్ మొహియుద్దీన్ కోరారు. అన్ని మతాలలోని సెక్యులర్ శక్తులను పటిష్ఠం చేయాలని ఆయన అన్నారు. నగరంలో సైనికతత్వం అనేక బృందాలు పనిచేస్తున్నాయని యన పేర్కొన్నారు.

"సియాసత్" సంపాదకుడు శ్రీ ఆబిద్ అలీ ఖాన్ ఈ సమావేశంలో పత్రికల తరఫున ప్రసంగిస్తూ, ఇటీవలి సంఘటనలను గురించిన వార్తలను ప్రచురించే విషయంలో మొత్తంమీద స్థానిక పత్రికలు బాధ్యతతో ప్రవర్తించాయని అన్నారు కొన్ని పత్రికలు ఉద్రిక్తపరిస్థితులను ప్రోత్సహించే వార్తలను ప్రచురించి వుండవచ్చుననీ, అంతమాత్రాన పత్రికలనన్నింటినీ నిందించరాదనీ ఆయన పేర్కొన్నారు.

ఇటీవలి సంఘటనలను గురించే కాకుండా "పోలీసు దౌర్జన్యాలను" గురించికూడా న్యాయవిచారణ జరిపాలని రాష్ట్ర జనసంఘం కార్యదర్శి శ్రీ వి. రామారావు కోరారు. నగరంలోని పోలీసు వ్యవస్థనంతటినీ పునర్వ్యవస్థీకరించాలని కూడా ఆయన కోరారు.

నగర కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ ఎర్రం సత్యనారాయణ మాట్లాడుతూ, శాసనాలను అమలు పరిచే యంత్రాంగంపట్ల ప్రజలు భయభక్తులు కలిగి ప్రవర్తించునట్లు ప్రయత్నం జరగాలని చెప్పారు. కొంత మంది ప్రజలు పోలీసులపట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తించారంటూ ఆయన విచారం వెలిబుచ్చారు.

పార్లమెంటు సభ్యుడు డా. జి. ఎస్. మేల్కోటే ప్రసంగిస్తూ తాను మతసామరస్యానికై కృషిచేస్తుండగలనని తెలిపారు. ఉభయ మతాలవారూ పరస్పరం విశ్వాసం పెంపొందించుకోవాలని అన్నారు. ఇటీవల జరిగిన సంఘటనలకు కాంగ్రెసును నిందించిన వారి వైఖరిని పార్లమెంటు సభ్యుడు శ్రీ జి. వెంకటస్వామి ఖండించారు. శాసన సభ్యుడు శ్రీ టి. అంజయ్య ఉపన్యసిస్తూ మత దృష్టితో పనిచేసే పార్టీలను నిషేధించినప్పుడే మత తత్వాన్ని అరికట్టడానికి సాధ్యమవుతుందన్నారు.

హిందూ నవయువక సంఘానికి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ బి. కిషన్‌లాల్, మతదృష్టితో వ్యవహరించే ప్రజలకు ఓటు హక్కును నిరాకరించాలని సూచించారు.

ఇండియన్ కల్చరల్ ఫ్రీడమ్ కమిటీ ఆర్గనైజరు శ్రీ ఇన్నయ్య, జమాత్ ఇస్లామీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు శ్రీ అబ్దుల్ రజాక్ లతీఫ్, ఎస్.ఎస్.పి.కి చెందిన శ్రీ మహమ్మద్ నజరుద్దీన్, కార్పొరేషన్ సభ్యులు శ్రీ రహమత్ అలీ, శ్రీమతి ఖదీజాఆలమ్ ఖుందామెరీగార్లు, శ్రీ తాహర్ అలీఖాన్ ప్రభుతులుకూడా ప్రసంగించారు.

జనసంబంధ శ్రామిక మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ దిగువ ప్రకటన జారీచేశారు.

"హైదరాబాదులోని కొన్ని వాడలలో మత సంఘర్షణలు జరిగినట్లు నేను ఢిల్లీలో వుండగా తెలిసి చాలా ఆందోళన చెందాను ఇచ్చటి పరిస్థితులను గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి నేను ప్రయత్నించాను. నేను ఢిల్లీ నుండి తిరిగివచ్చిన తరువాత ఇచ్చటి పరిస్థితులు చాలావరకు మెరుగుపడడం చూసి నాకు సంతృప్తి కలిగింది.

"సంఘర్షణలు జరిగిన వివిధ పేటలలోని ఉభయమతాలకు చెందిన ప్రతినిధులు కొందరు నన్ను కలుసుకొని సంఘటనలను గురించిన వివరాలు తెలియజేశారు. కొన్ని సంఘటనలు అప్రతిష్ఠాకరమైనవి. మతద్వేషంతో ఆలోచనచేసేవారు, వ్యవహరించేవారు, మతసంస్థలలో పనిచేస్తున్నవారు ఇప్పటికైనా తమ వైఖరిని మార్చుకోవడం మంచిది. ఇటువంటి చర్యలకు పూనుకుంటున్నవారిపై, వారు ఏ మతానికి చెందినవారైనప్పటికీ, కఠిన చర్యలు తీసుకోవాలి. మతంపేరిట వారికి రక్షణ కల్పించడం అసాంఘికమైన చర్యే అవుతుంది. ఒక తీవ్రపరిస్థితిని ఎదుర్కొనడానికి చర్యలు తీసుకోవడంలో అనేక మంది అమాయకులకు కష్టనష్టాలు కలుగవచ్చు. అట్టి అమాయక ప్రజలను కాపాడడం అనేది సక్రమంగా ఆలోచించే ప్రతివ్యక్తి బాధ్యత. అసలు సమస్యను సృష్టించేది మతదృష్టితో ఆలోచించేవారే. వారే సమస్యను సృష్టించి, ఆ తర్వాత తాము వట్టి అమాయకుల మాదిరిగా ఫిర్యాదులు చేయడం చాలా శోచనీయమైన విషయం. ఎదుటి వారిపై నేరాన్ని ఆరోపించి తాము ఏమి ఎరుగని అమాయకులుగా నటించడానికి ప్రయత్నిస్తుంటారు వారు. నిజానికి అటువంటి వ్యక్తులే యీవిధమైన అల్లర్లకు కారకులుగా పేర్కొనాలి.

"స్నేహ, సౌభ్రాతృత్వ వాతావరణాన్ని నెలకొల్పడానికి యిరువర్గాలలోని సజ్జనులు, సక్రమ ఆలోచనాపరులూ ప్రయత్నాలు కొనసాగించి, యీ ఉద్రిక్త వాతావరణాన్ని సడలించడానికి పూనుకోవడం మిగుల హర్షనీయమైన విషయం. వారి కృషి నిజంగా ఎంతో వాంఛనీయమైనది. అట్టివారికి అన్నివిధాలా తోడ్పడడం ప్రతి పౌరుని కర్తవ్యం.

"హైదరాబాదు పేరు ప్రతిష్ఠలకు విఘాతం కలిగించే విద్వేషాలను రూపుమాపే విషయంలో ప్రజలు ముందుకు వచ్చి పూర్వపు స్నేహ వాతావరణాన్ని తిరిగి నెలకొల్పి యీ నగరం పేరు ప్రతిష్ఠల్ని కాపాడడంలో సహకరించగలరనీ, త్యాగాన్ని ప్రదర్శించగలరనీ విశ్వసిస్తున్నాను.

---

## ఆంధ్రకేసరి జీవితంపై చలనచిత్రం

ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారి జీవితంపై జనసంబంధశాఖ తరపున ఒక సంక్షిప్త చలనచిత్రం తీయవలెనని ఉద్దేశింపబడింది. ఆయన జీవితకాలంలో ముఖ్యంగా దేశోద్ధారక శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు, అమరజీవి పొట్టి శ్రీరాములు గార్ల నిర్యాణంవంటి అనేక సందర్భాలలో తీసివుంచబడిన ఫొటోలు గాని, చలనచిత్రాలుగాని, తత్సంబంధమైన యితర సమాచారంగాని యీ కృషికి బాగా పనికి వస్తుంది అటువంటివి తమ వద్ద వున్నవారు 1968 ఆగస్టు 1వ తేదీలోగా సంచాలక్, జనసంబంధశాఖ, గాంధీ భవనం రోడ్డు, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌కు పంపి సహకరించవలసినదిగా విజ్ఞప్తి.

## చలనచిత్ర పరిశ్రమ సబ్సిడీ పథకం

ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధిని ప్రోత్సహించే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక పథకాలు ప్రారంభించింది. రాష్ట్రంలో నిర్మించిన చిత్రాలకు సబ్సిడీగా 50,000 లు చెల్లించడం ఆ పథకాలలో ఒకటి. ఈ సబ్సిడీ పథకం మొదట 1964 జనవరి 2వ తేదీ నుంచి 1966 మార్చి 31 వ తేదీ వరకు అమలు పరచబడింది. తరువాత దీనిని 1966 ఏప్రిల్ మొదటి తేదీనుండి 1968 మార్చి 31 వ తేదీ వరకు రెండు సంవత్సరాలపాటు పొడిగించారు.

రాష్ట్రంలో అభివృద్ధిజెందుతున్న చలనచిత్ర పరిశ్రమకు సహాయం చేసే నిమిత్తం సబ్సిడీ పథకాన్ని 1968 ఏప్రిల్ మొదటి తేదీ నుంచి మరో రెండు సంవత్సరాల పాటు పొడిగించడానికి ప్రభుత్వం ఆమోదించింది.

# పరిపాలనా విషయాలు

## కేంద్రరేట్లతో సమానంగా రాష్ట్రప్రభుత్వోద్యోగులకు కరువుభత్యం

స్థానిక సంస్థల సిబ్బందితోసహా రాష్ట్రప్రభుత్వోద్యోగులకు జూన్ ఒకటవ తేదీనుండి కరువుభత్యాన్ని కేంద్రరేటకు సమానంగా హెచ్చించడానికి రాష్ట్ర మంత్రివర్గం జూన్ 8 సమావేశంలో నిర్ణయం గైకొన్నది.

హెచ్చించిన కరువభత్యంలో సగభాగాన్ని నగదు రూపంలో చెల్లించి మిగిలిన సగభాగాన్ని ఉద్యోగుల ప్రావిడెంటు ఫండ్ కాతాకు జమచేస్తారు. కరువుభత్యం హెచ్చింపువల్ల సాలీనా నాలుగు కోట్ల రూపాయల అదనపు వ్యయం కాగలదు.

## సర్వీస్ కమీషన్ ద్వారా సరాసరి రిక్రూట్‌మెంట్ నిషేధం తొలగింపుకు ప్రభుత్వ నిర్ణయం

స్టేట్ సర్వీసులకు, సబార్డినేట్ సర్వీసులకు పబ్లిక్‌సర్వీస్ కమీషన్ ద్వారా సరాసరి ఉద్యోగులను రిక్రూట్ చేసుకోవడం పై వున్న నిషేధాన్ని రాష్ట్రప్రభుత్వం తొలగించింది.

పొదుపుచర్యల మూలంగా రిట్రెంచి కాబడిన వారిని సర్వీసులలోకి తీసుకోవడానికి సౌకర్యం కలిగించడానికిగాను ఆ నిషేధాన్ని పెట్టారు.

రెగ్యులర్ ఇంటర్‌వల్సులో తాము సెలెక్టుచేసిన అభ్యర్థులను తీసుకొనడం మూలంగా, సర్వీసులలోకి తెలివిగల యువకుల్ని చేర్చుకునేందుకు వీలుగా వుంటుందని, అందువలన కొత్తగా రిక్రూట్ చేసుకొనకూడదని విధించిన నిషేధాన్ని తొలగించాలని పబ్లిక్ సర్వీస్‌కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది.

1966 మార్చి 31 నాటికి మూడు సంవత్సరాలకు పైగా వున్న పదవులన్నింటిని ఖాయం చేయడంగాని లేక ఖాయం చేయాలని తలపెట్టడంగాని జరగాలని, సరాసరి రిక్రూటుమెంట్ ద్వారా ఆ పదవులను భర్తీచేయాలని, కొత్తగా రిక్రూట్‌మెంటు చేయకూడదనివున్న నిషేధాన్ని తొలగించాలని, సరాసరి రిక్రూటుమెంటును కొనసాగించాలని రాష్ట్రప్రభుత్వం ఇప్పుడు నిర్ణయించింది. అటువంటి కేసుల విషయాలన్నిటిలోనూ, ఆ పదవులకు సరాసరి రిక్రూట్‌మెంట్ నిలుపుదలచేసిన సంవత్సరాలను, వయః పరిమితికి కలపాలని కూడా నిర్ణయించింది.

## పబ్లిక్ వర్క్సుశాఖకు సంప్రదింపుల కమిటీ

పబ్లిక్ వర్క్సు, విద్యుచ్ఛక్తి శాఖలకు ముఖ్యమంత్రి అధ్యక్షులుగా శాసనసభ్యులతోకూడిన సంప్రదింపుల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇరిగేషన్, కమ్యూనికేషన్‌శాఖల మంత్రులు కూడా ఆ కమిటీలో సభ్యులుగా వుంటారు.

## సహకార సేద్యసంఘాలకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు

సహకార వ్యవసాయ సంఘాలకు రిజిస్ట్రేషన్ ఫీజులను, స్టాంపు డ్యూటీని మినహాయిస్తూ గవర్నరు ఉత్తరువులు జారీ చేశారు.

## హైదరాబాద్‌లో ఎగుమతి, దిగుమతుల చీఫ్ కంట్రోలర్ ఆఫీసు

హైదరాబాద్‌లో ఎగుమతి దిగుమతుల చీఫ్ కంట్రోలర్ కార్యాలయాన్ని ఏర్పరచవలసినదిగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనను కేంద్రప్రభుత్వం ఆమోదించింది. ఈ కార్యాలయం స్థాపించినందువల్ల ఆంధ్రప్రదేశ్ నుంచి ఎగుమతుల విస్తరణకు గల ఇబ్బంది తీరగలదు. ప్రస్తుతం సుమారు 45 కోట్లు వున్న ఎగుమతి వ్యాపారాన్ని 1971-72 నాటికి రెట్టింపు చేయడానికి ప్రభుత్వం ఉద్దేశించింది.

## వ్యవసాయ పరిశ్రమల కార్పొరేషన్

వ్యవసాయ పరిశ్రమల కార్పొరేషన్ (లిమిటెడ్) డైరెక్టర్ల బోర్డుల్లో డైరెక్టరుగా శ్రీ బి. యన్. రామన్, ఐ. ఎ. యస్. నియమింపబడినారు.

ఈ కార్పొరేషన్‌కు శ్రీరామన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమింపబడినారు. శ్రీ రామన్ వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టరుగా కూడా వ్యవహరిస్తారు.

ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల కార్పొరేషన్ (లిమిటెడ్) మేనేజింగ్ డైరెక్టరుగా పదవస్వీకారం చేసిన పిదప శ్రీ బి. యన్. రామన్ తిరిగి ఉత్తరువులు జారీ చేయబడేవరకు, జనసంబంధశాఖ, సంచాలకుని విధులను కూడా అదనంగా, నిర్వహిస్తారు.

## కేంద్ర జల, విద్యుత్ సంఘం అధ్యక్షుడుగా శ్రీ జి ఎ. నరసింహారావు



కేంద్ర జల విద్యుత్ సంఘం అధ్యక్షుడుగా రాష్ట్ర పబ్లిక్ వర్క్స్ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ జి ఎ. నరసింహారావు జూన్ ఆరవ తేదీన ఢిల్లీలో పదవీ స్వీకారంచేశారు. శ్రీ రావు ఈ పదవికి సరాసరి నియుక్తులైన మొదటి దక్షిణ భారతీయుడు. ఆయన వయస్సు 56 సంవత్సరాలు. శ్రీ రావు 1956లో చీఫ్. ఇంజనీయర్ అయ్యారు దేశంలోని చీఫ్ ఇంజనీర్లందరిలోకీ ఆయన పిన్న వయస్కుడు. అంతేకాక ఆ పదవిని ఎన్నో సంవత్సరాలు నిర్వహించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, కృష్ణా బరాజీలతోసహా రాష్ట్రంలోని అన్ని భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులకూ ఆయన ఆధిపత్యం వహించారు. ఆయన గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం సర్వీసునుంచి రిటైర్ అయ్యారు. అయితే మూడేళ్ల పదవీకాలం పొడిగించారు. వరదలకు సంబంధించిన ప్రపంచవిజ్ఞానసమితి పరిశీలక బృందం ఆయనను ఇండియానుంచి నిపుణుడుగానియమించారు.

## న్యాయపాలన

### న్యాయమూర్తి శ్రీ మాధవరెడ్డి

పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ కొండా మాధవ రెడ్డి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 17 వ శాశ్వత న్యాయమూర్తిగా మే28 న పదవీ ప్రమాణం చేశారు ప్రధాన న్యాయమూర్తి శ్రీ పి. జగన్మోహన్ రెడ్డి వేసవి శెలవలు కారణంగా హైకోర్టు మూసివుండడంవల్ల తమ కార్యాలయం గదిలోనే పదవీ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు ఇప్పుడు హైకోర్టులో యిద్దరు అదనపు న్యాయమూర్తులతో సహా 19 మంది న్యాయమూర్తులు వున్నారు.

# అధికార భాషపై శ్వేత పత్రం

రాష్ట్రంలో తెలుగును అధికార భాషగా ప్రవేశపెట్టి అమలు పరిచే సందర్భంగా ఎదురవుతున్న సమస్యలను వివరిస్తూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఒక శ్వేత పత్రం ప్రకటించింది. దీనిని జులై 2 వ తేదీన శాసనసభకు సమర్పించారు. శ్వేత పత్రంలో ఉల్లేఖించబడిన కొన్ని ముఖ్యాంశాలు :

అనువాదాలకు ఒక నిర్దుష్టమైన పద్ధతిని రూపొందించాలని ప్రభుత్వం ఎన్నో విధాల ప్రయత్నిస్తున్నది. ప్రస్తుత పరిస్థితులలో అనువాదాలు అన్నవి అనేక విశిష్టమైన లక్షణాలను సంతరించుకోవలసి ఉన్నది. ఈ లక్షణాలన్నింటిని ఒక మూసలో చేర్చినట్లు, పరస్పరం సమన్వయం చేయగలగడం ఒక సులాన సాధ్యమయ్యే విషయం కాదు. ఒకవైపు చట్టాలలోని పదాలకు ప్రామాణికమైన పద నిర్వచనం, భాషా సౌలభ్యం, శైలి, సమన్వయ పూర్వకమైన సహజత్వాన్ని ప్రతిబింప చేయడంతోపాటు అనువాదాలు సాధ్యమైనంత వరకు ఆమోదయోగ్యమైనవిగా ఉండేటట్లు శ్రద్ధ వహించడం అత్యవసరం.

సాంకేతిక సంబంధమైన విషయాలను అనువదించేటప్పుడు అతి సూక్ష్మమైన అటువంటి పదాలలో అంతర్లీనంగా ఉండే అతి సూక్ష్మమైన భావం ఏవిధంగా కూడా దెబ్బ తినకుండా సరియైన భావ వ్యక్తీకరణకు, ముఖ్యంగా సాహిత్య స్థాయిగల భాషను ఏర్చి కూర్చుకోవడం అనేక విధాల కష్ట సాధ్యమేగాక, వాదోపవాదాలకు తావుయిచ్చే అవకాశం లేక పోలేదు. తొలిసారిగా ఇప్పుడు అటువంటి ప్రయోగం జరుగుతున్నది.

## అతిపరిమితమైన అనువాదకుని స్వేచ్ఛ

" ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాలకు ప్రామాణికమైన తెలుగు అనువాద ప్రతులు తయారు చేయడంతో అనువాదకునికి గల స్వేచ్ఛ బహు పరిమితమైనది మాత్రమే. సులభసాధ్యంకాని పరస్పరం సమన్వయం చేయడానికి వీలులేని అనేక విషయాలను దృష్టిలో ఉంచుకుని వాటన్నింటినీ అతడు సంతృప్తి పరచడానికి ఒక "బ్యాలెన్సు" సాధించడానికి కృషి చేయాలి. అనువాదకుడు ఎటువంటి పద్ధతిని లేక ఎటువంటి సూత్రాలను అనుసరించవలసినదీ, ఒక సహేతుకమైన విధానాన్ని చేపట్టడమే తప్ప ఈ విషయంలో ఖచ్చితమైన విధానాన్ని శాసించడానికి వీలులేదు

ఇంగ్లీషు పదాలు, ఇంగ్లీషు నుడికారానికి అలవాటుపడిన వారికి, ఇంగ్లీషులో ఆలోచించే వారికి నిఖార్సైన, శుద్ధఇంగ్లీషు పాఠ్యప్రతి నుంచి చేసిన ఎటువంటితెలుగు అనువాదమైనా వింతగా విచిత్రంగా, కృత్రిమంగా తోచక తప్పదు ప్రస్తుతం అమలులో ఉన్న శాసనాలకు, ప్రామాణికమైన తెలుగు అనువాద ప్రతులు తయారుచేయాలంటే ఇట్లు న్యాయ శాస్త్రాధ్యయనం భాషాపాండిత్యం తోపాటు, ఇంగ్లీషు పదాలకు సరియైన పదజాలాన్ని ఎన్నుకొనగలగడంతోపాటు అది ఆమోదయోగ్య మౌతుందా అన్న విషయాన్ని ఊహించుకొనే నిశితదృష్టి, కొన్ని పదాలు అనివార్యమై తోచిన సందర్భంలో అటువంటి పదజాలాన్ని రూపొందించడంలో స్వతంత్రించి కొత్త మార్గాన్ని చేపట్టగల సాహసం ఉండాలి. ముఖ్యంగా ఇవి విజ్ఞులందరికీ ప్రత్యేకించి ప్రజలకు ఆమోద యోగ్యమై ఉండడం అత్యవసరం.

## అనువాదకుల ఇబ్బందులు

శాసనాల ముసాయిదాలను మొదట రూపొందించే వారికంటె అనువాదకుల పరిస్థితి కొంత ఇబ్బందిగా ఉంటుందని అంగీకరించాలి. ప్రస్తుతం తెలుగులో శాసనాలను అనువదించే వారు భవిష్యత్తులో తమంతట తామే శాసనాల ప్రతులను తయారు చేయవలసి ఉంటుంది కాబట్టి ముందుగానే అవసరమైన సాంకేతిక పదజాలాన్ని రూపొందించుకొన్నప్పుడు, ఇక ముందు శాసనాలను రూపొందించే సందర్భంగా అపోహలకు దారితీసే పరిస్థితి ఉండదు. ఇప్పటికి, తరువాత కూడా ఒకేవిధమైన సాంకేతిక పదజాలం ఉంటుంది కాబట్టి అభిప్రాయ భేదాలకు తావు ఉండదు.

ఇతర భాషల నుండి తీసికోవడం, రూపొందించడం, మొదలైన పద్ధతులద్వారా కొత్త పదాలను స్వీకరిస్తూ ఉంటాము. కొత్తగా రూపొందించే పదాలు ప్రారంభంలో విడ్డూరంగా ఉన్నప్పటికి తరువాత భాషలో జీర్ణించుకొని పోతాయి. ఉదాహరణకు విజ్ఞాన శాస్త్రరంగంలోని సాంకేతిక పదాలు అన్నీ ఇతర భాషలనుండి స్వీకరించినవే, అందుకే అంతర్జాతీయ సమావేశాలతో పరస్పరావగాహనకు వీలవుతున్నది. అయితే జీవద్భాషకు ఇతర భాషల నుండి పదాలు స్వీకరించడానికి ఒక పరిమితి ఉండదు.

## అనువాదాలపై విమర్శలు

శాసనాలను తెలుగులో అనువదించిన పద్ధతిపై విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా అనువాదాలలో సాంకేతిక పదాలను ఒక్కొక

సమయంలో పండితులు కూడా గ్రహించలేక పోవచ్చు. కాని ఇందులో కొన్ని పదాలు మామూలు నిరక్షరాస్యులు ఉపయోగించేవి ఉన్నాయి.

ఇంగ్లీషులో "కాన్సెల్" అబ్రొగేట్, రిపీల్, క్వాష్, అన్న పదాలకు వేరు వేరు అర్థాలు ఉన్నవని, వీటికి తెలుగులో వేరు అర్థాలు ఇచ్చే విధంగా పదాలను ఇవ్వడం అవసరమని శ్వేత పత్రంలో పేర్కొన్నాను. ఉదాహరణకు పై ఇంగ్లీషు పదాలకు తెలుగులో రద్దు చేయు, కొట్టి వేయు, నిరస్తముచేయు, త్రోసి వేయు, అంతమొందించు" అని అనువదించారు.

## విదేశ పదాలు ఉపయోగించడంవల్ల చిక్కులు

అనువాదాల సందర్భంగా విదేశ పదాలను అలాగే ఉంచడం వల్ల తెలుగులో గందరగోళ పరిస్థితికి అవకాశం ఉంటుంది.

చారిత్రక కారణాల వల్ల ఆంధ్ర ప్రాంతంపై ఇంగ్లీషు ప్రభావం, తెలంగాణాపై ఉర్దూ ప్రభావం ఎక్కువ. ఇందువల్ల అనువాదాలలో భాషా సంబంధమైన కొన్ని చిక్కులు ఎదుర్కొన వలసి వస్తున్నది.

అనువాదాలను పరిశీలిస్తే, వ్యాకరణ సంబంధమైన లోపాలు కనిపించవు. కాని సాంకేతిక పదాలను తెలుగులో అనువదించే సందర్భాలలో కొన్ని చిక్కులు కనిపిస్తున్నాయి. అనువాదాల కమిటీ కొత్త పదాలను రూపొందించే సమయంలో వీలయినంత వరకు వాడుకలో ఉండి, తెలిసిన పదాలను ఉపయోగించడానికి ప్రయత్నించింది.

## విమర్శలకు సమాధానం

అనువాదాలలో ఉపయోగించిన పదాలు సులభ గ్రాహ్యం కావనే విమర్శ ఉన్నది. అయితే ఈ పదాలు ఎవరికి అర్థం కావన్నది పరిశీలించాలి. మన దేశంలో శాసనాలు, విజ్ఞాన శాస్త్రాలకు సంబంధించిన పరిజ్ఞానం తక్కువ. అందుచేత సాంకేతిక పదాలు అనువదించిన పద్ధతి అందరకు అర్థంకాక పోవచ్చు.

కొత్త పదాలను సృష్టించ వలసిన అవసరం వచ్చినప్పుడు, సంస్కృత పదాలను ఉపయోగించాలని హిందీ వాదులు మాత్రమే కాక, దక్షిణాది ప్రతినిధులు కూడా సూచించారు.

తెలుగులోనే వ్యవహారాలన్నింటిని నిర్వహించడం జరిగినప్పుడు, న్యాయశాస్త్ర వ్యవహారాలు పూర్తిగా మారిపోతాయి. శాసనాలపట్ల ప్రజల వైఖరి కూడా మారుతుంది. బానిస భావం, వ్యతిరేకత బదులు, విమర్శనాత్మక దృషితో పరిశీలించడం అలవాటవుతుంది. *

---

## రాష్ట్ర సాంఘిక సంక్షేమ మండలికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం

ముఖ్యమంత్రి శ్రీ కాసుబ్రహ్మానందరెడ్డి జూన్ 27 న రాష్ట్ర సాంఘిక సంక్షేమ మండలికి ప్రారంభోత్సవం జరిపారు. గ్రామీణ గృహనిర్మాణ పథకాలను పెద్ద ఎత్తున చేపట్టవలసిన ఆవశ్యకత గురించి, ఆంధ్రప్రదేశ్, మరికొన్ని యితర రాష్ట్రాలు ప్రణాళికా సంఘానికీ, జాతీయ అభివృద్ధిమండలికీ నివేదిస్తూనే వున్నాయని ఆయన అన్నారు.

వెనుకబడిన తరగతులవారికి ప్రభుత్వం అందజేస్తున్న సదుపాయాలను గురించి సంక్షిప్తంగా ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి 1967_68 సంవత్సరంలో 6, 7 తరగతులు చదివే షెడ్యూల్డు కులాల విద్యార్థుల సహాయార్థం, 28.80 లక్షల రూపాయల మొత్తం స్కాలర్‌షిప్పుల క్రింద పంపిణీ చేయబడిందనీ, యిది గాక 44,300 మంది విద్యార్థులకు పుస్తకాల నిమిత్తం జిల్లాపరిషత్తులచే రు. 15.13 లక్షలు పంపిణీచేయడం జరిగిందనీ అన్నారు.

560 వైద్యకళాశాలల విద్యార్థులకు, 384 ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు భారత ప్రభుత్వ స్కాలర్‌షిప్పులు యివ్వడం జరిగిందని కూడా ఆయన అన్నారు.

గత సంవత్సరం రాష్ట్రంలోని 769 వసతి గృహాలలో, 32,000 మంది హరిజన బాలురకు పోషణ ఏర్పాటు చేయబడినది. దీనిక్రింద 65 లక్షల రూపాయలు ఖర్చుపెట్టబడినవి.

18 లక్షల రూపాయల ఖర్చుతో 3,400 హరిజన కుటుంబాలకు ఇళ్ళస్థలాలు మంజూరు చేయడం జరిగింది. గత సంవత్సరము ఆర్థికంగా వెనుకబడిన తరగతులవారికి రాష్ట్ర స్కాలర్‌షిప్పులక్రింద రు. 46.52 లక్షలు ఖర్చుపెట్టడం జరిగింది. స్కాలర్‌షిప్పులు పొందినవారిలో 700 మంది వైద్యవిద్యార్థులు, 552 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు, 1500 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఉన్నారు అని ముఖ్యమంత్రి అన్నారు.

# డ్రెయినేజ్ మహాసభ

గుంటూరు, కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల డ్రెయినేజి కాన్ఫరెన్సు జూన్ 6 న విజయవాడలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి శ్రీ శీలం సిద్ధారెడ్డి అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి సభను ప్రారంభించారు.

రాష్ట్ర రెవిన్యూ శాఖమంత్రి శ్రీ వి. బి. రాజు, ఎక్సైజు శాఖమంత్రి శ్రీ వెనిగళ్ళ సత్యనారాయణ, దేవాదాయ శాఖమంత్రి శ్రీ రుద్రరాజు రామలింగరాజు, నాలుగు జిల్లాలకు చెందిన పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సభ్యులు, జిల్లా పరిషత్ అధ్యక్షులు, వివిధ సమితుల అధ్యక్షులు, జిల్లాకలెక్టర్లు, బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారులు, రైతు ప్రతినిధులు సుమారు వెయ్యి మందికిపైగా సమావేశానికి హాజరయ్యారు.

రాష్ట్ర నీటి పారుదల శాఖమంత్రి శ్రీ సిద్దారెడ్డి సభకు అధ్యక్షత వహిస్తూ మిత్రా కమిటీ రిపోర్టు ననుసరించి మురుగు నీటి పథకానికి రూ. 30 కోట్లు కాగలదని ఈ పథకానికి ప్రాముఖ్యత ఇచ్చి అమలు పరచాలని అన్నారు. అన్ని చిన్ననీటి పథకాలు అమలు పరచడానికి వందకోట్లు అవసరమని ఆయన అన్నారు.

వంశధార, ఏలేరు, నిజాంసాగర్ తదితర ప్రాజెక్టుల నిర్మాణానికి రైతులు అభివృద్ధి పన్నులు ఇస్తామని ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని ఆయన అన్నారు.

అభివృద్ధి పన్ను వసూలుచేయనిదే ప్రస్తుత పరిస్థితిలో ఏ కార్యం చేపట్టడం సాధ్యంకాదని శ్రీ సిద్దారెడ్డి అన్నారు. కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలరైతులు మురుగు నీటి పథకం అమలుకు సాలీనా 25 రూపాయలు చొప్పున అయిదు ఏళ్ల 125 ఇస్తే ఈ సమస్య పరిష్కారం కాగలదని ఆయన తెలియచేశారు. కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలలో వరద, మురుగు, ముంపు సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దృష్ట్యా రాష్ట్ర శాసనసభలో ఒక శాసనాన్ని ప్రవేశ పెట్టనున్నట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి సభలో వెల్లడించారు.

గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలలో వరద నివారణ పథకానికి కనీసం 30 కోట్ల రూపాయలు వ్యయం కాగలదని ముఖ్యమంత్రి అన్నారు.

వరద, మురుగు, ముంపులవల్ల రాష్ట్రంలో అపారంగా నష్టం వస్తోందని, ఆ విషయం, హాజరయిన సభ్యులందరికి తెలుసునని ఆయన అన్నారు. 1964వ సంవత్సరంలో వచ్చిన వరదలవల్ల అపార నష్టంవచ్చి మన దృష్టిని కేంద్రీకరించడం జరిగిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీని నియమించడం, వారు రాష్ట్రంలో పర్యటించి సమగ్రమైన నివేదికను సమర్పించడం జరిగిందని ఆయన అన్నారు.

కేంద్ర ప్రభుత్వం వద్దనుంచి ఆర్థిక సహాయం ఎంతవరకు లభ్యమవుతుందా అనే విషయం ఆలోచించాలని, అయినా వారు మనకు సహాయపడే విధంగా మనం మంచి అభిప్రాయం కలుగ చేయాలని ముఖ్యమంత్రి అన్నారు.

నాల్గవ పంచవర్ష ప్రణాళిక స్వభావ స్వరూపాలు, పెట్టుబడి, దానికి కావలసిన వనరులు ఎక్కడనుండి వస్తాయని ఆలోచిస్తే కొంత అనిశ్చితంగావుందని, అయినా మనం చేయవలసిన కృషి చేయాలని ఆయన అన్నారు.

బియ్యం ప్రపంచంలో తరుగు పదార్థమనీ ఆంధ్రప్రదేశ్ ఎంతగా ఉత్పత్తిచేస్తే అంతగా దేశానికి లాభం చేకూరగలదని అందువలన తలపెట్టిన కార్యక్రమం వెంటనే కొనసాగేందుకు ప్రయత్నంచేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

సమావేశానికి వచ్చిన ప్రతినిధులు, రైతులు అందరూ క్షుణ్ణంగా ఆలోచించి ఆమోదాన్ని తెలిపితే తదుపరి సాధక బాధకాలు చూసుకొనవచ్చునని ముఖ్యమంత్రి అన్నారు. ఖర్చు విషయంలో ప్రభుత్వం జోక్యంచేసుకొనదనీ, దానిని సంరక్షించుకొనుటకు ప్రతినిధులతో ఒక బోర్డును ఏర్పాటుచేసుకొని అది దుర్వినియోగం కాకుండా వుండేటట్టు రైతులే చర్యలు గైకొనాలనీ ముఖ్యమంత్రి తెలిపారు.

ఈ పథకానికి నాలుగుకోట్ల రూపాయలు విదేశీ మారక ద్రవ్యంకావాలని, డ్రెడ్జర్లను విదేశాలనుంచి కొనుగోలు చేయాలని అన్నారు. కార్యక్రమ నిర్వహణకు విశాల దృష్టితో వ్యవహరించాలని ఏ ప్రాంతం రైతు ఎంత ఇవ్వాలనే ప్రసక్తి రాకూడదని పథకం అమలు పరచాలనే దృష్టితో రాష్ట్రం, దేశం అభివృద్ధికి పాటుపడాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు

నీటిపారుదలకు సంబంధించిన ఛీఫ్ ఇంజనీరు శ్రీ పి. టి. మల్లారెడ్డి మిత్రా కమిటి సిఫారసులవివరాలను తెలియజేసి, డెల్టా జిల్లాలలో వరద నిరోధకచర్యలకై రూ30 కోట్లు అవసరమయ్యాయని అన్నారు, డెల్టా జిల్లాలలో నీటిపారుదల, వరదనిరోధక పనులకు అధిక ప్రాధాన్యతనుయిస్తూ అయిదేళ్ళవ్యవధిలో సుమారు 60కోట్ల రూపాయల వ్యయంతో కూడిన పథకాన్ని ఒకదానిని పి డబ్ల్యు డి. శాఖ, రెవెన్యూ శాఖతో సంప్రదించి రూపొందించింది. ప్రభుత్వం వద్ద తగినంత ఆర్థిక వనరులు లేనందువల్ల యిందుకు అంగీకరించే రైతులను బెటర్‌మెంట్ లెవీని చెల్లించాలని కోరుతున్నారు. ఇందుకు రైతులు సహకరించవలసిందిగా ఛీఫ్ ఇంజనీరు రైతులకు విజ్ఞప్తి చేశారు. ★

# డ్రెయినేజ్ సెస్సు బిల్లు

కృష్ణా, గోదావరిడెల్టా భూములపై డ్రెయినేజి సెస్సు విధించడానికి నిర్దేశించిన బిల్లును ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానంద రెడ్డి అధ్యక్షతన 15 మంది సభ్యులతో ఏర్పరచిన సెలక్టు కమిటీ పరిశీలనకు పంపడానికి శాసనసభ జూన్ 9 న నిర్ణయించింది. జూలై 8 వ తేదీ నాటికి సెలక్టు కమిటీ తన నివేదికను శాసన సభకు సమర్పించాలని నిశ్చయించారు.

## కమిటీ సభ్యులు

ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పరచిన సెలక్టు కమిటీలోని మిగిలిన సభ్యుల పేర్లివి : శ్రీ వి. బి. రాజు (రెవిన్యూమంత్రి), శ్రీ సిద్దారెడ్డి (ఇరిగేషన్ మంత్రి) శ్రీ ఎ. భగవంతరావు, శ్రీ ఎ. భాస్కరరావు, శ్రీ పాండురంగరాజు, శ్రీ మూర్తిరాజు, శ్రీ ఆర్. కె. చౌదరి, శ్రీ మాలె వెంకటనారాయణ, శ్రీ సోమేశ్వరరావు, శ్రీ బి. రత్నసభాపతి శ్రీ పి. సుబ్బయ్య, శ్రీ ఆర్. సూర్య నారాయణరాజు, శ్రీ కుడిపూడి ప్రభాకరరావు, శ్రీ బి. నిరంజనరావు.

ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రతి ఏటా వరదలవల్ల కొన్ని కోట్ల రూపాయల మేరకు డెల్టా ప్రాంతాలలో నష్టం సంభవిస్తున్నందున వీలయినంత త్వరలో డ్రెయినేజి పథకాలను అమలుజరిపే లక్ష్యంతో బిల్లును ప్రవేశపెట్టినట్లు వివరించారు.

డ్రెయినేజి పథకాలవల్ల వెంటనే లాభం పొందే కృష్ణ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల రైతులు చాలకాలంగా దీని కొరకు ఎదురు చూస్తున్నారని, వ్యవసాయదారులకు వెంటనే ఉపయోగపడే ఈ పథకాలకు కేంద్ర సహాయం నిమిత్తం ఎదురు చూడడానికి వీలులేదని, అందుచేతనే బిల్లును రూపొందించామని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగా లేనందున, భారీ ఇరిగేషన్ పథకాలతోపాటు, డ్రెయినేజి పథకాలకు కూడా అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూర్చే స్థితిలోలేదని ముఖ్యమంత్రి వివరించారు.

## సవరణ తిరస్కృతి

ప్రజాభిప్రాయ సేకరణకు బిల్లును సమర్పించాలని శ్రీ పూల సుబ్బయ్య ప్రతిపాదించిన సవరణను శాసనసభ తిరస్కరించింది.

ఇరిగేషన్ మంత్రి శ్రీ సిద్దారెడ్డి చర్చకు సమాధానమిస్తూ సెస్సు రూపంలో ఆయా డివిజన్లలో సేకరించిన మొత్తాన్ని బయట ఖర్చుపెట్టడం అంటూ జరగదని హామీ యిచ్చారు.

మూడు జిల్లాలలో డ్రెయినేజి పథకాలను అమలుజరిపే నిమిత్తం, సర్వాధికారాలుకల ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయగలమని అన్నారు. సెస్సురూపంలో వసూలుచేసే మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వ సమాహార నిధిలో కలిపినప్పటికీ, బోర్డు డ్రెయినేజి నిధులను వినియోగించుటకు అన్ని పథకాలను స్వయంగా అమలు జరుపవచ్చునని, దీని నిమిత్తం అవసరమైన కమిటీలు ఉండగలవని అన్నారు.

## సహాయానికి కేంద్రం తిరస్కృతి

డ్రెయినేజి పథకాలను అమలుజరపడానికి ఎట్టి సహాయం చేయలేమని, రాష్ట్ర ప్రభుత్వమే తగిన నిధులను సంపాదించుకోవలసిందని కేంద్రం సూచించిందని మంత్రి సిద్దారెడ్డి అన్నారు. కేంద్ర సహాయాన్ని రాష్ట్రం అభ్యర్థించ లేదనుట పొరపాటని స్పష్టంచేశారు.

డ్రెయినేజి పథకాలతో ప్రత్యక్ష సంబంధం గల రైతులతోను, శాసనసభ్యులతోను, ఇతర ప్రజాసంస్థల ప్రతినిధులతోను, చివరకు ఇరిగేషన్ శాఖ అధికారులతోను సమగ్రంగా చర్చించిన పిమ్మటనే బిల్లును శాసనసభలో ప్రవేశ పెడుతున్నామని వివరించారు.

మిత్రి కమిటీ నివేదికలో పేర్కొనకుండా ఉన్న డ్రెయినేజి పథకాలనుకూడా ఈ బిల్లు క్రింద అమలు జరపగలమని అన్నారు. ప్రభుత్వం ఏర్పరచే బోర్డునకు డ్రెయినేజి పథకాలను పి. డబ్ల్యు. డి. శాఖ ద్వారా, లేదా ప్రైవేట్ కంట్రాక్టర్లద్వారా కాని పథకాలను అమలుజరిపే అధికారం స్వేచ్ఛ ఉండగలదనిఅన్నారు.

మూడు జిల్లాలలో ఆరు సంవత్సరాలలో డ్రెయినేజి పథకాలను అమలుజరపడానికి 30 నుండి 35 కోట్ల వరకు అవసరం కాగలదని అన్నారు. బిల్లులో మూడు డివిజన్లను ఉదహరించారు.

గోదావరి తూర్పు డివిజన్ ఒకటి, పశ్చిమ కృష్ణా, మధ్య కృష్ణా ఒక డివిజన్, దక్షిణ కృష్ణా, పశ్చిమ గోదావరి డివిజన్ ఒకటి.

మూడు డివిజనలలోను డ్రెయినేజి రేట్లు వేరువేరుగా ఉంటాయి. 10 నుండి 15, తరువాత 25 రూపాయల వరకు సెస్సు రేట్లు ఉంటాయి. ఆరు సంవత్సరాలపాటు సెస్సును వసూలు చేసారు.

నాల్గవ ప్రణాళిక క్రింద మేజర్ ఇరిగేషన్ పథకాలను మిగిలిపోయిన పథకాలకు 150 కోట్ల వరకు ఖర్చు పెట్టవలసి ఉన్నందున డ్రెయినేజి పథకాలకు తగిన నిధులను సేకరించే స్థితిలో లేదని అన్నారు. పథకాలను అనుసరించి ఎనిమిది నుండి తొమ్మిది కోట్లు ఖర్చు అయ్యే మూడు పెద్ద రిజర్వాయర్లను వరదనీటి

నిమిత్తం నిర్మించవలసి ఉంటుందని, ఉప్పుటేరును అయిదుకోట్ల ఖర్చుతో వెడల్పు చేయడమే కాక, బుడమేరు పథకం కూడా చేపట్టగలమని అన్నారు.

ఫ్రంట్ సభ్యుడు శ్రీ వై. వెంకటరావు ప్రసంగిస్తూ డ్రైనేజి సెస్సు రైతులకు భారంగా ఉండగలదని, ప్రభుత్వమే ఈ పథకాల ఖర్చును భరించాలని సూచించారు. శ్రీ సి. హెచ్. రాజేశ్వరరావు (కమ్యూనిస్టు) ప్రసంగిస్తూ డ్రైనేజి పథకాలను అమలు జరిపే నిమిత్తం ఏర్పరచే బోర్డు అధికారాలను పూర్తిగా వివరించలేదని అన్నారు. ప్రతి ఏటా అయిదు కోట్ల రూపాయలను ప్రభుత్వం స్వయంగా సేకరించి డ్రైనేజి పథకాలకు ఖర్చు పెడితే బాగుండేదని అన్నారు.

శ్రీ ఆర్. సత్యనారాయణరాజు మాట్లాడుతూ డ్రైనేజి సెస్సును రైతుల నుండి సేకరించడం అన్యాయమని, మద్య నిషేధాన్ని రద్దు చేయడంవల్ల ప్రభుత్వానికి అవసరమయిన నిధులు లభ్యం కాగలవని సూచించారు శ్రీ ఎ. భాస్కరరావు బిల్లును సమర్థిస్తూ ప్రసంగించారు. అయిదెకరాల లోపు భూమి ఉన్న రైతులను సెస్సు నుండి మినహాయించాలని శ్రీ మాలే వెంకట నారాయణ సూచించారు. సెస్సు ద్వారా సేకరించే నిధులలో సగం వంతును ఋణంగా భావించి రైతులకు తిరిగి ఇచ్చివేయాలని శ్రీ కె. ప్రభాకరరావు మరొక సూచన చేశారు.

జనసంఘం సభ్యుడు శ్రీ ఎ. మాధవరావు ప్రసంగిస్తూ డ్రెయినేజి పథకాలు అంచనాలు తయారుకాక ముందే డ్రెయినేజి సెస్సు వసూలు చేయడం అన్యాయమని విమర్శించారు.

శ్రీ బుచ్చిరాయుడు [ఎస్. ఎస్. పి.] బిల్లును వ్యతిరేకించారు.

ఆహార ధాన్యాలను లోటు రాష్ట్రాలకు సరఫరా చేస్తూ ఉన్నందున కేంద్ర సహాయానికి రాష్ట్రం ఒత్తిడి చేసి ఉండాలని రిపబ్లికన్ పార్టీ సభ్యుడు శ్రీ బి. వి. రమణయ్య అన్నారు. రైతులు కావలసిన నిధిని సమకూర్చినప్పుడు ఇక ప్రభుత్వం చేయవలసినది ఏమీ ఉండదని అన్నారు.

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య ప్రసంగిస్తూ పన్నుల ద్వారా వసూలయ్యే మొత్తం నుండి ఇలాంటి భారీ నిర్మాణ పథకాలకు ప్రభుత్వం ఖర్చు పెట్టాలని అన్నారు. పన్నుల భారం ఇప్పుడే అధికంగా ఉన్నందున రైతులపై అదనంగా పన్ను విధించడం తగదని అన్నారు.

## డ్రెయినేజ్ సెస్సు బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

15 మంది సభ్యులుగల సెలెక్టు కమిటీకి నివేదించబడిన డ్రెయినేజ్ సెస్సు బిల్లును జూలై 10వ తేదీన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఆమోదించింది.

సెలెక్టు కమిటీవారు బిల్లులో ఒక ప్రధానమైన మార్పు సూచించారు. దీని ప్రకారం సెస్సు విధించడంవల్ల రైతులకు యిబ్బంది కలుగుతుందని ప్రభుత్వానికి విశ్వాసం కలిగిన పక్షంలో సెస్సు విధించకుండా మినహాయించే అధికారం ప్రభుత్వానికి సంక్రమించింది.

డ్రెయినేజ్ బోర్డులో 12 మందికి తగ్గకుండా 20 మందికి మించకుండా సభ్యులుండాలని ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణ కూడా బిల్లులో చేర్చబడింది.

డెల్టా ప్రాంతాలలోని శాసనసభ్యులకు బోర్డులో ప్రాతినిధ్యం కలుగజేయబడుతుందని యిరిగేషన్ మంత్రి శ్రీ శీలం సిద్దారెడ్డి యీ సందర్భంలో హామీ యిచ్చారు.

# హైదరాబాదులో విద్యుత్ సౌధ ప్రారంభోత్సవం



ఉప ప్రధాని శ్రీ మొరార్జీ దేశాయ్ జూన్ 24న హైదరాబాదులో 'విద్యుత్ సౌధ'కు ప్రారంభోత్సవంచేస్తూ విద్యుచ్ఛక్తి ఉత్పత్తి పెంపొందించి సరఫరా మెరుగుపరచి ఉత్పత్తి వ్యయం తగ్గించి గ్రామాలలో ఉపయోగించే పంపుసెట్లను రెట్టింపు చేసినందుకు ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి బోర్డును అభినందించారు. 'విద్యుత్ సౌధ' 43 లక్షల రూపాయల ఖర్చుతో నిర్మితమైంది.

రాష్ట్రంలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి పెంపొందించడానికి అధికంగా ద్రవ్యం కావాలంటూ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, విద్యుచ్ఛక్తి బోర్డు అధ్యక్షుడు శ్రీ పి. నరసింహం చేసిన సూచనతో ఏకీభవిస్తున్నట్లు శ్రీ దేశాయ్ చెప్పారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, వ్యావసాయిక ఉత్పత్తి పెంపొందించడానికి విద్యుచ్ఛక్తి ఉపయోగపడుతుంది. కనుక విద్యుచ్ఛక్తి బోర్డులకు కూడా షెడ్యూల్డు బేంకులు, రీఫైనాన్సింగు సంస్థ, జీవిత భీమా సంస్థ ఋణాలు ఇచ్చే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు.

వ్యావసాయిక, పారిశ్రామిక అభివృద్ధి కార్యక్రమాలకు సహాయపడడానికి కేంద్రం ఎప్పుడూ సంసిద్ధంగా ఉంటుందని శ్రీ దేశాయ్ హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉంది.

1970_71 వరకు అవసరాలకు చాలినంత విద్యుచ్ఛక్తి రాష్ట్రంలో ఉత్పత్తి అవుతుందని తెలుసుకొని, ఆనందిస్తున్నట్లు శ్రీ దేశాయ్ చెప్పారు. ఆ తరువాత పెరిగే అవసరాలకు చాలినంత విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేయడానికి కొత్త పథకాలు తయారు అవుతాయి.

విద్యుచ్ఛక్తి రంగంలో సత్వర అభివృద్ధి సాధించినందుకు ఆయన ఆంధ్రప్రదేశ్‌ను అభినందించారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో మూడవ వంతు పట్టణాల నుంచి లభిస్తున్నది. కాని ప్రభుత్వం, ఆదాయంలో మూడవ వంతు మాత్రమే గ్రామీణ ప్రాంతాలలో ఖర్చు చేస్తున్నది. ఇందుకు పూర్తిగా భిన్నమైన విధంగా వ్యయం జరగాలని శ్రీ దేశాయ్ సూచించారు. గ్రామీణ ప్రాంతాలను సర్వతోముఖంగా అభివృద్ధి పరచాలి. అనాడు పట్టణాలకు గ్రామాల నుంచి వలస నిలిచిపోతుంది.

కొత్తగూడెం, రామగుండం ప్రాంతాలలో లభ్యమయ్యే ముడి సరుకులతో విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసే అవకాశాన్ని ఇంత వరకు ఎందుకు వినియోగించలేదో అర్థం కావడంలేదని శ్రీ బ్రహ్మానందరెడ్డి అన్నారు.

ఈ ప్రారంభోత్సవానికి రాష్ట్ర గవర్నరు శ్రీ ఖండూభాయ్ దేశాయ్ అధ్యక్షత వహించారు.

చీఫ్ ఇంజనీరు శ్రీ కె. వి. శ్రీనివాసరావు వందన సమర్పణ చేశారు.

# పొలాలకు నీటి పారుదల - సుస్థిరమైన ఆర్థిక వ్యవస్థకు పునాది

* డాక్టర్ కె. యల్. రావు *

వ్యవసాయం బాగా లాభదాయకం కావాలీ అంటే, భూమి, నీరు అత్యవసరం. రైతుకు భూమి ఆత్మవంటిదయితే, నీరు అతని శరీరంలో ప్రవహించే రక్తం వంటిదని చెప్పవచ్చు. ఈ రెంటిలోనూ భూమి ఇప్పుడిప్పుడు, అదనంగా సమకూర్చుకోవడానికి ఇక అవకాశం లేనిదిగా తయారవుతున్నది. అయితే అదృష్టవశాత్తు, నీరుమాత్రం ఇంకా అంత వట్టిపోలేదు. అందుచేత, అధికోత్పత్తిని సాధించేందుకు ఈ నీటి వనరులను ఉపయోగించుకోవచ్చు. దేశంలో మనకు ఏమాత్రం నీరు వాడకానికి లభ్యమవుతుంది, అవకాశమున్నంతవరకూ నీటిని వినియోగించుకోవడంలో ఎదురయ్యే సమస్యలేమిటి అన్న సంగతిని, స్థూలంగా పరిశీలించడం మంచిది.

వర్షపాతాన్నిబట్టి, మనదేశాన్ని నాలుగు మండలాలుగా విభజించవచ్చు. సాలీనా 2,500 మిల్లీమీటర్లు లేదా అంతకుమించి వర్షం పడే ప్రాంతాలను మొదటి మండలంగా పరిగణించవచ్చు. అస్సాం రాష్ట్రం దాదాపు పూర్తిగానూ, పడమటి కనుమలకు అభిముఖంగా ఉత్తరాన బొంబాయి నుంచి దక్షిణాన తిరువనంతపురం వరకూగల పశ్చిమ తీరప్రాంతం, ఈ మండలంలో చేరుతాయి. దీనికి పూర్తిగా విరుద్ధం, వాయవ్యదిశన కచ్ వరకూ వ్యాపించిన రాజస్థాన్ ఎడారి, కాశ్మీరు రాష్ట్రంలో సముద్ర మట్టానికి ఎంతో ఎత్తున గల లడక్ పీఠభూమి. ఇక్కడ సంవత్సరానికి 250 మిల్లీమీటర్ల వర్షం కూడా కురవదు.

ఈ రెండు రకాల ప్రాంతాలకూ మధ్యే మార్గంగా ఉన్నవి మరో రెండు. వీటిలో, ఒక మోస్తరు అధిక వర్షపాతంగల మండలం ఒకటి. ఇక్కడ సాలుసరి వర్షపాతం 1,000 మొదలు 2,500 మిల్లీమీటర్ల వరకూ ఉంటుంది. మన ద్వీపకల్పంలో తూర్పు దిశనగల సువిశాల ప్రాంతాలు ఈ మండలంలో చేరుతాయి. ఇక స్వల్ప వర్షపాతంగల మండలం మరొకటి. అటు పంజాబ్ మైదాన ప్రాంతాల నుంచి వింధ్య పర్వత పంక్తులకు అడ్డంగా ఇటు దక్కన్‌లో పడమటి ప్రాంతాల వరకూ వ్యాపించింది ఇది. ఇక్కడి సాలుసరి వర్షపాతం 250 మొదలు 1,000 మిల్లీమీటర్ల వరకూ ఉంటుంది.

దేశం మొత్తంమీద లెక్క గట్టినప్పుడు, సాలుసరి వర్షపాతంలో 75 శాతం జూన్–సెప్టెంబర్ నెలల మధ్యలోనే ఉంటూంటుంది. ద్వీపకల్పంలోని ఆగ్నేయ తీరప్రాంతంలో మాత్రం వర్షంలో అధిక భాగం నవంబర్, డిసెంబర్ నెలలో కురుస్తూ ఉంటుంది.

## దేశంలో నదులు

రాజస్థాన్‌లోని థార్ ఎడారి మినహా, దేశంలో మిగతా అన్ని చోట్లా పెద్ద పెద్ద నదులే ప్రవహిస్తూ ఉన్నాయి. ఉత్తరాదిన హిమాలయాలలో పుట్టేనదులు, జీవనదులు. సంవత్సరం పొడుగునా వాటిలో నీరు ఉంటుంది. హిమాలయాలలోని మంచు ద్వారా వీటికి నీరు లభ్యమవుతుంది. ఇక, మధ్య భారతంలోనూ, దక్షిణాదినా గల నదుల్లో నీరు పూర్తిగా వర్షాలపైన ఆధారపడి ఉంటుంది. మొత్తం వర్షంలో చాలా హెచ్చుభాగం ఏ మూడు నాలుగు నెలలో మాత్రమే ఉంటుంది కనక, సంవత్సరంలో కొన్నాళ్ళపాటు ఈ నదులలో బహు స్వల్పంగా మాత్రమే నీరు మిగులుతుంది. వర్షాకాలంలో మాత్రం, మన నదులన్నిటిలోనూ నీరు వెల్లువలై ప్రవహిస్తూ ఉంటుంది. దానిలో చాలా భాగం వృథాగాపోయి సముద్రంలో కలుస్తుంది దారిలో ఎంతో సువిశాల ప్రాంతాలను ముంచెత్తి, ఆస్తి నష్టాన్నీ, ప్రాణనష్టాన్నీ కలిగిస్తూ ఉంటుంది. వర్షాలు నిలిచిపోయిన తర్వాతమాత్రం, ఒక పద్ధతి ప్రకారం వ్యవసాయం సాగించడానికి చాలినంత నీరు సాధారణంగా లభ్యంకాదు ఈ నదులలో. ఈ లోపాన్ని సరిదిద్ది, వర్షకాలం తర్వాతకూడా చాలినంత నీరు సేద్యానికి లభ్యమయేట్లుచూడడానికై, జలాశయాలను నిర్మించే పద్ధతి అమలులోకి వచ్చింది.

మనదేశంలో నదీ జలాలను సద్వినియోగ పరుచుకోవాలి అంటే, నీరు వృథాపోకుండా నిలవ చేసుకోవటం అత్యవసరమవుతున్న దన్నమాట. ఈ నిలవచేసుకునే సదుపాయమే లేనప్పుడు, ఇటు పొలాలకు పెట్టేందుకుగానీ, అటు విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి గానీ కచ్చితంగా చాలినంత నీటిని అందుబాటులో ఉంచుకోవటం సాధ్యపడదు.

## భూమిపై ప్రవహించే నీరు

దేశం మొత్తంమీద, వర్షంరూపేణా, 300 కోట్ల యకరాల అడుగుల పరిమాణంగల నీరు భూమిమీద పడుతున్నది. దీనిలో మూడోవంతు ఎండకు ఆవిరైపోతున్నది. 65 కోట్ల యకరాల

అడుగుల నీరు భూమిలోకి ఇంకిపోతున్నది. పోతే, 136 కోట్ల యకరాల అడుగుల నీరు మాత్రమే నదులలోకి వెళ్ళిచేరుతున్నది. నదులలో ప్రవహించే నీటినయినా పూర్తిగా ఉపయోగించుకోడానికి ఎన్నో ప్రతిబంధకాలు ఉంటూంటాయి.

పొలాలకు పెట్టేందుకు 45 కోట్ల యకరాల నీటిని మాత్రమే వినియోగించ వీలవుతున్నదని అంచనా. దీనిలో హెచ్చుభాగం, భారీ ప్రణాళికలద్వారాను, మధ్యరకం పథకాలద్వారానూ ఉపయోగ పడవలసివున్నది. ఈ పథకాలన్నిటి మూలంగానూ, మొత్తం 11 కోట్ల 20 లక్షల యకరాలకు నీరు సరఫరాచేయాలని సంకల్పం.

## భూమి అడుగు నీరు

సాలీనా నేలలోకి ఇంకిపోయే 65 కోట్ల యకరాల అడుగుల నీటిలోనూ సగానికి పైగా, భూమి పై పొరలలోనేఉండి, చెట్లూ మొక్కలూ పెరగడానికి అవసరానికి తేమ నేలలో ఉండేట్లు చేస్తుంది. మిగిలినది అడుక్కు దిగిపోయి భూమి అడుగు జల సంపద పెంపొందడానికి దోహదం చేస్తుంది. ప్రతి సంవత్సరం ఈ విధంగా అక్కడ చేరే నీటికంటే ఎన్నో రెట్లు ఎక్కువ నీరు, ఎప్పుడూ అక్కడ నిలువ ఉంటూనే ఉంటుంది.

నేలలోకి గొట్టాలను దింపి పరీక్షించడం ద్వారా, భూమి అడుగున ఎక్కడ, ఎంతెంత నీరు లభ్యమయ్యేదీ తెలుసుకునే పని 1955 నుంచి మన దేశంలో జరుగుతుంది. రాజస్థాన్‌లో, జైసాల్మేర్ ప్రాంతంలోని ఎడారిలో, భూమి అడుగున జల నిధులు పుష్కలంగా ఉన్నట్లు కనుక్కున్నారు. నర్మదా నది లోయలో కూడా భూమి అడుగున నీరు సమృద్ధిగా లభ్యమవుతుందని తేలింది.

గుజరాత్, ఒరిస్సా, రాష్ట్రంలోని సముద్రతీర ప్రాంతాలలో కొన్నిచోట్ల, భూమికి బాగా అడుగున మంచి నీరు లభిస్తుందని తెలుసుకున్నారు. కలకత్తా నగర పరిసరాలలోకూడా భూమి అడుగున బాగా విస్తారంగా నీరు లభించే సూచనలు కన్పిస్తున్నాయి.

దేశంలో ఎక్కడెక్కడ భూమి అడుగున సుమారుగా ఎంతెంత నీరు లభ్యమయ్యేది నమ్మదగిన వివరాలు, లెక్కలు క్రమేణా అందుబాటులోకి రాగలవు. మొత్తం 4 కోట్ల 50 లక్షల యకరాలను సాగు చేయడానికి అవసరమయిన చిన్న చిన్న పథకాలకు, భూమి అడుగున ఉన్న దానిలో 9 కోట్ల యకరాల అడుగుల నీరు అవసరమవుతుందని అంచనా.

## నీటి వనరుల సద్వినియోగం

అందుబాటులోగల నీటి వనరులను సద్వినియోగ పరుచుకునే నిమిత్తం, ప్రణాళికా బద్ధంగా పూనుకోవాలని నిశ్చయించి, 1951 లో, ఆయా పనులకు ముందు వెనుకలను నిర్ణయించారు. వీటి ప్రకారం, వ్యవసాయాభివృద్ధి కోసం నీటి పారుదల, పరిశ్రమల అభివృద్ధికై విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అత్యవసరమైన పని తీర్మానించడం జరిగింది. ఇందుకనుగుణంగా బ్రహ్మాండమయిన కార్యక్రమం తయారయింది. మూడు పంచ వర్ష ప్రణాళికలు జయ ప్రదంగా అమలు జరిగాయి, నాల్గవది మొదలయింది.

మొదటి మూడు ప్రణాళికల కాలంలోనూ, 2,400 కోట్ల రూపాయల ఖర్చుతో బాగా పెద్దవీ, మధ్యరకానికి చెందినవీ కలిసి దాదాపు 500 నీటిసాగు పథకాలను చేపట్టడమయింది. వీటిలో సుమారు 295 పథకాలపై పని పూర్తి అయింది. ఇందువల్ల 1965–66 సంవత్సరానికి కోటి 4 లక్షల ఎకరాలకు సేద్యపునీటి సౌకర్యం ఏర్పడింది. ఇంకా పని జరుగుతున్న పథకాల మూలంగా 66 లక్షల ఎకరాలకు నీరు లభిస్తుంది.

ఇదికాక, చిన్నతరహా నీటిసాగు పథకాల క్రింద, కోటి 80 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయి దీనితో చేరి మూడవ ప్రణాళిక ఆఖరుకి ఈ రకం పథకాల క్రింద 5 కోట్ల ఎకరాలు సాగవుతున్నాయన్నమాట. మొదటి మూడు ప్రణాళికలలోనూ కలిసి, భారీరకం, మధ్యతరహా ప్రాజెక్టుల కోసమని 1,336 కోట్ల రూపాయలు, చిన్నరకం పథకాలపై 600 కోట్ల రూపాయలు ఖర్చయినాయి. ఈ రకరకాల ప్రాజెక్టుల మూలంగానూ లభ్యమయిన నీటి పారుదల సౌకర్యాలు, గత 15 ఏళ్ళలోనూ అంతకంతకూ ఎక్కువగా వాడకంలోకి వస్తున్నాయి.

## వరద నివారణ పథకాలు

మనదేశంలో అన్నిచోట్లా ఒకే సమయంలో వరదలు సంభవించక పోయినప్పటికీ, మొత్తంమీద 5 కోట్ల ఎకరాల ప్రాంతం ముంపు ప్రమాదానికి గురిఅవుతూ ఉంటుందని అంచనా. మొదటి రెండు ప్రణాళికలలోనూ ఏర్పాటయిన వరద నివారణ పథకాలవల్ల సుమారు 75 లక్షల ఎకరాల ప్రాంతానికి, ముంపు బాధ తప్పినట్లయింది. ఆ పథకాలకోసం 63 కోట్ల రూపాయలు ఖర్చయినాయి. మూడవ ప్రణాళిక మేరకు 85 కోట్ల రూపాయల ఖర్చుతో అమలు జరిపిన పథకాల ఫలితంగా 44 లక్షల ఎకరాల విస్తీర్ణానికి ప్రయోజనం చేకూరింది.


## నాల్గవ ప్రణాళిక లక్ష్యాలు

కొత్త పథకాలు కొన్నిటిని చేపట్టడమంటూ తటస్థించినా, ఈ వరకే తలపెట్టి పనిజరుగుతున్న భారీరకం, మధ్యతరహా ప్రాజెక్టులను పూర్తి చేయడం పట్లనే అత్యధిక శ్రద్ధ చూపడమవుతుంది. నాల్గవ ప్రణాళికా కాలంలో, అదనంగా కోటి 30 లక్షల ఎకరాలకు నీటిసాగు సౌకర్యాన్ని కల్పించడ మవుతుందనీ, అందులో 90 లక్షల ఎకరాలు కచ్చితంగా ప్రయోజనం పొందడం మొదలవుతుందనీ అంచనా. చిన్న తరహా పథకాల ద్వారా కోటి 20 లక్షల ఎకరాలు సాగులోకి రాగలవని భావిస్తున్నారు. భూమి అడుగునీటిలో, మూడవ ప్రణాళిక ఆఖరుకి, 5 కోట్ల ఎకరా అడుగుల నీరుమాత్రం ఉపయోగంలోకి వచ్చింది నాల్గవ ప్రణాళిక మేరకు, మరో కోటి 70 లక్షల ఎకరాల అడుగుల నీరు వినియోగపడగలదని అంచనా. దేశం మొత్తం మీద పైరులక్రింద ఉన్న విస్తీర్ణం 39 కోట్ల ఎకరాలలోనూ 23 శాతం భూమికి మాత్రమే ఇప్పట్లో నీటిపారుదల లభిస్తున్నది. మన జనాభాకు చాలినన్ని ఆహార ధాన్యాలను మనం పండించగలగాలంటే పొలాలకు బాగా విరివిగా నీటిని సరఫరా చేయటం అత్యవసరం.

*

## పాల ఉత్పత్తి పెంపుకు రైతులకు ప్రోత్సాహం

భారత వెటర్నరీ మహాసభ 18వ సమావేశానికి హైదరాబాదులో జూన్ 3న రాష్ట్ర గవర్నరు శ్రీ ఖండూభాయ్ దేశాయి ప్రారంభోత్సవం చేశారు. దేశంలో పాల ఉత్పత్తిని పెంచడానికి రైతులకు తగు ప్రోత్సాహమివ్వాలని గవర్నరు చెప్పారు. పాడి పరిశ్రమకు గట్టిపునాది కల్పించడానికి వీలుగా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని కూడా ఆయన సూచించారు. పాల సమస్యను తీర్చడానికి పశువుల అభివృద్ధివంటి పథకాలను ఏర్పాటు చేయాలని గవర్నరు అన్నారు. సోషలిస్టు సమాజ వ్యవస్థ లక్ష్యాలకు అనుగుణంగా పాలు, నెయ్యి, కోడిగ్రుడ్లు ఉత్పత్తిని పెంచాలని ఆయన అన్నారు. గొర్రెల పెంపకం దార్ల విషయము కూడా మరచి పోకూడదని పశువైద్యుల దృష్టి వారిపై కూడా వుండాలని గవర్నరు గుర్తుచేశారు. పరిశోధనా ఫలితాలు రైతుకు అందించవలసిన అవసరం వుందని, ఉభయులకు మధ్య వున్న గండిని పూడ్చాల్సిన అవసరంగూర్చి కూడా ఆయన నొక్కి చెప్పారు.




వెటర్నరీ మహాసభకు హైదరాబాదులోని జూబ్లీ హాలులో జూన్ 3న ప్రారంభోత్సవం చేస్తున్న రాష్ట్ర గవర్నరు శ్రీ ఖండూభాయ్ దేశాయ్

సభకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు శ్రీ ఓ. పుల్లారెడ్డి అధ్యక్షత వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎమ్. టి. రాజు ఎగ్జిబిషన్‌కు ప్రారంభోత్సవంచేసి ఈ సందర్భంగా ప్రచురించిన సావనీర్‌ని ఆవిష్కరించారు. నాల్గవ ప్రణాళికలో చేర్చవలసిన పశుసంవర్థక పథకాల విషయంలో ప్రభుత్వానికి మార్గాలను సూచించవలసిందిగా పశువైద్యులను ఆయన కోరారు.

## మల్లవరం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం

కరీంనగరం జిల్లా వేములవాడ సమితి మల్లవరం గ్రామానికి ముప్పయివేల రూపాయలు ఖర్చుకాగల లిఫ్ట్ ఇరిగేషన్ పథకం మంజూరు అయింది.

## ఆకివీడు సమితిలో 'ఐ. ఆర్. 8'

ఆకివీడు రైతు శ్రీ మోరా గోవిందరెడ్డి 'ఐ. ఆర్. 8' వరి వంగడాన్ని వేసి ఎకరాకు 46 బస్తాలను పండించారు.

## 30 వేల ఎకరాలలో ఐ. ఆర్. 8 సాగుబడి

కృష్ణా జిల్లాలో రానున్న ఖరీఫ్ పంట కాలంలో (1968–69) ముప్పయివేల ఎకరాలలో అధిక ఫలసాయాన్నిచ్చే ఐ.ఆర్.8 వరి పైరు సేద్యం చేయనున్నారు.

## కోడూరులో 'ఐ. ఆర్. 8' అత్యధికరాలుబడి

కోట ఉరట్ల బ్లాకుకు చెందిన కోడూరులో శ్రీ బొడేటి రామునాయుడు నూతి కిందగల తమ వ్యవసాయ భూమిలో రబీ పంటకాలంలో ఐ ఆర్. 8' ఎకరాకు 46 బస్తాలను పండించారు. ఈ భూమియి నిస్సారం అయినా ఇంత హెచ్చు రాలుబడి రావడం ప్రజలకు ఆశ్చర్యం కలిగిస్తున్నది.

## శ్రీకాకుళం జిల్లాలో కార్యక్రమం

కొత్తగా 67వేల ఎకరాలలో మేలురకం వరివంగడాలను వేయడానికి శ్రీకాకుళం జిల్లాలో కార్యక్రమాన్ని నిర్ణయించారు.

## నల్లగొండజిల్లాకు దుర్భిక్షనివారణ చర్యలకై గ్రాంటు

నల్లగొండ జిల్లాలో దుర్భిక్ష పరిస్థితుల నివారణ కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం 16½ లక్షల రూపాయలను మంజూరు చేసింది.

## మద్దిపాడు సమితిలో దుర్భిక్ష నివారణకృషి

గుంటూరుజిల్లా మద్దిపాడు పంచాయతీ సమితికి చెందిన దుర్భిక్ష ప్రాంతాలలోని కూలి పనివారికి పని కల్పించడానికి ప్రభుత్వం నిధులను మంజూరుచేసింది. రూ. 105వేల ఖర్చుతో రోడ్ల నిర్మాణం చురుకుగా జరుగుతున్నది. ఈ పనులవల్ల సుమారు ఆరు వందల మంది కూలీలకు ప్రతిరోజు కూలిపని లభిస్తున్నది.

# నర్సరావుపేట గ్రామీణ పరిశ్రమల ప్రాజెక్టు

ఆంధ్ర ప్రదేశ్‌లోని మూడు గ్రామీణ పరిశ్రమల ప్రాజెక్టులలో ఒకటి నర్సారావు పేటలో వుంది. ఈ ప్రాజెక్టు క్రింద నర్సారావుపేట, సంతమాగులూరు, నాదెండ్ల, ఫిరంగిపురం, రాజుపాలెం బ్లాకులు వున్నాయి. నర్సారావుపేట, చిలకలూరిపేట మునిసిపాలిటీలుకూడా దీని క్రిందనే వున్నాయి. ఈ విధంగా 4.78 లక్షల జనాభాతో కూడిన 1028 చదరపు మైళ్ళ విస్తీర్ణం ఈ ప్రాజెక్టు పరిధిలో వుంది. సహకార పద్ధతిలో వ్యవసాయ-పారిశ్రామిక వ్యవస్థను నిర్మించడం ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం.

ప్రాజెక్టు ప్రాంతంలో వివిధ అభివృద్ధి కార్యకలాపాలకుగాను 1962-63 వ సంవత్సరం నుంచి 1967-68 వ సంవత్సరం వరకు రూ. 24.45 లక్షలు ఖర్చు చేశారు. అభివృద్ధి చర్యల ఫలితంగా లఘు పరిశ్రమల యూనిట్లు, కుటీర పరిశ్రమలకు సంబంధించిన యూనిట్లు ఆవిర్భవించాయి. ప్రాజెక్టు ఏర్పడిన తరువాత 81 లఘు పరిశ్రమల యూనిట్లు రిజిస్టరయ్యాయి. 44 యూనిట్లకు రూ. 3.3 లక్షల వరకు ఋణం మంజూరు చేయబడింది. 3225 మంది పనివారలకు కూడా ఆర్థిక సహాయం చేయడం జరిగింది. వీరిలో చేనేత పరిశ్రమ వారు 717 మంది, చర్మకార పరిశ్రమ వారు 1074 మంది, వడ్రంగి, కమ్మరి పనులు చేసేవారు 787 మంది, కుమ్మరిపని, సిమెంటు పనిముట్లు తయారుచేసేవారు 308 మంది వున్నారు. మిగిలినవారు వెదురు బుట్టలు అల్లడం, రాళ్ళు పగుల గొట్టడం మొదలైన పనులలో వున్నారు. వీరందరూ రూ. 4.64 లక్షల వరకు ఋణ సహాయం పొందారు.

## పారిశ్రామిక సహకార సంఘాలు

ప్రాజెక్టు ప్రాంతంలోగల సుమారు 17,000 మంది వృత్తి పని వారలను సహకార పరిధిలోనికి తెచ్చే నిమిత్తం 18 పారిశ్రామిక సహకార సంఘాలను స్థాపించారు. వీనిలో 9 సంఘాలు వివిధ పనులు అమలు జరిపే నిమిత్తం ప్రాజెక్టు నుంచి రూ. 28,000 ల మొత్తాన్ని గ్రాంటుగా పొందాయి.

పని వారలకు 75 శాతం సబ్సిడీ పద్ధతిపై మేలురకం పనిముట్లను పంపిణీ చేసే పథకం వల్ల యిప్పటి వరకు 1400 మంది పని వారలకు లాభించింది. వారు రూ. 250 లు ఖరీదుచేసే ఆధునిక మైన పనిముట్లను పొంద గలిగారు. తత్ఫలితంగా వారి పనిలో నైపుణ్యం పెంపొంది ఆదాయం చాలా వరకు అభివృద్ధి జెందింది. ఇప్పటి వరకు 320 మంది కుమ్మరి పనివారలకు మేలురకం చక్రాలు సరఫరా చేయబడినవి. సబ్సిడీ పథకం క్రింద అనాథ స్త్రీలకు 262 కుట్టు మిషన్లు అంద జేయబడినవి. 50 శాతం సబ్సిడీ పథకం క్రింద ప్రయోగాత్మక చర్యగా తోలు కుట్టడానికి ఉపయోగించే యంత్రాలనుకూడా ఈ సంవత్సరం పంపిణీ చేయడం జరిగింది.

ప్రాజెక్టు శిక్షణ కార్యక్రమం క్రింద యిప్పటి వరకు 75 మంది పనివారలు శిక్షణ పొందారు. ఈ కార్యక్రమం క్రింద శిక్షణ పొందే వారికి నెలకు రూ. 50 లు మొదలు రూ. 100 వరకు స్టయిఫండ్లు యిస్తారు.

వడ్రంగం, కమ్మరి పని, ఫౌండరీ, మెషిన్‌షాప్ పనుల వంటి వృత్తులకు సమిష్టిగా సౌకర్యాలు కల్పించే నిమిత్తం నర్సారావు పేటలో డిపార్టుమెంటల్ యూనిటుగా జనరల్ ఇంజనీరింగ్ వర్క్‌షాప్ ఒకటి నెలకొల్పబడింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ వారి సూచనను పురస్కరించుకొని దీనిలో మేలురకం వ్యవసాయ పనిముట్లనుకూడా కొన్నింటిని తయారు చేస్తున్నారు.

## ఫిరంగి పురం రంగుల అద్దకం, డిజైన్ల విస్తరణ కేంద్రం

ఫిరంగిపురం పంచాయతీ సమితిలో సుమారు 1000 మంది నేత పనివారలున్నారు. వీరు చాలా వరకు పురాతన పద్ధతిలో ముతక రకం బట్టలు తయారు చేస్తుంటారు. మేలురకం మగ్గాల ప్రయోజనాలను గురించి నేత పని వారలకు ప్రత్యక్షంగా తెలియజేసే నిమిత్తం ఇచ్చట రంగుల అద్దకం, డిజైన్ల విస్తరణ కేంద్రాన్నొక దానిని స్థాపించారు. ఈ కేంద్రానికి అనుబంధంగా ఒక ఉత్పత్తి విభాగాన్ని కూడా నెలకొల్పారు. ఇచ్చట మొత్తం 19 మగ్గాలను ఏర్పాటు చేశారు. పని వారల దిన సరి సగటు రాబడి యిప్పుడు రూ. 2.50 ల నుంచి రూ రూ. 4/ల వరకు పెరిగింది.

సంతమాగులూరులో స్థానిక చర్మకార పరిశ్రమవారి ప్రయోజనార్థం ఒక సమిష్టిసౌకర్య కేంద్రాన్ని స్థాపించారు. ఆధునిక పద్ధతిలో పాదరక్షలు తయారుచేయడంలో స్థానికపనివారలకు శిక్షణ ఇచ్చేందుకై కోమటినేనివారిపాలెంలో కూడా ఒక సమిష్టిసౌకర్య కేంద్రాన్ని నెలకొల్పారు.

తేనెటీగల పెంపకం పథకం క్రింద ప్రాజెక్టు ప్రాంతంలో యిప్పటి వరకు 100 పెట్టెలను 75 శాతం సబ్సిడీ పద్ధతిపై పంపిణీ చేయడంజరిగింది. ఈ ప్రాంతంలో న్యాయవాదులు, అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థులు మొదలైనవారు కూడా ఈ పని చేపట్టడం గమనార్హం.

మేడికొండూరు, దండమూడిగ్రామాలలో ఒక్కొక్కటి 100 ఘనపుటడుగుల శక్తి కలిగిన రెండు గోబర్ గ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు.

ఈ విధంగా నర్సరావుపేట గ్రామీణ పరిశ్రమల ప్రాజెక్టు ఈ ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి చక్కగా కృషిచేస్తున్నది. *

# వ్యవసాయ పరిశ్రమలు

**పి. పోలిరెడ్డి**

వ్యవసాయోత్పత్తులమీద ఆధారపడి నడిచే పరిశ్రమలను వ్యవసాయ పరిశ్రమలు అంటారు. ఇవి భారీ పరిశ్రమల రంగంలోనూ వుంటాయి. కుటీర, లఘు పరిశ్రమల రంగంలోనూ వుంటాయి. చక్కెర ఫ్యాక్టరీలు, నూనె యంత్రాలు, ప్రత్తి, వస్త్రపు మిల్లులు మొదలైనవి భారీ పరిశ్రమల రంగంలోని వ్యవసాయ పరిశ్రమలు. వడ్లు మర పట్టడం, వేరుశనగకాయ పొట్టు తీయడం, చెరుకు పిండడం, బెల్లము తయారుచేయడం, ప్రత్తి గింజల నూనె తీయడం, కోళ్లనుపెంచడం, పాడి పరిశ్రమ, సామాన్య వ్యవసాయ పనిముట్లు తయారు చేయడం, తేనెటీగలు పెంచడం, పండ్లు కూరగాయలు పండించి నిలవజేయడం – కుటీర, లఘు పరిశ్రమలకు చెందిన వ్యవసాయ పరిశ్రమలు. రాష్ట్రంలో భారీ వ్యవసాయ పరిశ్రమలను పెంపొందించారు. కాని గ్రామప్రాంతాలలో వ్యవసాయ పనులు చేసుకునే ప్రజల, తదితరులకోసం చిన్న తరహా వ్యవసాయ పరిశ్రమలను కూడా అభివృద్ధి పరచడం ఎంతో మంచిది. ఇందువల్ల ఎక్కువగా ఉపాధులు కల్పించడానికీ, గ్రామ ప్రజలు పట్టణాలకు, నగరాలకూ వలసపోకుండా ఆపటానికీ, గ్రామీణ వ్యవసాయ ఆర్థిక పరిస్థితిని పటిష్టం చేయడానికీ వీలుంటుంది. మనదేశంలో నూటికి 70 మందికి వ్యవసాయం ప్రధాన వృత్తి. మరో 16 శాతం మందికి ఇది అనుబంధ వృత్తి గ్రామీణ వ్యవసాయ పరిశ్రమలకు. ఇతర పరిశ్రమలకంటే చాలా తక్కువ పెట్టుబడి సరిపోతుంది. కాబట్టి వ్యవసాయదార్లు ఈ పరిశ్రమలను సులభముగా ప్రారంభించవచ్చు. ఈ పరిశ్రమలను అభివృద్ధి పరచడానికీ, వాటిమీద ఆర్జించడానికీ చక్కని అవకాశాలు వున్నాయి.

వ్యవసాయాభివృద్ధికై ఆధునిక సాధనాలను ఉపయోగించడముతో పాటు, వ్యవసాయ పరిశ్రమలను అభివృద్ధి పరచడంలో రైతులు కూడ భాగస్వాములు కావడానికి వీలుగా ప్రోత్సహించినట్లయితే అధికోత్పత్తి సాధ్యమవుతుంది.

## అమెరికాలో

వ్యవసాయ పనులకు యంత్రాలను విరివిగా ఉపయోగించ వలసిన యుగం ఇది. భూమినంతటినీ చక్కగా వినియోగంలోకి తేవడానికి ఇది అవసరము. అమెరికా జనాభాలో నూటికి ఆరుగురు మాత్రమే వ్యవసాయ వృత్తిలో వున్నప్పటికీ వారుప్రపంచములో సగం దేశాలకు అవసరమైన ఆహారపదార్థాలను వుత్పత్తి చేసి అందిస్తున్నారు. మనదేశములో మన అవసరాలను మనమే తీర్చుకొనలేక పోతున్నాము. ఈ పరిస్థితికి గల కారణమేమిటి? దీనికి సమాధానముగా కొన్ని ముఖ్య అంశాలను పేర్కొనవచ్చు.

మొదటిది_వ్యవసాయ వృత్తులలో ఎక్కువ మంది ప్రజలు నిమగ్నులై వున్నారు. కాబట్టి మనం వ్యవసాయ రంగంలో వెనుకబడివున్నాం.

రెండవది – వ్యవసాయం మీద ఆధారపడిన ప్రజలసంఖ్య పెరుగుతూవుండడంవల్ల మన భూకమతాలు మరీమరీ చిన్నవి అవుతున్నాయి. అందువల్ల వ్యవసాయ రంగంలో తలసరి సగటు వుత్పత్తి తగ్గిపోతున్నది.

మరొక ముఖ్యాంశము_వ్యవసాయ కూలీలు ఎక్కువగా వున్నందువల్ల నవీన యంత్రాలనూ, శాస్త్రీయ విధానాలను ప్రవేశపెట్టడానికి ఇబ్బంది కలుగుతున్నది. కూలీలు అధికంకావడంచేత వారు తక్కువ కూలీ రేటుకే వస్తారు. ఖర్చుతోకూడిన యంత్రాలను వుపయోగించడానికి రైతులు పూనుకోరు. ఈ విధంగా యంత్రాలవల్ల కలిగే ప్రయోజనాలు మనకు తగినంత దక్కకుండా పోతున్నాయి. మన రైతులు ఎప్పటివలెనే బీదరికాన్ని అనుభవించవలసి వస్తున్నది.

నాలుగోఅంశం – తనకు తానే డబ్బు సమకూర్చుకోగల పరిస్థితిలో మన వ్యవసాయం లేదు. అయితే అభివృద్ధి జెందిన దేశాలలోని పరిస్థితి ఇదికాదు. అక్కడ వ్యవసాయ రంగంలో లభించే డబ్బును యితర రంగాలకు కూడ ఖర్చు పెడుతున్నారు. అంటే వ్యవసాయం తనను తాను పోషించుకొని, యితర వృత్తులలోకూడా పెట్టుబడిపెట్ట గలుగుతున్నది.

## ఇతర వృత్తులు

మన దేశములో కూడ వ్యవసాయ కూలీలు, ఈ రంగం మీదనే ఆధారపడి వున్న యితరులూ యితర వృత్తులను కూడ చేపట్టినట్లయితే వ్యవసాయ రంగంలో ఒత్తిడి తగ్గుతుంది. వ్యవసాయ రంగం అభివృద్ధి జెందడానికి అవకాశం కలుగుతుంది. వ్యవసాయ పరిశ్రమలు వృద్ధిపొంది, గ్రామీణ ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. సంవత్సరంలో సుమారురెండు మూడు నెలలపాటు వ్యవసాయపనులు చేయువారికి పనులుండవు. వ్యవసాయపరిశ్రమలు వున్నట్లయితే ఈ కాలంలో వారు యితర పనులు చేసుకోగలుగుతారు. ఇటివంటి పరిశ్రమలను ప్రారంభించడానికి రైతులకు తగిన సదుపాయాలు కల్పించిన, 'రైతుకంటే వ్యవసాయ క్షేత్రానికే ఎక్కువ ప్రాధాన్యం యిస్తున్నారు' అనే వాదు తొలిగిపోతుంది.

ప్రస్తుత ఆహార కొరత తొలగడానికి, నాలుగవ పంచవర్షప్రణాళికా కాలములో వ్యవసాయ పరిశ్రమలను బాగా అభివృద్ధి పరచ వలసిన అవకాశం వున్నదని ప్రణాళికా సంఘమువారూ, భారత ప్రభుత్వం వారూ గట్టిగా చెప్పుతున్నారు. నిజానికి వ్యవసాయరంగమూ, పరిశ్రమల రంగమూ మన ఆర్థికవ్యవస్థకు పునాదులు. ఈ రెండు ఒకదాని మీద ఒకటి ఆధారపడినవే. అందుచేత వీటిని అభివృద్ధి పరచుకోవడం అవసరం.

వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ సుసంపన్నమైన రాష్ట్రం. వ్యవసాయ రంగంలో మనకు వున్న అవకాశాలతో రక రకాల

పంటలు పండించవచ్చు. పరిశ్రమలలో వాటిని ఉపయోగించుకోవచ్చు. పనిముట్లు, ఎరువులు, క్రిమిసంహారక పదార్థాలు మొదలైనవాటికి వ్యవసాయరంగం పరిశ్రమల మీద ఆధారపడవలసివుంటుంది. అలాగే, ముడివస్తువులకు, మార్కెటింగు సదుపాయాలకు పరిశ్రమలు వ్యవసాయ రంగం మీద ఆధారపడి వున్నాయి. ఈ రెండు రంగాల అన్యోన్యత వృద్ధిపొందేవిధంగా పరిశ్రమ ప్రణాళికలు వుండాలి. వ్యవసాయ పరిశ్రమలు రాష్ట్రపు ఆహార పరిస్థితిని మెరుగు పరచి రైతుల, యితర గ్రామీణుల జీవన ప్రమాణాలను పెంచుతవి. ఈ సందర్భంలో కొన్ని గ్రామీణ వ్యవసాయ పరిశ్రమలను గురించి మనవిచేస్తాను.

1. వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు పంట దిగుబడి బాగా వుండకపోవడానికి, భూమిని సరిగా దున్నకపోవడం ఒక కారణమని వ్యవసాయ నిపుణులు చెబుతారు. ఆధునిక నాగళ్లు, పవర్‌టిల్లర్లు వంటి మేలురకం పనిముట్లు పురోగామి రైతులకు అవసరమవుతాయి. వ్యవసాయదార్లు ఈ ఆధునిక పనిముట్లనూ, యంత్రాలను ఉపయోగించినట్లయితే వ్యవసాయ పనులను వేగంగా కనీసపు ఖర్చుతో చక్కగా చేసుకోవడం సాధ్యమవుతుంది.

2. ఎరువు బాగావేసినట్లయితే, పైరుచక్కగా పెరిగి మంచి పంట పండుతుంది. భూసారాన్ని పెంచడానికి నత్రజని ఎరువులను, ఫాస్ఫేట్లు, పొటాషియం మొదలైన రసాయనిక ఎరువులను ఉపయోగిస్తారు.

అమెరికా మొదలైన దేశాలలో వ్యవసాయోత్పత్తి ఎక్కువగా పెరగడానికి రసాయనిక ఎరువులు కారణమైనట్లు చెబుతారు. ఉష్ణమండల దేశాలన్నిటిలోనూ నత్రజని లోపం సమస్య అయినట్లు చెబుతారు. మొక్కలు ఎదగడానికి అవసరమైనవాటిలో నత్రజని, భాస్వరం, పొటాష్ ముఖ్యమైనవి.

3. తేనెటీగల పెంపకం, వ్యవసాయంతో దగ్గర సంబంధం గల కుటీరపరిశ్రమ. ఈ పరిశ్రమకు చాలా స్వల్ప పెట్టుబడి మాత్రం చాలు. కాని ప్రతిఫలం విరివిగా వుంటుంది. ఈ కుటీర పరిశ్రమ నుంచి, యితర పరిశ్రమలకంటే ఎక్కువ రాబడి వుంటుంది. తేనె లభించడమే గాకుండా, వ్యవసాయాభివృద్ధికి తేనెటీగలు తోడ్పడతాయి.

4. పాడి పరిశ్రమవల్ల గ్రామాలలోని ప్రజలకు చాల మేలు కలుగుతుంది. ఈ పరిశ్రమవల్ల రైతుకు, అతని కుటుంబానికి సంవత్సరం పొడవునా పని దొరకడమేగాక, పోషక ఆహార పదార్థాలు కూడ లభిస్తాయి. పాల వుత్పత్తి, పశుపోషణ –ఇవి రెండు కలిసి జరగాలి. వ్యవసాయాభివృద్ధిలోను, ప్రజా సంక్షేమంలోను యివి ముఖ్యపాత్ర వహిసాయి.

5. చేపలకు మంచి ఆహార విలువవుంది. కాబట్టి చేపలను పోషించడం, నిలవచేసి వుంచడంవల్ల చాలా ప్రయోజనాలున్నాయి. వీటి ఎగుమతికికూడా అవకాశాలున్నాయి. వీటివల్ల మంచి ఎరువు లభిస్తుంది. భారతదేశములో అనేక ప్రాంతాలలో వలెనే, జపానులోకూడా ప్రజల ముఖ్య ఆహారం బియ్యం. అయినప్పటికీ, జపాను ప్రజలు తాము శారీరకంగాను, మానసికంగాను శక్తిసంపన్నులైనట్లుగా ప్రపంచానికి చాటారు. చేపలు విరివిగా తినటంవల్ల బియ్యంలో లోపం వారికి లేకుండాపోయింది. వారి శక్తిసామర్థ్యాలకు యిదే కారణమైనట్లు కనిపిస్తుంది. మనదేశంలో బియ్యం వాడుతున్నవారుకూడా తమ ఆహారంలో లోపించిన పోషక పదార్థాలకోసం ఎక్కువగా చేపలను తీసుకోవడం మంచిది.

6. కోళ్లను పెంచడం వల్ల రైతులకు, తదితరులకు అనునిత్యం రాబడివుంటుంది. ఇందువల్ల గ్రామీణ ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది. కోళ్ల పెంపకాన్ని సరిఅయిన పద్ధతులలో సాగించినట్లయితే మంచి లాభసాటియైన పరిశ్రమ అవుతుంది. మరేఇతర పశుజాతివల్లకూడా ఈ విధంగా పెట్టుబడికి తగిన ప్రతిఫలం లభించదు. ఇందులో ప్రమాదాలకు అవకాశాలుకూడ చాల తక్కువ. అందుచేత వ్యవసాయదార్లకు కోళ్ల పెంపకం ప్రశస్తమైన అనుబంధ పరిశ్రమ. కోళ్ల ఎరువుకు మంచి విలువ వుంది. దానిలో నత్రజని అధికంగా వుంటుంది. దానిని పొలాల్లో ఉపయోగించి ప్రయోజనం పొందవచ్చు.

భారతదేశంలో ప్రజాజీవితం పల్లెలలోనే వున్నదని మహాత్మాగాంధి తరచుగా అంటుండేవారు. దేశ ప్రజల్లో నూటికి 80 మంది గ్రామాలలో నివసిస్తున్నారు. కాబట్టి భారతదేశం పురోభివృద్ధి చెందాలంటే, అభ్యుదయం సాధించాలంటే గ్రామాలు చైతన్యవంతం కావాలి. ఒక్క వ్యవసాయానికే కాకుండా, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికికూడా ప్రాముఖ్యం యివ్వాలి. పల్లె ప్రాంతాలలో ఈ రెండు రంగాలు కలసిమెలసి పురోగమించాలి. గ్రామాల్ల అభివృద్ధికి వ్యవసాయం పునాది. వ్యవసాయాభివృద్ధి పథకాలలో, రైతుల ఆర్థికస్థితిని చక్కబరిచే అంశాలకు ప్రాముఖ్యం వుండాలి.

# మహాభారతము

తిప్పెగంతుల లక్ష్మణశాస్త్రి

## 18

అప్పుడు వృద్ధులందరు ధిక్కారము చేసిరి. సభయంతయు క్షోభిల్లెను. రాజులందరు దుఃఖించిరి. భీష్మ, ద్రోణ, కృపాదులైన పెద్దలకు ఒడలెల్ల చెమట బట్టెను. విదురుడు తలపట్టుకొని వంగి మూర్ఛిల్లినట్లుండెను. సర్పమువలె బుసకొట్టుచు చింతిల్లు చుండెను. ధృతరాష్ట్రుడు మనస్సులోనే ప్రసన్నుడగుచు "ఈ గెలుపు గూడ మనదేయయ్యెనా?" అని సంతోషమును ఆపలేక పలికెను. దుశ్శాసనుడు, కర్ణుడు మొదలగువారు మిక్కిలి సంతసించు చుండిరి. కాని తదితరుల కన్నులలో అశ్రువులు రాలుచుండెను.

అప్పుడు దుర్యోధనుడు మహానంద భరితుడై విదురుని పిలిచి 'నీవు పోయి పాండవుల ప్రియపత్ని ద్రౌపదిని ఈ సభలోనికి తోడ్కొనిరమ్ము. ఆ పాపిష్ఠురాలు ఇక్కడికివచ్చి యీ రాజభవనమును చీపురు పట్టుకొని ఊడ్చుచు దాసీజనముతో నుండవలెను' అని చెప్పెను.

## విదురుని హిత వచనములు

ఆ మాటలు విని విదురుడు కోపోద్రిక్తుడై యిట్లనెను:- "మూర్ఖా! నీ వంటి నీచుని నోటి నుండియే యిట్టి దుర్వచనములు వెడలును. నీ మెడకు యమపాశము చుట్టుకొన్నది. కనుక యుక్తాయుక్తము లెరుగక మాట్లాడు చుంటివి. నీవు చచ్చుట కెంత కాలమోలేదు. లేడివంటి నీవు మహా వ్యాఘ్రములకు క్రోధము కలిగించు చున్నావు. యమలోకమునకు ప్రయాణము కట్టుము."

"యుధిష్ఠిరుడు తొలుత తనను ఓడి పిదప ద్రౌపదిని ఒడెను. పరాధీనుడగు నతనికి మరియొకరిని పందెమొడ్డుటకు అధికారములేదు. కనుక ద్రౌపది ఓడబడలేదు. ఆమె నీకు దాసి కాదు. వెదురులో పుండుపుట్టుట వెదురునకు నాశ సూచకమగునట్లు ధృతరాష్ట్రుని వంశ నాశము కొరకే అతనికీ పుత్ర రూపమగు ఫలము పుట్టినది.

"ఇతరుల మనస్సుకు బాధ కలిగించు మాటలను పలుక కూడదు. నీచ కర్మల ద్వారా శత్రువులను వశపరచుకొన గూడదు. నరకమునకు దారితీయు మాటల నెప్పుడుగూడ పలుక గూడదు. నోటి నుండి వెడలిన కఠిన వాక్కులు ఇతరుల మనస్సును ఛేదించును గనుక బుద్ధిమంతు డెప్పుడుగూడ ఇతరులను గూర్చి నిష్ఠూరములాడ గూడదు"

"ఒక మేక ఒకానొక శస్త్రమును మ్రింగ బోయెను. అది మ్రింగుడు పడనప్పుడు ఆ మేక తలను క్రింద బాదుకొనుచు ఎటులనైనను దానిని మ్రింగ జూచెను. చివరకు ఆ శస్త్రము దాని కంఠచ్ఛేదమునకు కారణమయ్యెను. కనుక దుర్యోధనా! నీవు పాండవులతో వైరము తెచ్చుకొనినచో నీకు గూడ ఆ మేక గతియే పట్టును. పాండవులెప్పుడు గూడ ఇట్టి కటువచనములను ఇతరుల యెడ మాటాడరు. నీవు కుక్కవంటి మనుష్యుడవు గనుక ఇట్లు మొరుగు చున్నావు."

"అయ్యో! దుశ్శాసనాదులుగూడ ఈ పాపి దుర్యోధనునే అనుసరించుచున్నారే! నీటిలో సొరకాయ మునిగినను, రాయితేలినను, నావలు మునిగినను సరే, యీ దుర్యోధనుడు నా హితవచనములను వినజాలడు నిశ్చయముగా నితడు కురు కులమును నశింపజేయును. ఇతడు సర్వనాశమునకు మూలమగును. ఇతనికి ఇంతకింతకు లోభము పెరుగుచునే యున్నది'' ఇట్లు చెప్పి విదురుడు మిగుల దుఃఖించెను.

తరవాత దుర్యోధనుడు విదురుని నిందించి సభలో నిలిచి యున్న ప్రాతికామి (సేవకుడు)తో నిట్లనెను.

దుర్యో. విదురుడు పాండవులను చూచి భయపడు చున్నాడు. నీవు భయపడ వలసిన పనిలేదు. వెంటనేపోయి ద్రౌపదిని సభలోనికి తోడ్కొనిరమ్ము.

ప్రాతికామి:-(ద్రౌపదివద్దకు పోయి) తల్లీ! ధర్మరాజు జూదపు పిచ్చిచేత సర్వస్వమును జూదములో ఓడిపోయి చివరకు నిన్ను గూడ ఒడ్డి ఓడెను. అమ్మా! ఇప్పుడు నీవు ధృతరాష్ట్రుని మందిరములోనికి పోవలెను. అక్కడికి నేను నిన్ను దాసి పనిచేయుటకు తోడ్కొని పోయెదను, ఇది దుర్యోధన మహారాజుగారి యాజ్ఞ.

ద్రౌపది -ప్రాతికామీ! లోకములో ఏరాజైనను తన ధర్మపత్నిని ఒడ్డి జూదమాడునా? వ్యర్థవచనములను పలుకకుము. ధర్మరాజువద్ద జూదరులకు ఇచ్చుటకు మరి యెట్టి-ధనము గూడా లేకుండెనా? ఆయన అంత పిచ్చివాడయ్యెనా?

ప్రాతి:— రాజకుమారీ! ధర్మరాజు సర్వస్వమును జూదములో ఓడిపోయి తుదకు ఆయన వద్ద ఏమియు ధనము లేనప్పుడు వరుసగా తమ్ములను ఒక్కొక్కరినే ఓడిపోయి, చివరకు తనను గూడ ఓడి పిదప నిన్ను ఒడ్డి ఓడెను.

ద్రౌపది:—సూతపుత్రా! నీవు సభలోకి పోయి జూదవ్యసని యగు ధర్మరాజుతో, తొలుత తానోడి నన్నోడెనా ? లేక నన్నోడి తానోడెనా! అని తెలిసికొని వచ్చిన తరువాత నన్ను తోడ్కొని పొమ్ము.

ప్రాతికామి సభకు పోయి ఆసంగతి తెలిపెను.

యుధిష్ఠిరుడు విని తలవంచుకొని మాట్లాడకుండెను.

దుర్యో:— పాంచాలిని యీ సభలోకి వచ్చి ఆ ప్రశ్నమును అడుగు మనుము.

ప్రాతి:—(తిరిగి ద్రౌపది వద్దకు పోయి) రాజకుమారీ ! దుర్యోధనుడు నిన్ను సభలోనికి రమ్మన్నారు. ఇప్పుడు కౌరవులకు వినాశకాలము సంప్రాప్తమైనట్లు నాకు తోచుచున్నది నిన్ను సభలోనికి యీడ్చుచున్న దుర్యోధనుని సంపద ఇకనిలువదు.

ద్రౌపది:— ప్రాతికామీ! నాకుగూడ అట్లేతోచుచున్నది. ప్రపంచములో ఆబాలవృద్ధులకు సుఖ దుఃఖములు సంప్రాప్తములగు చుండును. ధర్మమొక్కటే అన్నిటికన్న శ్రేష్ఠతమము. మనము దానిని రక్షించినచో మననుగూడా అదితప్పక రక్షించును. నేను ధర్మమును ఉల్లంఘించను. కనుక నీవు పోయి సభలోని కురువృద్ధులను 'నన్నిప్పుడేమి చేయ మందురో' అడిగి తెలిసికొని రమ్ము. ఆ ధర్మజ్ఞుల యాజ్ఞ మేరకు నేను నడచుకొనెదను.

ప్రాతి :— సభలోకి పోయి అందరితో ఆ మాట చెప్పెను. అందరును దుర్యోధనునకు వెరచి మాట్లాడక తలవంచుకొని యుండిరి. అప్పుడు—

ధర్మరాజు ద్రౌపదికి పరిచయముగల మరియొక దూతను ఆమె వద్దకు పొమ్మని యతనిద్వారా ద్రౌపదికి ఈ విధముగా చెప్పి పంపెను. "ద్రౌపదీ ! నీవు రజస్వలవైనను, పోక ముడిని క్రిందకు జార్చియుంచినప్పటికిని, ఏక వస్త్రవై యున్నను, అట్టి పరిస్థితిలోనే యేడ్చుచు సభలోనికి వచ్చి నీ మామగారి యెదుట నిలువుము. అప్పుడు ఆ విధముగా నున్న నిన్ను చూచి సభాసదులందరు తమ తమ మనస్సులలో దుర్యోధనుని నిందించుదురు గాక."

ఆ మాటలను కొనిపోయి దూత ద్రౌపదికి తెలిపెను. సభలో పాండవులు దీనులై సత్యబంధనములో కట్టుబడియుండి దుఃఖితులై యుండిరి. వారికి ఏమియును తోచలేదు. పాండవుల దుర్దశను చూచి దుర్యోధనుడు మనస్సులో ఆనందించుచు ప్రాతికామితో 'నీవు త్వరగా ద్రౌపదిని ఇటకు తోడ్కొని రమ్ము. ఈ కౌరవులు ఆమె ప్రశ్నలకు ఇక్కడనే సమాధానములు చెప్పెదరనుము.' ఆమాటలు విని ప్రాతికామి ద్రౌపదికి భయపడి మరల సభవారితో 'నేను ద్రౌపది ప్రశ్నమునకు ఏమి బదులు చెప్పుదును ?' అని అడిగెను.

అప్పుడు దుర్యోధనుడు దుశ్శాసనునిపిలిచి, "ప్రాతికామి మూర్ఖుడు. భీమసేనునకు భయపడుచున్నాడు. నీవు స్వయముగ పోయి ద్రౌపదిని పట్టుకొని ఇచటికి ఈడ్చితెమ్ము. మనకు వశులైన ఈ పాండవులు ఏమి చేసెదరో చూచెదముగాక." అని యనెను. ఆమాటవిని వెంటనే దుశ్శాసనుడు లేచి క్రోధముతో ద్రౌపది యున్నచోటికిపోయి, యామెతో "రాజపుత్రీ ! నిన్ను ధర్మరాజు మాకు ఓడెను. ఇప్పుడు సిగ్గువీడి దుర్యోధనుని దర్శించుము. మమ్ము సేవించుము. ధర్మప్రకారము నిన్ను గెలుచుకొంటిమి. ఇప్పుడే రాజసభలోనికిరమ్ము".

ఆమాటవిని ద్రౌపది మిగుల దుఃఖించుచు లేచి చేయునదిలేక ధృతరాష్ట్రుని స్త్రీలు ఉన్నతావునకు పరుగెత్తిపోయెను. దుశ్శాసనుడు గూడ ఆమెను వెన్నంటి ఉరికి, రాజసూయములో అవభృథ స్నానముచేత పవిత్రములైన ఆమె కేశములను పట్టుకొని యీడ్చుచు రాజసభలోనికి ఆమెను తెచ్చెను. సనాథయైనను అనాథవలె దీనయై దుఃఖించుచు ద్రౌపది దుశ్శాసనునితో, "మందబుద్ధీ! నేను రజస్వలను, ఏకవస్త్రను. ఇట్టి అవస్థలో నన్ను సభలోనికికొనిపోవుట ఉచితముగాదు." అని యనెను. అది వినిపించుకొనక దుశ్శాసన దట్లే ఆమెను ఇంకను ఈడ్చుచుండెను. ఆమె 'హాకృష్ణా! హరీ!గోవిందా! రక్షించుము.' అని ఆ రనాదము చేయుచుండెను. అప్పుడు దుశ్శాసనుడు, "యాజ్ఞసేనీ! నీవు రజస్వలవైనను సరే. ఏకవస్త్రవైనను సరే, లేక వివస్త్రవైనను సరియే.జూదములో మా చేత జయింపబడి దాసిగా చేసికొనబడితివి. దాసీజనములో నుండదగినదానవు, నీకు మానమెక్కడిది?" అని యనెను.

అప్పుడు చెదరిన వెండ్రుకలతో, దుశ్శాసనునిచేత ఈడ్వబడుటచే ఆమెయొక్క సగము వస్త్రముక్రిందకు జారియుండగా క్రోధముచేత దహింపబడుచు సిగ్గుపడి దుశ్శాసనునితో మెల్లగా నిట్లనెను. "దుర్మతీ! ఈసభలో మహా విద్వాంసులు, కర్మిష్ఠులు నగు గురుజనులు కూర్చొని యున్నారు. వారందరు నా పితృసమానులు. ఈ రూపముతో నేను వారియెదుట నిలువను. క్రూరుడా ! నన్ను ఇట్లు ఈడ్వకుము. వస్త్రహీనను చేయకుము. ఇంద్రాదులు నీకు తోడుగా వచ్చినను నా పతులు, నీవుచేసిన యీ అధర్మ కార్యమునకు, నిన్ను విడువరు. మహాత్ముడగు ధర్మరాజు ధర్మమార్గములో నడచును. ధర్మ స్వరూపము అతి సూక్ష్మము. ధర్మ పరిపాలనలో నిపుణులగు సూక్ష్మబుద్ధిగల మహా పురుషులుమాత్రమే ధర్మ సూక్ష్మమును తెలుసుకొన గలుగుదురు. నీవు చేయుచున్న యీ దుష్కర్మను ఈ సభలో నెవరు గూడ నిందించుటలేదు. నిక్కముగా వీరందరు నీవుచేయు పనిని సమ్మతించుచున్నారని నాకు స్పష్టమగుచున్నది."

ఇంకను ఆ మహాసాధ్వి ఇట్లు వాపోయెను :—"నిక్కముగా భరతవంశరాజుల ధర్మము నష్టమాయెనాయేమి ? క్షాత్రధర్మ మెరిగిన యీ మహా పురుషుల సత్ప్రవర్తనగూడ లోపించి పోయెనాయేమి ? కౌరవులు ధర్మోల్లంఘన చేయుచుండగా ఇక్కడి పెద్దలందరు కన్నులప్పగించి నిశ్చేష్టులై ఇట్లు చూచుచున్నారే ! భీష్మ, ద్రోణ, కృప, ధృతరాష్ట్ర, విదురాదులందరును దుర్యోధనునకు

బెదరి యీ ధర్మ విధ్వంసమును చూచుచుగూడ శిలవలె ఊర కున్నారే?"

**ఈవిధముగా దుఃఖస్వరముతో** పలుకుచు ద్రౌపది, మహా క్రోధముతో కనులెఱ్ఱబడియున్న తన పతులవంక క్రీగంటజూచెను. ఆ యవస్థలోనున్న ప్రియపత్నినిజూచిన పాండవులకు, రాజ్యము ధనము, సమస్తసంపదలు ఓడినప్పుడుగూడ ఇంత దుఃఖము రాలేదు.

అప్పుడు మూర్ఛితురాలు వలెనున్న ద్రౌపదిని దుశ్శాసనుడు బిగ్గరగా నవ్వుచు 'దాసీ;' యని నిండు సభలో పిలిచెను. అదివిని కర్ణుడు మహానందమునంది, దుశ్శాసనుని అభినందించెను. కర్ణ, శకుని, దుర్యోధనులకుతప్ప, సభలోనున్న యందరకును అట్టి అవస్థలోనున్న ద్రౌపదినిచూచి మిగుల దుఃఖము కలిగెను.

## భీష్ముడు చెప్పిన ధర్మ స్వరూపము

అప్పుడు భీష్ముడిట్లనెను:—"సౌభాగ్యవతీ! ధర్మముయొక్క స్వరూపము అతిసూక్ష్మమగుటచేత నీ ప్రశ్నమునకు సరియైన సమాధానమును నేను చెప్పలేకున్నాను. ఎవడు అధికారికాదో అట్టివాడు ఇతరుల వస్తువును జూదములో ఒడజాలడు. కాని, స్త్రీ యెట్టిదశలోగూడ తన స్వామికి అధీనురాలుగానే భావింపబడును. కనుకనాకు ఏమిచెప్పుటకుగూడ తోచకున్నది. ధర్మరాజు ధన సంపదలను, సమస్త పృథివీ రాజ్యమును విడువవచ్చునుగాని, ధర్మమును త్యజించగూడదు ఈ ధర్మరాజు 'స్వయముగానే నేను ఓడిపోయినానుకనుక ఈ ప్రశ్నమునకు బదులుచెప్ప జాలను' అని అన్నాడు. జూదములో అసమాన శక్తిగల శకుని ధర్మరాజు నిన్ను ఒడ్డుటకు పురికొల్పెను. అతని కపటోపాయ ములను తెలియజాలక యుధిష్ఠిరుడునిన్ను ఒడ్డి ఓడిపోయెను. కనుక ఇట్టిపరిస్థితులలో నీప్రశ్నమునకు వివరముగానేను బదులు చెప్పజాలను."

ఆమాటలువిని ద్రౌపది యిట్లనెను:—"జూదమాడుటలో నిపుణులు, దుష్టులునైనవీరు యుధిష్ఠిరుని సభలోనికి పిలిచి జూదములోదింపిరి. ఈయనకు జూదమాడుటలో ఎక్కువ అభ్యాసము లేదు. అట్టివానిమనస్సులో ద్యూతేచ్ఛ యెందుకు కలిగింపబడెను? 'మనస్సులో కపటముపెట్టుకొని వీరు ఈ నాటకమును ఆడుచున్నా" రని అమాయకుడగు ధర్మపుత్రునకు తెలియక తొలుత తానోడెను. తరువాతనన్నుగూడ ఒడ్డునట్లుగా ఆయనను వీరు ఇబ్బంది పరచిరి, కురువంశములో మహాపురుషులందరు ఇక్కడనున్నారు. వీరందరి కిని పుత్రులు, కోడండ్రునున్నారు. కనుక వీరుబాగుగా ధర్మమును యోచించి నా ప్రశ్నమునకు సరియైన ఉత్తరమీయవలసి యుండును. వృద్ధులు లేకుండునది సభయనిపించుకొనదు. ధర్మమును వివరించి చెప్పలేనివారు వృద్ధులనిపించుకొనరు. సత్యములేనిది ధర్మ మనిపించుకొనదు. కపటయుక్తమైన సత్యము సత్యమనిపించుకొన జాలదు."

అట్లు దుఃఖించుచు పలుకుచున్న ద్రౌపదిని దుశ్శాసనుడు పరుషములు మాట్లాడుచుండెను. ఆ విధముగా, రజస్వల, తొలగి పోయిన ఉత్తరీయవస్త్రముగలది. అట్టి అవమానమునకు అనర్హు రాలునగు ద్రౌపదిని నిర్లజ్జుడై దుశ్శాసనుడు ఈడ్చుచుండుటనుచూచి భీమసేనుడు మహాక్రోధోద్దీపితుడై అన్నగారిని చురచుర జూచుచు ఆర్తితో.

"అన్నా! యుధిష్ఠిరా! జూదరులయింటిలో కులట స్త్రీలు తరచుగనుండెదరు కాని, వారిని గూడ జూదరులు పందెము పెట్టి ఆడరు. అట్టి స్త్రీల యెడలగూడ వారికి దయాప్రేమలు ఉండును. మనరాజ్యమును, ధనరాసులను, సర్వసంపదలను, నీ తమ్ముల మగుమమ్ము, వాహనములను అన్నిటినిగూడ కౌరవులు జూదములో గెలుచుకొనిరి. నీవు ఆ వస్తువులన్నిటికి స్వామివి కనుక ఒడ్డితివని నాకేమాత్రముకోపము కలుగలేదు. కాని, ద్రౌపదిని పందెము పెట్టుట అనుచితమని తలచెదను. ఈమెను కౌరవులు మనసమక్ష ములోనే నానాబాధలు పెట్టుచుండగా చూడలేకున్నాను. అందుచేత నీపైనవచ్చిన అధికకోపమును ఆపికొనలేకున్నాను. నీరెండు బాహువులను ఇప్పుడే అగ్నితో కాల్చివేసెదను." అనిచెప్పి 'సహదేవా! అగ్నినితెమ్ము' అనిక్రోధముతో నరచెను.

## క్షత్రియ వ్రతము

అప్పుడు అర్జునుడు "అన్నా భీమసేనా! పూర్వమెప్పుడు గూడ నీనోట రాని మాటలను ఇప్పుడాడుచున్నావు. నిక్కముగా క్రూరులగు శత్రువులు నీ ధర్మబుద్ధిని నష్టము చేసినట్లున్నారు. అన్నా! ఈ విధముగాచేసి శత్రువులకోరికను సఫలము చేయకుము. ఉత్తమధర్మము నాచరింపుము. ధర్మాత్ముడగు ధర్మరాజును ఎవరు అవమానపరచగలరు? శత్రువులు మహారాజును జూదము నకు పిలిచిరి. జూదమాడుటకు పిలిచినప్పుడు క్షత్రియుడు రానన కూడదు. కనుక ధర్మరాజు క్షత్రియవ్రతమును పరిపాలించుటకు గాను జూదమాడుటకు అంగీకరించెను. ఇట్టిధర్మబుద్ధి ఘనకీర్తిని పెంపొందించగలదు" అనియనెను.

ఆ మాట విని భీముడు. "అర్జునా! ధర్మరాజు జూద మాడుట క్షత్రియ ధర్మ సమ్మతమేయని యెరుగక యట్లంటిని. ఈ దోషమునకు పరిహారముగా నేను నా బాహువులనే దహించి వేసెదను." అని యనెను.

## వికర్ణుని ధర్మజ్ఞత

ఆ విధముగా పాండవులు దుఃఖితులై యుండుటను, సభలో దుశ్శాసనుడు ద్రౌపదిని వస్త్రముబట్టి యీడ్చుచుండుటను జూచి వికర్ణుడిట్లనెను :-

"రాజులారా ! ద్రౌపది యడిగిన ప్రశ్నమునకు మీరు సరి యైన యుత్తరమీయకున్నచో మనమందరము ఘోరమగు నర కము అనుభవింపవలసి వచ్చును. భీష్మద్రోణాదులగు పెద్దలందరు నేమియును మాట్లాడకున్నారు. ఇక్కడనున్న వారందరును తమకు తమకు తోచిన ధర్మమును పలుకుడు".

అంతగా వికర్ణుడు మాట్లాడుచున్నను నెవరు గూడ ఆ సభలో బదులు పలుకలేదు. అప్పుడతడు చేతులను పిసికికొనుచు

విచారముతో నిట్లనెను :– "రాజులారా ! మీరు ఈ ప్రశ్నమునకు ఉత్తరమీయకున్నను సరియే. ఇందులో న్యాయమేదియో దానిని నేను చెప్పెదను వినుడు. రాజులకు నాలుగు దుర్వ్యసనములు ఉండును. అవి, 'వేట, మద్యపానము, జూదము, విషయోపభోగము' అనునవి. ఈ చెడ్డ అలవాట్లకు లోనైనవాడు ధర్మమును వీడి తన యిచ్ఛవచ్చినట్లు నడచుచుండును. ఇట్లు వ్యసనాసక్తుడు చేయు ఏ పనులను గూడ ప్రజలు గౌరవించరు. ఈ యుధిష్ఠిరుడు జూదము అను దుర్వ్యసనములో అత్యంతాసక్తుడై యున్నాడు. ఇతడు కపటులైన జూదరులచేత ప్రేరితుడై ద్రౌపదినిగూడ పందెము పెట్టియాడెను. పరమ పతివ్రతయగు ద్రౌపది, ఐదుగురు పతులకును సమానముగా భార్య. ఆమె తనకు మాత్రమే భార్యయని ధర్మరాజు అనుకొనకూడదు. ఇంతియేకాక, యుధిష్ఠిరుడు తొలుత తను ఓడి పిదప ద్రౌపదిని ఓడెను. అన్ని పందెములను గెలుచుకొనవలెనను దురాశతో శకునియే ద్రౌపదిని పందెముపెట్టు మాటను లేవనెత్తెను. కనుక ఈ విషయములన్నిటిని విచారించి చూడగా ద్రౌపది గెలువబడినట్లు నేను అంగీకరించను."

వికర్ణుని మాటలను వినిన సభాసదులు అతనిని పొగడుచు, శకునిని నిందించుచుండిరి. ఆ ధ్వని సభయంతయు వ్యాపించెను. ధ్వని యణగిన తరువాత కర్ణుడు మిక్కిలి క్రోధముతో వికర్ణుని చేయి పట్టుకొని యిట్లనెను :–

"వికర్ణా ! ప్రపంచములో అనేక వస్తువులు విపరీత ఫలమునిచ్చునవిగా కనబడుచున్నవి. ఎట్లనగా, అరణి (అగ్నిని చిలుకునట్టి కొయ్య) నుండి పుట్టిన అగ్ని ఆ కొయ్యనే కాల్చును. అలాగే ఒక్కొక కులములో పుట్టిన మనుష్యుడు తన కులమునే నశింపజేయు వాడుగానగును. శరీరములో నేపుట్టి పెరిగిన రోగములు శరీరమునే నశింపజేయును. పశువులు తామితినుగడ్డినే కాళ్ళతో త్రొక్కును. ఆవిధముగానే నీవు ధార్తరాష్ట్రుడవుగా పుట్టికూడ స్వపక్షమునకే హానిగలిగించుచున్నావు. వికర్ణా! భీష్మద్రోణాదులగు పెద్దలు నీకన్న ఎక్కువ బుద్ధిశాలురుకారా ? ద్రౌపది వీరందరిని మాటిమాటికి ఎలుగెత్తిపిలిచి మొరపెట్టుకొనుచున్నను వీరేమియు బదులు చెప్పకయున్నారు. అందుచేత 'ద్రౌపది ధర్మముప్రకారమే జూదములో జయింప బడినది.' అని వీరి నిశ్చయము కాదా? వికర్ణా! నీవు మూర్ఖుడవై, ఈ మహా సభలో వృద్ధునివలె నీతులు పలుకుచు నీ గొడ్డలితో నీ కాళ్ళనే తెగనరకు కొనుచున్నావు. నీకు ధర్మము విషయమైన యథార్థజ్ఞానము లేదు. గెలువబడిన ద్రౌపది గెలువబడ లేదనుచున్నావు కనుక నీ మంద బుద్ధిని నీవు ప్రకటించు కొంటివి.

"వికర్ణా ! ధర్మరాజు జూదములో తన సర్వస్వమును పందెము పెట్టి ఓడెను కదా ! ద్రౌపది అతని సర్వస్వములో చేరదా ? కనుక ఈమె ధర్మ పూర్వకముగనే జయింపబడినది. ఇట్లుండగా నీవు కాదందువేల? యుధిష్ఠిరుడు తన నోటితో ఈమె పేరును ఉచ్చరించుచు పందెముపెట్టెను. దానికి ఇతర పాండవులు మౌనముతో నంగీకరించిరి. కనుక వికర్ణా! ఈమె ధర్మము ప్రకారము జయింపబడలేదని నీవనుట తప్పు.

"వికర్ణా ! ఏకవస్త్రయగు ద్రౌపది అధర్మముగా సభలోనికి తేబడినదని నీవు తలచినచో దానికి నా ఉత్తరమును వినుము! 'స్త్రీకి ఒకడే పతి' యని దేవతలు నిర్ణయించిరి. ఇట్లుండగా ఈ ద్రౌపది అనేక పతులకు వశురాలై యున్నది. కనుక ఈమె నిశ్చయముగా వేశ్య యగును. వేశ్యను సభలోనికి తెచ్చుటలో విచిత్రమేమియు లేదు. ఏకవస్త్రయైనను అథవా వివస్త్రయైనను ఈమెను సభలోనికి తేవచ్చును. ఇది నానిశ్చయము. పాండవుల ధనము నంతయు, సోదరులతోసహా, భార్యతోసహా శకుని ధర్మపూర్వకముగా గెలుచుకొనెను."

ఇట్లుపలికి కర్ణుడు దుశ్శాసనునితో, "ఈ వికర్ణుడు మూర్ఖుడు. ధర్మజ్ఞునివలె మాట్లాడబోవు చున్నాడు. ఇతని మాటలను పాటించక దుశ్శాసనా ! నీవు పాండవుల వస్త్రములను ద్రౌపది వస్త్రములను ఊడదీయుము." అని చెప్పగనే పాండవులు తమతమ ఉత్తరీయములనుతీసి క్రిందనుంచిరి.

## వస్త్రాపహరణము

తరువాత దుశ్శాసనుడు ఆ నిండుసభలో ద్రౌపది వస్త్రమును బట్టి బలాత్కారముగా లాగదొడగెను. అప్పుడు ద్రౌపది అక్కడ తనను కాపాడుటకు దిక్కేదియు లేదని మనసా శ్రీకృష్ణపరమాత్మనుగూర్చి "కృష్ణా ! కౌరవులు నన్ను అవమానపరచుటను నీ వెరుగకున్నావా ? ఈ కౌరవ సముద్రమునుండి నన్ను ఉద్ధరింపుము. ఈ సభా మధ్యములో ఆపన్నురాలనగు నన్ను కాపాడుము" అని మాటి మాటికి తలచుచు చేతులతో ముఖమును కప్పికొని బిగ్గరగా ఏడ్చెను.

ద్రౌపది దుఃఖధ్వనినివిని భగవంతుడు ధర్మస్వరూపుడగు శ్రీకృష్ణుడు తన శయ్యను వీడి అచ్చోటికి కనురెప్పపాటులో వచ్చి అస్పష్టరూపముతో ఆమె వస్త్రములో ప్రవేశించి వివిధములగు సుందర వస్త్రముల రూపములో ఆమె శరీరమును ఆచ్ఛాదించెను. దుశ్శాసనుడు వస్త్రములు లాగుకొలది, అట్టి వస్త్రములే అనేకములు కృష్ణమాయచే నుత్పన్నము లగుచుండెను. ఇంతియేకాక ధర్మ ప్రభావముచే వివిధ వర్ణములుగల వందలకొలది వస్త్రములు గూడ పుట్టుచుండెను.

## భీమ ప్రతిజ్ఞ

అప్పుడు సభలో మహా కోలాహలము పుట్టెను. ఆ యద్భుత దృశ్యమునుచూచి సభాసదులందరు ద్రౌపదిని ప్రశంసించుచు దుశ్శాసనుని నిందించిరి. అపుడు భీముడు క్రోధోద్రిక్తుడై చేతులు నలిపికొనుచు భయంకరముగా గర్జించుచు, "రాజులారా ! వినుడు. నేను యుద్ధములో ఈ దుశ్శాసనుని రొమ్ముచీల్చి వేడి నెత్తురు త్రాగెదను. అట్లుచేయఁబోతినేని నా పూర్వులు పోయిన సద్గతికి నేను పోవకుందునుగాక." అని ప్రతిజ్ఞ చేసెను.

ఆ ప్రతిజ్ఞనువిని సభాసదులందరు భీముని ప్రశంసించి దుశ్శాసనుని నిందించిరి. సభలో గుట్టలు గుట్టలుగా వస్త్రములు పడిపోయెను. దుశ్శాసనుడు అలసిపోయి సిగ్గుచేత క్రింద కూల

బడెను. అప్పుడు ధర్మజ్ఞుడైన విదురుడు తన రెండుచేతులను పైకెత్తి సభవారి కలకలశబ్దమును అణచి యిట్లనెను :—

"సభాసదులారా ! ద్రౌపది యడిగిన ప్రశ్నమునకు ఉత్తరముచెప్పక ధర్మహాని చేయుచున్నారు. సంకటములో పడిన మానవుడు అగ్నిలోపడినవానివలె సభను శరణు జొచ్చును. అప్పుడు సభాసదులు, ధర్మమును, సత్యమును దృష్టిలోనుంచుకొని మంచిమాటలుచెప్పి, ఆ మానవుని శాంతపరచుట న్యాయము. కనుక కామ క్రోధములను విడిచి ఆమె ప్రశ్నములకు సదుత్తరముల నీయవలెను. వికర్ణుడు తనకు తోచిన యుత్తరము నిచ్చెను. మీరుగూడ మీ మీ బుద్ధికి తోచినట్లుగా బదులు పలుకుడు. ధర్మజ్ఞుడైనవాడు సభలో ప్రశ్నమునకు సదుత్తరమునీయనిచో, అసత్యము లాడినవాని ఫలములో సగము భాగమును పొందిన వాడగును ఒక వేళ అతడు సభలో అసత్య నిర్ణయమును చేసినచో పూర్తిగా అసత్యమును చెప్పిన దుష్ఫలమునకు పాత్రుడగును. ఈ విషయములో నొక యితిహాసమును చెప్పెదను వినుడు" అని యిట్లు సుధన్వునికథ చెప్ప దొడగెను:—

## సుధన్వుని కథ

"పూర్వము ప్రహ్లాదుడను రాక్షసరాజు ఉండెను. అతని కొడుకగు 'విరోచనుడు' కేశిని యను కన్యతో వివాహము చేసికొనదలచి ఆ కన్యను పొందుటకుగాను అంగిరసుని పుత్రుడగు సుధన్వునితో వివాదపడెను. విరోచనుడు, సుధన్వుడు 'నేను శ్రేష్ఠుడను, నేను శ్రేష్ఠుడను" అని పరస్పరము వాదము సలుపుచు ప్రాణములను పందెములుగా పెట్టి వాదించిరి. ఆ వివాదము పెద్దగా పెరిగెను. అప్పుడు వారిరువురు 'తమలో శ్రేష్ఠతరుడెవ్వడు" అని నిర్ణయింపుమని దైత్యరాజగు ప్రహ్లాదుని కోరిరి. అప్పుడు భయపడుచున్న సుధన్వుని వైపు ప్రహ్లాదుడు చూడగనే సుధన్వుడు మహా కోపముతో "ప్రహ్లాదా! నీవు ఈ సందర్భములో అసత్యమును మాట్లాడినగాని, మౌనమును వహించినగాని, ఇంద్రుని వజ్రాయుధము నీ తలపై బడి నీతల నూరుముక్కలుగా పగిలి పోవును" అని పలికెను."

ఆ మాటలను విని ప్రహ్లాదుడు మిగుల బాధపడుచు, రావియాకువలె వణకుచు మహాతేజస్వి యగు కశ్యపుని వద్దకు పోయి, 'మహాత్మా! నీవు దేవతలయొక్క, రాక్షసులయొక్క, బ్రాహ్మణులయొక్క ధర్మములను తెలియుదువు. నేనొక్క మాట అడిగెదను చెప్పుము. ప్రశ్నమునకు ఉత్తరము తెలిసి చెప్పనివాడును, అసత్యమగు నుత్తరమును చెప్పువాడును ఎట్టి లోకములకు పోవుదురో చెప్పుము' అని అడిగెను.

ఆ మాటకు కశ్యపుడిట్లు బదులు చెప్పెను:—"ఎవడు ప్రశ్నమునకు ఉత్తరము తెలిసికూడ చెప్పడో, అట్టివాడును, ఎవడు రెండు పక్షములతో సంబంధము పెట్టుకొని, గోవుకర్ణములవలె వదులుగా సాక్ష్యమును చెప్పునో అట్టి సాక్షియు, వరుణదేవుని సహస్ర పాశములతో కట్టబడుదురు. వారు, ఒక్కొక్క సంవత్సరము ఒక్కొక్క ఉరి చొప్పున ఆ పాశములను క్రమముగా వదలించుకొను చుందురు. కనుక ప్రహ్లాదా! తెలిసినవాడు వెంటనే సత్యమునే పలుకవలెను.దానిని మరుగు పరచగూడదు.


"అధర్మ శల్యముచేత ధర్మము క్రుచ్చుకొనబడి యున్నప్పుడు, సభాసదులు ఆ శల్యమును ఛేదించనిచో ఆముల్లు వారినే గ్రుచ్చుకొని బాధించును. (అనగా వారు అధర్మ పరులగుదురు అని భావము) సభలో జరిగిన అధర్మములో అర్ధభాగము సభాపతికి, పావుభాగము అధర్మము నాచరించువారికి తక్కిన పావు భాగము నిందనీయులను నిందించని సభాసదులకు అంటును. సభలో నిందార్హుడు నిందింపబడినప్పుడు, అధర్మ ఫలము సభాసదులకుగాని, సభాపతికిగాని అంటదు. ఆ దుష్ఫలమంతయు కర్తకే అంటును. ప్రహ్లాదా ! ధర్మవిషయమై ప్రశ్నము చేసిన వానికి, అసత్యమగు ఉత్తరమును చెప్పువాడు తనకే కాక, తనకు పూర్వముండిన యేడు తరముల వారికిని, తన తరువాత కలుగబోవు ఏడు తరములవారికిని ముప్పును కలిగించిన వాడగును

"సర్వస్వము అపహరింపబడిన వానికి, పుత్రుడు మరణించినవానికి, అప్పులపాలైన వానికి, స్వార్థమును పోగొట్టుకొనిన వానికి, పతిహీనురాలికి, రాజకోపమునకు పాత్రుడైనవానికి, పుత్రహీనురాలికి, పులియొడిలో చిక్కుకొనిన వానికి, సవతిగల స్త్రీకి, సాక్షులచేత మోసగింపబడిన వానికిని గలుగు దుఃఖములన్నియు సమానములేయని దేవతలు చెప్పినారు. ఈ దుఃఖములన్నియు అసత్యముచెప్పిన వాని కొక్కనికే సంప్రాప్తములగును. ప్రత్యక్షముగా చూచినవాడును, వినినవాడును, స్పష్టముగా తెలిసిన వాడును సరియైన సాక్షియగును. అట్టి సాక్షిధర్మ పూర్వకముగా సత్యమునే పలికినచో వానికి ధర్మము, అర్థము ఎప్పుడుగూడ లోపించవు."

కశ్యపుని మాటలను విని వచ్చి ప్రహ్లాదుడు కొడుకుతో, "విరోచనా! నీకంటె సుధన్వుడు శ్రేష్ఠుడు. అతని తండ్రి అంగిరసుడు నాకంటె శ్రేష్ఠుడు. సుధన్వుని తల్లి నీతల్లికంటె శ్రేష్ఠురాలు. కనుక ఈ సుధన్వుడిప్పుడు నీ ప్రాణములకు అధికారియగును, మీ వివాదములో సుధన్వుడు గెలిచెను. నీ ప్రాణములను అర్పించి అతని ప్రతిజ్ఞను చెల్లించుము." అని యనెను. ప్రహ్లాదుని ధర్మవచనములను విని సుధన్వుడు, 'పుత్రప్రేమను విడిచి ధర్మమును నిష్పక్షపాతముగా నిర్ణయించితివి. నేను ప్రసన్నుడనైతిని. కనుక ప్రహ్లాదా! 'నీ పుత్రుడు నూరుసంవత్సరముల దీర్ఘాయుష్యముతో బ్రతుకుగాక' అని నేను ఆజ్ఞాపించుచున్నాను." అని యనెను.

విదురుడు పై కథను చెప్పి, 'కశ్యపుని వచనములను తలచుచు ఇచటి సభవారందరును ఇప్పుడు ద్రౌపది ప్రశ్నమునకు సరియైన సమాధానమును ఈయవలసియుండును.' అని చెప్పెను.

విదురుని మాటకు సభాసదులెవరుగూడ ఏమియు మాట్లాడజాలకుండిరి. అప్పుడు కర్ణుడు 'దాసియైన ద్రౌపదిని ఇంటిలోనికి కొనిపొమ్ము.' అని దుశ్శాసనునితో ననెను. ఆ మాటవిని, లజ్జతో గడగడవణకుచు, పాండవులనుచూచి మొరపెట్టుచు దిక్కుమాలి దుఃఖించుచున్న ద్రౌపదిని దుశ్శాసనుడు ఆ సభామధ్యములో జరజర ఈడ్వదొడగెను. (సశేషము)



# మహిళలకుగల హోదా

బాపూ వాణి

మానవుడు బాధ్యత వహించవలసిన దురాచారాలన్నిటిలోకీ, నారి లోకాన్ని అన్యాయానికి గురిచేయడంకంటె దారుణమయినది, నికృష్టమయినది, అమానుషమయినది మరొకటి కన్పించదు. త్యాగానికీ, నమ్రతకూ, బాధలను ఓర్పుతో భరించడానికీ ప్రతి రూపమయిన స్త్రీలే, నిజానికి, స్త్రీ పురుష జాతులు రెండింటిలోనూ ఉదాత్తమయినవారు.

స్త్రీలను అబలలు అనటం, వారిని అపఖ్యాతిపాలు చేయటమే, పురుషుడు స్త్రీని అన్యాయం చేయటమేకాగలదు. బలం అన్నప్పుడు పాశవిక శక్తి అని మాత్రమే భావించే పక్షంలో, పురుషునిలో కంటె స్త్రీలో పశుత్వం తక్కువే అని చెప్పవచ్చు. అలాకాక, శక్తి అన్నది నైతిక శక్తిగా భావించినట్లయితే మాత్రం, పురుషుడి కంటె స్త్రీయే అత్యధికురాలు. సహజస్ఫూర్తిలోనూ, స్వార్థత్యాగం విషయములోనూ, ధైర్య సాహసాలలోనూ స్త్రీ, పురుషునికంటె మిన్న యేకదా. స్త్రీ లేనిదే పురుషుడు మనుగడ సాగించలేడు. అహింసయే మన నైతికసూత్రం అయ్యేపక్షంలో, మన భవిష్యత్తు స్త్రీలపైననే ఆధారపడి ఉంది. మానవ హృదయాన్ని స్పందించగల శక్తి, స్త్రీ కంటె మరెవరికి ఎక్కువ ఉంటుంది కనుక.

రూపుదాల్చిన స్వార్థత్యాగమే స్త్రీ అని నా అభిప్రాయం. అయితే, పురుషునికంటె తాను ఎంత అధికురాలో, స్త్రీ ఈనాడు దురదృష్టవశాత్తు గుర్తించటం లేదు. టాల్‌స్టాయి అన్నట్లుగా, వారు, మంత్రముగ్ధులవలె, పురుషుని పలుకుబడికి లొంగి పోతున్నారు. అహింసకు గల శక్తి ఏ పాటిదో గ్రహించిననాడు, వారు అబలలు అనిపించుకోడానికి సమ్మతించరు.

## న్యాయతః మహిళలకుగల స్థానం

నేనేగనక స్త్రీగా జన్మించి ఉంటే, స్త్రీ తనకు భోగ వస్తువుగా ఉపకరించేందుకు మాత్రమే జన్మించింది అని చెప్పే పురుషులపై కత్తికట్టే వాడిని. స్త్రీ హృదయం ఏమిటో గ్రహించేందుకు మానసికంగా నేను స్త్రీ నయ్యాను. మనోబలం విషయములో పురుషునితో సమానురాలు స్త్రీ. పురుషునికి సహచరురాలు. పురుషుల కార్యకలాపాలన్నిటిలోనూ పాల్గొనే అధికారం ఆమెకు ఉన్నది. పురుషునితో సమానమయిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఆమెకూ ఉన్నాయి.

తనకు సంబంధించిన కార్యరంగంలో పురుషునికి ఉన్నట్లుగానే, స్త్రీకికూడా తన కార్యరంగంలో అత్యున్నతస్థానం ఉన్నది. ఇది సహజంగా ఏర్పడవలసిన పరిస్థితే కాని, చదువనూ వ్రాయనూ నేర్చిన ఫలితంగా సంక్రమించవలసినది కాదు.

గృహిణులందరూ, భర్తలతో ప్రమేయంలేకుండా స్వతంత్రంగా ఏదో ఒక ప్రవృత్తి కల్పించుకు తీరాలని నేననటం లేదు. వారు తమ శక్తినంతా వినియోగించడానికి ఇల్లు చక్కపెట్టుకోవటమూ, పిల్లల పెంపకమూ చాలు. క్రమబద్ధమయిన సమాజంలో సంసారాన్ని పోషించ వలసిన అదనపు బాధ్యత గృహిణిపై పడకూడదు; ఆ పని గృహస్థు స్వీకరించాలి. ఇల్లు నడిపే బాధ్యత గృహిణి వహించాలి. ఈ విధంగా ఒకరికొకరు సహాయపడుతూ జీవనం సాగించాలి.

తన విధులు ఏమిటో గ్రహించి నిర్వర్తించగల స్త్రీ హుందాతోకూడిన తన హోదా ఏమిటో తెలుసుకోగలదు. తమ చక్కదిద్దే గృహసామ్రాజ్యానికి ఆమె మహారాజ్ఞి, బానిసకాదు.

## స్త్రీ పురుషుల మధ్య సమానత్వం

స్త్రీ హక్కుల విషయంలో నా అభిప్రాయాలను ఎన్నడూ మార్చుకోజాలను. న్యాయతః పురుషునికి లేని ప్రతిబంధకం ఏదీకూడా స్త్రీకి ఉండరాదని నా అభిప్రాయం. కుమారులనూ

కుమార్తెలనూ ఒకేవిధంగా చూడాలని నా అభిమతం. స్త్రీ పురుషులమధ్య సమానత్వం ఉండాలి అన్నంత మాత్రాన, వారు ఇరువురూ ఒకే రకం వృత్తులను చేపట్టాలని అర్థం కాదు. వేటాడేందుకూ, కత్తి బట్టి కదనరంగంలో దూకేందుకూ, చట్టరీత్యా స్త్రీకి అవరోధం ఏదీ లేకపోవచ్చు. కాని, సాధారణంగా పురుషుడు చేస్తూండే పనులజోలికి పోయేందుకు స్త్రీ ఇచ్ఛగించదు. సృష్టిరీత్యానే స్త్రీలూ పురుషులూ నిర్వర్తించవలసిన విధులూ, చేయవలసిన పనులూ విడివిడిగా ఉన్నాయి.

స్త్రీ పురుషులకు మధ్య వ్యత్యాసం ఏదీ చూపను నేను. పురుషుని మోస్తరే స్త్రీకి కూడా తాను స్వతంత్రంగా జీవించగలనన్న ధీమా కలగాలి. ధైర్యస్థైర్యాలు ఒక్క పురుషుడి సొత్తే కాదు. పురుషులకంటె తామేదో హీనులమని కాని, వారికి లోబడి ఉండవలసినవారమని కాని స్త్రీలు భావించుకోనక్కరలేదు. అవాంఛనీయమైన అక్రమమైన నిర్బంధాలన్నిటినీ వ్యతిరేకించవలసిందని స్త్రీలకు నా సలహా. ఈ వ్యతిరేకించటం అన్నది సమంజసమూ, సహేతుకమూ అయినప్పుడు, దానివల్ల ప్రమాదం ఏదీ ఉండబోదు.

## వ్యత్యాసం

అయితే ఏదోవిధంగా యుగయుగాలుగా పురుషుడు స్త్రీ మీద పెత్తనం చెలాయిస్తూనే ఉన్నాడు. ఫలితంగా, తానేదో తక్కువఅనే భావం స్త్రీలో గాఢంగా నాటుకుపోయింది. స్వప్రయోజనాన్ని ఆశించి పురుషుడు, స్త్రీ తనకంటె తీసికట్టు అని చాటుకుంటూ ఉంటే నిజమే కాబోలనుకుని ఆమె నమ్మింది. కాని వివేకవంతులయిన పురుషులు, స్త్రీలకు తమతోగల సమాన ప్రతిపత్తిని గ్రహించారు. అయితే, ఎక్కడో ఒక్కచోట తేడావస్తూనే ఉంది. ఆకృతిలో గల తేడాలను బట్టి, స్త్రీ పురుషులు స్వీకరించవలసిన వృత్తులలో వ్యత్యాసాలు ఏర్పడ్డాయి.

## ప్రత్యేక కృషి

అత్యంత ఉత్కృష్టరూపంలో అహింసా తత్వాన్ని ప్రదర్శించవలసిన ధర్మం స్త్రీలకు ఉన్నదని నావిశ్వాసం. అహింసాత్మకంగా వ్యవహరించడానికి పురుషులకంటె స్త్రీలే తగినవారు. అహింసకు ప్రతిరూపమే స్త్రీలు. అహింస అంటే అపరిమితమైన ప్రేమానురాగాలు అన్నమాట. ప్రేమ అంటే బాధలకు ఓర్చుకోగల శక్తి అన్నమాట. పురుషునికి మాతృమూర్తి అయిన స్త్రీ కంటె ఈ ఓర్పు సమృద్ధిగా చూపగలవారింకెవరు?

## బిడ్డలనుంచి గ్రహించవలసిన వివేకం

మనలో ఎవరికంటెను కూడ, బిడ్డలకే హాస్యరసం పాలు ఎక్కువ అని, కొన్నివందల (ఆమాటకు వస్తేవేలు) మంది బాలలను గమనించడంద్వారా గడించిన అనుభవాన్ని పురస్కరించుకుని చెప్పగలను. మన అహంకారాన్నీ, దర్పాన్నీ గనక కాస్త విస్మరించి యోచించగలిగినట్లయితే, పెద్దలనుంచి కంటె చిన్న పిల్లలనుంచే మనంజీవితానికి సంబంధించిన ఎన్నోగుణపాఠాలను నేర్చుకోగలం. బాలవాక్యం బ్రహ్మవాక్యం అన్నది నానుడి. బాలలముఖతః వెలువడే దానికంటె గొప్ప వివేకం మరేమీ ఉండబోదని జీసస్ వక్కాణించారు. నా నమ్మకం కూడా అదే.

## కుటుంబనియంత్రణ

కుటుంబనియంత్రణ కార్యక్రమాలు అమలు జరుపుతున్న స్వచ్ఛంద సంస్థలకు వెంట వెంటనే గ్రాంట్లు మంజూరు చేయడానికి వీలుగా, కొన్ని రాష్ట్రాలలో ఆర్థిక సహాయ సంఘాలు ఏర్పాటుచేశారు. ఆంధ్రప్రదేశ్, అస్సాం, బీహార్, గుజరాత్ హరియానా, కేరళ, మద్రాసు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మైసూరు, ఒరిస్సా, పంజాబు, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాలు రాష్ట్రాలలోనూ, కేంద్ర పాలిత ప్రాంతాలైన ఢిల్లీ, హిమాచల ప్రదేశంలోనూ ఇటువంటి సంఘాలు ఏర్పాటు అయ్యాయి. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ నియంత్రణ, పట్టణ అభివృద్ధి వ్యవహారాల శాఖ ఈ సంఘాలను ఏర్పాటు చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది.

రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ డైరెక్టరు, కుటుంబ నియంత్రణశాఖ అధికారి, కుటుంబ నియంత్రణ వ్యవహారాల ప్రాంతీయ డైరెక్టరుతో ఈ సంఘాలు ఏర్పాటు అయ్యాయి. స్వచ్ఛంద సంస్థ నుంచి ఆర్థిక సహాయం కొనసాగింపు నిమిత్తం వచ్చే దరఖాస్తులనూ, క్రొత్తగా ఆర్థిక సహాయం కోరుతూ వచ్చే దరఖాస్తులనూ జాగ్రత్తగా పరిశీలించి ఈ సంఘాలు ఆయా సంస్థలకు గ్రాంట్లు మంజూరు చేస్తాయి.

## తూర్పు గోదావరి జిల్లాలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు

తూర్పు గోదావరి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రయివేటు వైద్య సంస్థలలో 1968 ఏప్రిల్ నెలలో మొత్తం 1117 వెసెక్టమీ శస్త్ర చికిత్సలు జరిగాయి ఈ సంవత్సరం ప్రారంభం నించి ఏప్రిల్ నెలాఖరకు మొత్తం ఇంచుమించు 9,500 శస్త్ర చికిత్సలు జరిగాయి. ఏప్రిల్ నెలలో ట్యూబెక్టమి శస్త్ర చికిత్సలు 84 జరిగాయి, 137 కేసులలో లూప్‌లను అమర్చడం జరిగింది. ఈ సంవత్సరం ఆరంభంనించి లెక్కిస్తే ఏప్రిల్ మాసాంతానికి మొత్తం 354 ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలను నిర్వహించారు. 709 లూపులను అమర్చారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎక్కువ వెసెక్టమీ శస్త్ర చికిత్సలను నిర్వహించిన కేంద్రం కోట నందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. ఇక్కడ 120 వెసెక్టమీశస్త్ర చికిత్సలు నిర్వహించబడినాయి. ఆ తరువాత స్థానం ఏలేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానిది. ఇక్కడ 70 వెసెక్టమీ శస్త్ర చికిత్సలు జరిగాయి. ప్రభుత్వ ఆసుపత్రులలో ముందు పేర్కొనదగినది కాకినాడలోని ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రి. ఇక్కడ 146 వెసెక్టమీ శస్త్రచికిత్సలు జరిపించారు. రాజమండ్రిలోని ప్రభుత్వ హెడ్ క్వార్టర్స్ ఆసుపత్రిలో 134 వెసెక్టమీ శస్త్ర చికిత్సలు జరిపించారు.

ఈ జిల్లాలోని నాలుగు ఏజన్సీ పంచాయతీసమితులలోనూ ఏప్రిల్‌లో అడ తీగల పంచాయతీ సమితిలో అధిక సంఖ్యలో వెసెక్టమీ శస్త్ర చికిత్సలు జరిగాయి అంటే యిక్కడ 71 శస్త్ర చికిత్సలు జరిగాయి నర్సీపట్నం సమితి 123 వెసెక్టమి శస్త్ర చికిత్సలు జరిపించి ప్రథమస్థానం వహించింది ఆ తరువాత స్థానం శంకవరం పంచాయతీ సమితిది ఇక్కడ 107 శస్త్ర చికిత్సలు జరిపారు.

# కార్మిక కల్యాణం

## భద్రతా అవార్డులు : బహుమతులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్రంలోని ఫ్యాక్టరీలలో భద్రతను ఉన్నతంగా పాటించినవాటికి అవార్డులు యిచ్చేందుకూ, భద్రత విషయంలో ఉత్తమ సూచనలు చేసినవారికి బహుమతులు యిచ్చేందుకూ పథకాలు రూపొందించింది. జాతీయ అవార్డులు, బహుమతుల పథకం పద్ధతిలోనే వీటిని ఏర్పరిచారు. ప్రమాదాలను నివారించే కృషిలో మేనేజిమెంట్లు, కార్మికుల ప్రయోజనాలను ప్రోత్సహించే ఉద్దేశంతో పారిశ్రామిక సంస్థలలో ఉత్తమ భద్రత రికార్డులను పరిగణించడం, ప్రమాదాల నివారణలో పారిశ్రామిక కార్మికుల ప్రయోజనాలను ప్రోత్సహించడం, భద్రత విషయంలోనూ, సాధ్యమైనంతవరకు ప్రమాదాలు జరగకుండా పని నిర్వహించే విషయంలోనూ, సూచనలు, సలహాలు పొందడం యీ పథకాల లక్ష్యాలు.

## పారిశ్రామిక భద్రతకు 1967 సం. రాష్ట్ర అవార్డు

పట్టు, నూలు వస్త్రాల మిల్లులు, చక్కెర (ఖండసారితో సహా), సిమెంటు, ఇంజనీరింగు ఫ్యాక్టరీలు, జనపనార మిల్లులకు యీ పథకం వర్తిస్తుంది. ఐతే, 1948 వ సం. పు. ఫ్యాక్టరీల చట్టం వాటికి వర్తించాలి. అంతేగాక ఆ క్యాలెండరు సంవత్సరంలో అవి కనీసం 6 లక్షల శ్రామికపని గంటలపాటు పనిచేసిఉండాలి దిగువ పేర్కొన్న ప్రతి పరిశ్రమలోనూ, 1967వ సంవత్సరంలో అంతక్రితం సంవత్సరంలోకంటే ప్రమాదాల విషయంలో అధికశాతంలో తగ్గుదలను సాధించి ప్రథమ స్థానం పొందిన ఫ్యాక్టరీకి అయిదు రన్నింగ్ ట్రోఫీలు ఇస్తారు.

1. వస్త్ర పరిశ్రమ (పట్టు, నూలు వగైరా) 2 చక్కెర (ఖండసారీతో సహా) 3. సిమెంటు. 4 ఇంజనీరింగ్. 5. జనపనార.

దరఖాస్తు చేయడానికి 1968 సెప్టెంబరు 30 వ తేదీ ఆఖరురోజు తమ ప్రాంతంలోని ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్లనుంచి పూర్తి వివరాలు తెలుసుకొనవచ్చు

## భద్రత విషయంలో ఉత్తమ సలహాకు రాష్ట్ర బహుమతులు (1967 సంవత్సరానికి)

1948 వ సం. పు ఫ్యాక్టరీల చట్టం క్రింద పనిచేస్తూ స్వయంగా సూచనల పథకాన్ని అమలు జరుపుతున్న ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులకు యీ పథకం వర్తిస్తుంది. ప్రమాదాల నివారణలోనూ ఫ్యాక్టరీని మంచి స్థితిలో ఉంచడంలోనూ కార్మికుల ప్రయోజనాలను ప్రోత్సహించగల ఏదైనా సూచనను, నినాదాన్ని, పోస్టర్లను సూచించవచ్చు.

### బహుమతుల వివరాలు


| తరగతి. | బహుమతి మొత్తం. రూ. | బహుమతుల సంఖ్య. |
|---|---|---|
| అ. | 500 | 2 |
| ఆ. | 250 | 4 |
| ఇ. | 100 | 10 |

బహుమతులు పొందినవారికి బహుమతులే గాక సర్టిఫికెట్లు కూడా ఇస్తారు. దరఖాస్తు చేయడానికి 1968 సెప్టెంబరు 30 వ తేదీ ఆఖరు రోజు. పూర్తి వివరాలను తమ ప్రాంతానికి సంబంధించిన ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టరునుంచి పొందవచ్చు. బహుమతి నిర్ణయ సంఘం తీర్పు అంతిమమైనది. అప్పీలుకు వీలుండదు.


# షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతుల సంక్షేమం

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతులు ఆర్థికంగానూ, సాంఘికంగానూ, విద్యావిషయకంగానూ అభివృద్ధి చెందడానికై అవసరమైన చర్యల నెన్నింటినో గత చాలా కాలంగా ప్రభుత్వం తీసుకుంటున్నది. ఇందుకు సంబంధించిన పథకాలకై చేసే ఆర్థిక కేటాయింపులు ఒక యేడాది తర్వాత మరో ఏడాదికి పెరుగుతూ వున్నాయి. అయితే కొన్ని కొన్ని రంగాలలో అభివృద్ధిని సాధించడం జరిగినప్పటికీ నిజానికి నూటికి నూరుపాళ్లు యీ సంక్షేమ పథకాల వల్ల విజయం సాధించడం జరుగలేదని, ప్రభుత్వం తమ సంక్షేమం నిమిత్తం వివిధ పథకాలను చేపట్టినా వాటిని విజయవంతంగా ఆచరణలో పెట్టడం జరగడంలేదని షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తరగతులవారు భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ సర్వీసుల్లో తమ కులాలు, జాతులవారి ప్రాతినిధ్యం విషయంలోనూ, అభివృద్ధి కార్యక్రమంలో తాము పాల్గొనే విషయంలోనూ ఏమంతగా అభివృద్ధిని సాధించడం జరగలేదని పైన పేర్కొన్న కులాలవారు, జాతులవారు అభిప్రాయ పడుతున్నారు. తమ ఆర్థిక బలహీనత కారణం వల్లనే తమ జీవితానికి, ఆస్తులకు తగినంత న్యాయపరమైన రక్షణను పొందడం జరగడంలేదని కూడా ఒక అభిప్రాయం వారిలో నెలకొన్నది.

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతుల సంక్షేమానికై పాటుపడడమే ప్రభుత్వం యొక్క ప్రధాన కర్తవ్యం. వారి సంక్షేమానికై ప్రత్యేక కేటాయింపులు, పథకాలు మొదలైనవి పటిష్టవంతంగా అమలు పరచబడతాయనీ పైన పేర్కొన్న కులాలు, జాతులవారి ఇబ్బందులు అన్నీ త్వరితంగానూ, పూర్తిగానూ సానుభూతితో పరిష్కరించ బడతాయనీ తెలియజేస్తూ యీ దిగువ పరిపాలనా విషయాలలో ఏర్పాట్లనుచేయాలని ప్రభుత్వం తలచింది.



జనసంబంధ, గ్రామిక మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ తాడేపల్లి దగ్గర బొలకంపాడులో మే 14 వ తేదీన రాష్ట్ర వెనుకబడిన వర్గాల మహాసభలో ప్రసంగించారు.



ఎక్సైజ్ శాఖామంత్రి శ్రీ వెనిగళ్ళ సత్యనారాయణ తెనాలిలో స్కేవెంజర్ల కాలనీకి శంకుస్థాపన చేసినప్పటిచిత్రం.

(ఎ) రాష్ట్రస్థాయి:— ప్రధాన కార్యదర్శి, పదవిరీత్యా షెడ్యూల్డు కులాలు— షెడ్యూల్డు తెగల కమీషనరుగా వ్యవహరిస్తారు. ఈ కులాలవారి పురోభివృద్ధికై ప్రభుత్వం కాలక్రమేణా ఏర్పాటుచేయు ప్రత్యేక నియమావళిని సక్రమంగా అమలు జరిపించడం వీరి బాధ్యత. ఇంతేకాకుండా ఈ ప్రత్యేక సదుపాయాల అమలుకు సంబంధించి ఏదేని ఫిర్యాదులున్నట్లయితే వాటివిషయమై విచారణ జరిపి తగు చర్యలు తీసుకొనడం గూడా వీరి విధిక్రిందకు వస్తుంది. ఈ షెడ్యూల్డు కులాల వారికి అన్యాయాలు జరగకుండా పరిరక్షించే విషయంలో కూడా వీరు అవసరమైన చర్యలు తీసుకుంటారు.

(బి) జిల్లాస్థాయి:— షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతుల ఎక్స్ అఫీషియో డిప్యూటీ కమీషనర్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. రాష్ట్రస్థాయిలో కమీషనర్ నిర్వహణ బాధ్యతలే జిల్లా స్థాయిలో వీరికి వుంటాయి. వీరు నేరుగా రాష్ట్రస్థాయిలోని కమీషనర్ ఆధిపత్యం క్రింద పనిచేస్తారు. తన అధికార హోదాకు మించిన పనుల విషయంలో కలెక్టరు తమ నివేదికను నేరుగా కమీషనరుకు అందజేస్తారు. పైన పేర్కొన్న కులాలు, జాతుల వారి ఇబ్బందులను విచారణ జరిపే విషయంలో జిల్లాలలోని అన్ని శాఖల అధికారుల నుండి (న్యాయశాఖ మినహా) నివేదికలను పంపవలసిందిగా కలెక్టరు ఆదేశించవచ్చు. లేదా రికార్డులనైనా తనిఖీ చేయవచ్చు. వీలయితే తన పలుకుబడిని ఉపయోగించి యీ యిబ్బందులను ఆయనే పరిష్కరించవచ్చు.

ఈ కులాలకు చెందిన ఎవరైనా వ్యక్తి ఏదైనా ఫిర్యాదు చేయదలచుకున్నట్లయితే, లేదా విజ్ఞాపన అందజేయ దలచినట్లయితే దానిని కమీషనరుకు, లేక అందుకు సంబంధించిన డిప్యూటీ కమీషనరుకు ఇవ్వాలి. తనకు కలిగిన ఇబ్బందిని గురించిన పూర్తి వివరాలనూ, తాను పొందగోరే సహాయం వివరాలనూ అతను అందులో పేర్కొనాలి. ఈ విధంగా విజ్ఞాపన చేసుకునే వ్యక్తి ప్రభుత్వోద్యోగి అయిన పక్షంలో తన విజ్ఞాపన ప్రతివాక దానిని

తన కార్యాలయాధిపతికి అందజేయాలి. అంతట కార్యాలయాధిపతి, ఆ విజ్ఞాపన పైన ఒక సమగ్ర నివేదికను తన అధికారి ద్వారా కమీషనరుకు సమర్పిస్తారు. ఇబ్బంది నివారణ జిల్లా స్థాయిలో జరుగవలసిన అంశాల విషయంలో కమీషనరుకు ఇచ్చిన విజ్ఞాపన ప్రతిని జిల్లా కలెక్టరుకు పంపించడం జరుగుతుంది. అట్టి విజ్ఞాపన అందిన మీదట కలెక్టరు అవసరమైన విధంగా విచారణ జరిపి తాను నివారించ గలిగిన ఇబ్బందుల విషయంలో కమీషనరుకు నివేదిక సమర్పిస్తారు.

నిమ్న జాతులు, నిమ్న తెగలవారు చేసుకునే విజ్ఞప్తులను పరిశీలించే నిమిత్తం సాధారణ పరిపాలన శాఖలో ఒక విభాగాన్ని నెలకొల్పుతారు. ఈ విభాగానికి డిప్యూటీ సెక్రటరీ హోదాలోని అధికారి అధిపతిగా వుంటారు. ఆయన కమీషనరుకు అతని విధుల నిర్వహణలో సహాయపడతారు. ఈ విభాగంలో ఒక సెక్షన్ ఆఫీసరు, ఇద్దరు అసిస్టెంట్లు, ఒక టైపిస్టు వుంటారు.

జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి కలెక్టరు పర్సనల్ అసిస్టెంటుగా వ్యవహరించి అతనికి విధుల నిర్వహణలో సహాయ పడతారు.

## రాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహా సంఘం

ఈ క్రింద పేర్కొన్న సభ్యులతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహా సంఘాన్ని పునర్ వ్యవస్థీకరించింది.

శ్రీమతి సంగం లక్ష్మీబాయి, యం. పి. హైదరాబాదు,
శ్రీ పోతుల గున్నయ్య, యం. ఎల్. ఎ. శ్రీకాకుళం,
శ్రీ ఈలి వాడపల్లి, ఎం. ఎల్. ఎ; తూ. గో. జి.
శ్రీ నంబూరి శ్రీనివాసరావు, ఎం. ఎల్. ఎ; ప. గో. జి.
శ్రీ ఎం. రాజేశ్వరరావు, మాజీ ఎం. ఎల్. ఎ; ప. గో. జి.
శ్రీ వి. కూర్మయ్య, ఎం. ఎల్. ఎ. కృష్ణా జిల్లా,
శ్రీ డి. ప్రకాశం, ఎం. ఎల్. ఎ. గుంటూరు,
శ్రీ ఎస్. వేమయ్య, ఎం. ఎల్. ఎ. నెల్లూరు,
శ్రీ మునుస్వామి, ఎం. ఎల్. ఎ. చితూరు,
శ్రీ డి. గోవిందదాసు, ఎం. ఎల్. ఎ.
శ్రీ ఎం. బి. రాజారావు, ఎం. ఎల్. ఎ. అనంతపురం,
శ్రీమతి సుమిత్రాదేవి, ఎం. ఎల్. ఎ. హైద్రాబాదు జిల్లా,
శ్రీమతి రాజామణిదేవి, మాజీ ఎం.ఎల్.ఎ. సికింద్రాబాదు,
శ్రీమతి జె. ఈశ్వరీబాయి, ఎం. ఎల్. ఎ. నిజామాబాద్,
శ్రీ కె. కాంతయ్య, ఎం. ఎల్. ఎ. ఖమ్మం
శ్రీ పి. మహేంద్రనాథ్, ఎం. ఎల్. ఎ. అచ్చంపేట, మహబూబ్‌నగర్ జిల్లా,
శ్రీ బి. రాజారామ్, ఎం. ఎల్. ఎ. కరీంనగర్,
శ్రీ జయరాజు, మాజీ ఎం. ఎల్. ఎ.
శ్రీ వై. ఎస్. రావు, మాజీ ఎం. ఎల్. సి. సికింద్రాబాద్,
శ్రీ జ్యాకిరామ్, మాజీ ఎం. ఎల్. ఎ. కరీంనగర్,
శ్రీమతి సత్యవతి మహాదేవన్, విశాఖపట్నం,
శ్రీ శఠగోపాచారి, కార్యదర్శి, హరిజన సేవక్ సంఘం, కాకినాడ,
శ్రీ కె. అప్పారావు, దేవనచేరు, తూ. గో. జి.
శ్రీ బత్తుల వెంకటేశ్వరరావు. అడ్వకేటు, హైదరాబాదు,
శ్రీ ఎస్. బాలక్రిష్ణారెడ్డి, వాకాడు, నెల్లూరు జిల్లా,
శ్రీమతి రాజమ్మ, కర్నూలు,
శ్రీ టి. గజరాజు, ఖైరతాబాదు, హైదరాబాద్,
శ్రీ డాక్టరు అరమన్నయ్య, ఎం. డి. వాచ్. ఆర్ ఎం.పి. ఎడిటర్-ప్రజామొర వీక్లి, రాజంపేట, కడప జిల్లా,
శ్రీ ఐ. ఓబయ్య కంబదూర్, కల్యాణ్‌దుర్గ్, అనంతపురం జిల్లా,
శ్రీ వై. గంగాధరం,, కార్యదర్శి, జిల్లా హరిజన అభ్యుదయ సంఘ్, తిరుపతి,
శ్రీ అడివి హనుమంతరావు, కార్యదర్శి, గుంటూరు జిల్లా యాదవ సంఘ కమిటి,
శ్రీమతి ఎం. కమల, నల్గొండ,
శ్రీ జె. బాయన్న, అనంతపురం,
శ్రీ వి. వి. వెంకటరెడ్డి, పల్నాడు, గుంటూరు జిల్లా,
శ్రీమతి సామ్రాజ్యలక్ష్మి, హైదరాబాదు,
శ్రీ మేడూరి నాగేశ్వరరావు, చైర్మన్, జిల్లా పరిషత్, గుంటూరు.
శ్రీ డి. ఎన్. రెడ్డి, చైర్మన్, జిల్లా పరిషత్, కడప,
శ్రీ పి. జగపతిరావు, చైర్మన్, జిల్లా పరిషత్, మెదక్.

పై కమిటీ సభ్యుల సభ్యత్వ కాలపరిమితి ఉత్తర్వు జారీ అయిన తేదీ నుండి రెండు సంవత్సరాలు. సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు పై సంఘానికి అధ్యక్షులుగాను, సాంఘిక సంక్షేమ శాఖా డైరెక్టరు ఎక్స్ అఫీషియో కార్యదర్శిగాను వుంటారు.

## ఉద్యోగాలలో షెడ్యూలు కులాలకు రాయితీలు

ఉన్నతోద్యోగాలలో షెడ్యూలు కులాల, షెడ్యూలు తెగల ప్రాతినిధ్యాన్ని మెరుగుపరిచే ఉద్దేశంతో ప్రమోషన్లద్వారా భర్తీ చేసే ఉద్యోగాల విషయంలో ఆ కులాలవారికి మరికొన్ని రాయితీలు ఇవ్వడానికి కేంద్రమంత్రివర్గం మే 14న నిర్ణయించింది.

## హరిజనులకు ఇళ్ళ స్థలాల కేటాయింపు

రాష్ట్రంలో హరిజనులకు ఇళ్ళస్థలాలకు గాను రాష్ట్రప్రభుత్వం 60 లక్షల రూపాయలు కేటాయించింది.

## సుగాలీల సహకార సంఘం

మార్కాపురం తాలూకాలోని సుగాలి సకలార్థ సాధక సహకార సంఘాన్ని ఏజన్సీ అభివృద్ధి సంఘంగా గుర్తించి ప్రభుత్వం పది ఒంగోలుజాతి ఎద్దులను ఇచ్చింది

## జంట నగరాలలో హరిజన హాస్టల్స్‌కు పెద్దభవనం

జంటనగరాలలోవున్న హరిజనహాస్టల్సు న్నింటిని ఒకేచోట ఏర్పాటు చేయడానికి వీలుగా పెద్దభవనాన్ని నిర్మించేందుకుగాను సికిందరాబాద్‌లో విశాలమైన ప్రాంతాన్ని ప్రభుత్వం సేకరించింది అభవన నిర్మాణానికిరూ 7 లక్షలు కేటాయించ బడినవి.



రాష్ట్ర గవర్నరు శ్రీ ఖండూభాయ్‌దేశాయ్ సికింద్రాబాదులో హరిజన హాస్టలు సందర్శిస్తున్న దృశ్యం

# జాతీయం చేయబడిన పాఠ్యపుస్తకాలు

**1968 - 69** సంవత్సరానికి సంబంధించిన జాతీయం చేయబడిన పాఠ్య పుస్తకాలు విద్యాశాఖ అనుమతించిన ఏజంట్ల ద్వార అమ్మకానికి సిద్ధంగావున్నాయి పాఠ్య గ్రంథాలను (1) హైదరాబాదు (2) విజయవాడ (3) విశాఖపట్టణం (4) నెల్లూరు (5) కడపలలో పనిచేస్తున్న పాఠ్య గ్రంథాల ముద్ర ణాలయం తాలూకు అమ్మకపు విభాగాలద్వారా ఆయా ప్రాంతాలలోని ఏజంట్లకు సరఫరా చేయడం జరుగుతుంది.

1968—69 వ సంవత్సరం కొరకు నిర్ణయించిన జాతీయం చేసిన పాఠ్యపుస్తకాల జాబితా:

మొదటి తరగతి [1] తెలుగువాచకము—1; రెండవ తరగతి: [2] తెలుగువాచకము—2; మూడవ తరగతి [3] తెలుగువా చకము—3, [4] సామాన్య గణితము—3 [తెలుగుమీడియం] [5] సామాన్య గణితము—3 [ఇంగ్లీషు మీడియం], [6] సామాన్య గణితము — 3 [ఉరుదూ మీడియం] [7] ఇంగ్లీషు టీచర హాండ్ బుక్ మొదటి భాగం, 3 వ తరగతి [ఉపాధ్యాయుల కొరకు], రీజినల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీషు] [8] ఇంగ్లీషు టీచర్ల హాండ్‌బుక్, రెండవ భాగం, 3వ తరగతి [ఉపాధ్యాయులకొరకు, [రీజినల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీషు] నాలుగవతరగతి [9] తెలుగు వాచకము—4, [10] ఇంగ్లీషు వాచకము—4 [ఆర్ ఐ. ఇ].[11] ఇంగ్లీషు వర్క్‌బుక్ ——4[విద్యార్థుల కొరకు] [ఆర్.ఐ.ఇ], [12] ఇంగ్లీషు టీచర్ల హాండ్ బుక్— మొదటి భాగం 4వతరగతి [ఉపాధ్యాయుల కొరకు] [ఆర్.ఐ ఇ], [13] ఇంగ్లీషు టీచర్ల హాండ్‌బుక్— రెండవ భాగం, 4వ తరగతి [ఉపాధ్యాయుల కొరకు] [ఆర్.ఐ ఇ] [14] గణితశాస్త్రము—4[తెలుగు మీడియం].[15] గణిత శాస్త్రము—4[ఇంగ్లీషు మీడియం];[16] గణితశాస్త్రము - 4[ఉరుదూ మీడియం], [17] సామాన్యశాస్త్రము —4 [తెలుగు మీడియం] [18] సాంఘిక శాస్త్రము —4[తెలుగు మీడియం] [19] సాంఘిక శాస్త్రము—4 [ఇంగ్లీషు మీడియం], [క్రొత్తది] [20] సాంఘిక శాస్త్రము—4[ఉరుదూ మీడియం][21] ద్వితీయభాగం తెలుగు వాచకము— 4.

అయిదవ తరగతి : [22] తెలుగు వాచకము_5, [23] తెలుగు ఉపవాచకము_5, [24] ద్వితీయ భాష తెలుగు వాచకము_5 [25]ఇంగ్లీషు వాచకము—5, [26] ఇంగ్లీషు అనుబంధ వాచకము_5 [27] హిందీ భారతి_1 [ద్వితీయభాష 5వ తరగతి], [28] గణితశాస్త్రము_5 [తెలుగు మీడియం], [29] సామాన్యగణితము_5 [ఇంగ్లీషు మీడియం] [30] సామాన్యగణితము_5 [ఉరుదూ మీడియం], [31] సామాన్యశాస్త్రము_5 [తెలుగు మీడియం], [32] సాంఘిక శాస్త్రము_5 [తెలుగు మీడియం], [33] సాంఘిక శాస్త్రము_5 [ఇంగ్లీషు మీడియం] [క్రొత్తది], [34] సాంఘికశాస్త్రము_5 [ఉరుదూ మీడియం] [క్రొత్తది]

ఆరవ తరగతి : [35] తెలుగువాచకము_6, [36] తెలుగు ఉప వాచకము_6, [37] ద్వితీయ భాష తెలుగు వాచకము_6 [తెలుగు వాచకము_3], [38] ఇంగ్లీషువాచకము_6, [39] ఇంగ్లీషు అనుబంధ వాచకము_1, 6వ తరగతి, [40] ఇంగ్లీషు అనుబంధ వాచకము_2, 6వ తరగతి, [41] సంస్కృత వాచ కము_6, (42) హిందీ భారతి_2, (ద్వితీయ భాష) 6వ తరగతి (43) గణితశాస్త్రము_6 (తెలుగు మీడియం), (44) గణిత శాస్త్రము_6 (ఇంగ్లీషు మీడియం), (45) గణితశాస్త్రము_6

(ఉరుదూ మీడియం). (46) సామాన్యశాస్త్రము_6 (తెలుగు మీడియం) (47) సామాన్యశాస్త్రము (ఇంగ్లీషు మీడియం) క్రొత్తది (48) సాంఘికశాస్త్రము_6 (తెలుగు మీడియం). (49) సాంఘిక శాస్త్రము_6 (ఇంగ్లీషు మీడియం) (50) సాంఘిక శాస్త్రము_6 (ఉరుదూ మీడియం).

ఏడవ తరగతి: (51) తెలుగు వాచకము_7. (52) తెలుగు ఉపవాచకము_7. (53) ద్వితీయ భాష తెలుగు వాచకము (54) ఇంగ్లీషు వాచకము_7. (55) ఇంగ్లీషు మొదటి అనుబంధ వాచకము_7. (56) ఇంగ్లీషు రెండవ అనుబంధ వాచకము_7. (57) సంస్కృత వాచకము_7. (58) హిందీ భారతి_3 (ద్వితీయ భాష) 7వ తరగతికి (59) గణితశాస్త్రము_7 (తెలుగు మీడియం). (60) గణితశాస్త్రము_7 (ఇంగ్లీషు మీడియం) (61) గణితశాస్త్రము_7 (ఉరుదూ మీడియం). (62) సామాన్య శాస్త్రము_7 (తెలుగు మీడియం). (63) సామాన్యశాస్త్రము_7 (ఇంగ్లీషు మీడియం) (64) సాంఘిక శాస్త్రము_7 (తెలుగు మీడియం). (65) సాంఘిక శాస్త్రము_7 (ఇంగ్లీషు మీడియం). (66) సాంఘిక శాస్త్రము_7 (ఉరుదూ మీడియం).

ఎనిమిదవ తరగతి: (67) తెలుగు వాచకము_8. (68) తెలుగు ఉప వాచకము_1 (ప్రథమ భాష) 8వ తరగతి (విశ్వనాథ నాయకుడు). (69) తెలుగు ఉపవాచకము_2 (ప్రథమ భాష). (8వ తరగతి కథా మంజరి). (70) ద్వితీయ భాష తెలుగు వాచకం _ 8 ; [7 ] ద్వితీయభాష తెలుగు ఉపవాచకము _ 8 [72] ఇగ్లీంషువాచకము 8_; క్రొత్తది; [73]; ఇంగ్లీషు మొదటి అనుబంధవాచకము _ 8 [లాల్‌బహదూర్‌శాస్త్రి]; [74] ఇంగ్లీషు రెండవ అనుబంధవాచకము _ 8 [క్రొత్తది]; [75] సంస్కృత వాచకము _8; [76] హిందీ వాచకము_8 [ప్రథమభాష]; [77] హిందీసుధ _ [ప్రథమభాష] ఉపవాచకము _ 8; [78] హిందీ భారతి _ 4 [ద్వితీయభాష] 8వ తరగతి; [79] సామాన్య గణితము_8 [తెలుగు మీడియం]; [80] మిశ్రమ గణితము _ 8 [తెలుగు మీడియం] [క్రొత్తది]; [81] సామాన్య శాస్త్రము [జీవశాస్త్రము] _ 8 [తెలుగుమీడియం] [82] సామాన్యశాస్త్రము [భౌతిక శాస్త్రము] _ [తెలుగు మీడియం] [83] సాంఘిక శాస్త్రము _ 8 [తెలుగు మీడియం].

9 వ తరగతి: [84] తెలుగు వాచకము _9 [ప్రథమ భాష] [85] తెలుగు ఉపవాచకము___ 9 [ప్రథమభాష] అప్పాజీ మొదటి పుస్తకము ; [86] తెలుగు ఉపవాచకము 9 [ప్రథమ భాష] త్రివేణి, రెండవ పుస్తకము ; [87] ద్వితీయ భాష తెలుగు వాచకము _ 9; [88] ద్వితీయభాష తెలుగు ఉపవాచకము _ 9 [విశ్వభారతి]; [89] ఇంగ్లీషు వాచకము 9; [90] ఇంగ్లీషు మొదటి అనుబంధ వాచకము _ 9 [చిల్డ్రన్ ఆఫ్ ది న్యూఫారెస్ట్] [క్రొత్తది]; [91] ఇంగ్లీషు రెండవ అనుబంధ వాచకము _ 9; [92] సంస్కృత వాచకము _ 9; [93] హిందీ వాచకము _ 9 [ప్రథమ భాష]; [94] హిందీ ఉపవాచకము _ 9 [ప్రథమభాష] ఒకటవ పుస్తకము [దాదా నెహ్రూకి కహానీ]; [95] హిందీ ఉపవాచకము _ 9 [ప్రథమ భాష] రెండవ పుస్తకము ; [96] హిందీ భారతి_5 [ద్వితీయభాష] 9వ తరగతి ; [97] హిందీ సుమన్_9 [ద్వితీయభాష] ఉపవాచకము [క్రొత్తది] [98] సామాన్య గణితము 9 [తెలుగు మీడియం]; [99] మిశ్రమ గణితము _ 9 [తెలుగు మీడియం]; [100] సామాన్య శాస్త్రము [జీవశాస్త్రము] _ 9 [తెలుగు మీడియం] [క్రొత్తది]; [101] సామాన్య శాస్త్రము [భౌతిక శాస్త్రము] [తెలుగు మీడియం]; [102] సాంఘిక శాస్త్రము _ 9 [తెలుగు మీడియం]:

10 వ తరగతి: [103] హిందీవాచకము _ 10 [ప్రథమ భాష]; [104] సామాన్యగణితము _ 10 [తెలుగు మీడియం]; [105] మిశ్రమ గణితము _ 10 [తెలుగు మీడియం]: [106] సామాన్యశాస్త్రము [జీవశాస్త్రము] [తెలుగు మీడియం] ; [107] సామాన్య శాస్త్రము [భౌతిక శాస్త్రము] _10 [తెలుగు మీడియం]: [108] సాంఘిక శాస్త్రము _ 10 ; [109] ద్వితీయభాష తెలుగు వాచకము_ 10 [తెలుగు వాచకము_ 7]; [110] ఇంగ్లీషు మొదటి అనుబంధ వాచకము యస్. యస్. యల్. సి; హెచ్. యస్. సి. 10వ తరగతులకు [ట్రాంబ్రౌన్స్ స్కూల్ డేస్] ; [111] ఇంగ్లీషు రెండవ అనుబంధ వాచకము, యస్. యస్. యల్. సి., యచ్. యస్. సి, 10 వ తరగతులకు [సెలక్టెడ్ షార్టు స్టోరీస్] [యన్.టి బి.]; [112] తెలుగు ఉపవాచకము, యస్ యస్.యల్.సి, హెచ్. యస్. సి, 10 వ తరగతులకు [మహారాణి అహల్యాబాయి] టి ఎస్. యల్. సి [బేసిక్, నాన్ బేసిక్] పబ్లిక్ పరీక్ష 1970 కు నిర్ణయించిన పాఠ్య పుస్తకాలు [రెండు సంవత్సరాలకోర్సు 1968_70] [113] సెకండరీ గ్రేడ్ తెలుగు పాఠ్యపుస్తకము ; [114] సెకండరీ గ్రేడ్ ఉర్దూ పాఠ్యపుస్తకము 1970; [115] సెకండరీగ్రేడ్ ఇంగ్లీషు పాఠ్యపుస్తకము [యన్ టి.బి] టి. యస్. యల్. సి. పరీక్షకు; [116] ఎలిమెంటరీగ్రేడ్ తెలుగు పాఠ్య పుస్తకము, 1970 రెండేళ్ళకోర్సు [1968_70]; [117] ఎలిమెంటరీ గ్రేడ్ ఉర్దూ పాఠ్యపుస్తకము 1970 [రెండేళ్ళ కోర్సు] 1968_70; [118] తెలుగు పాఠ్య పుస్తకము [1969 వ సం॥పు 8 వ తరగతి పబ్లిక్ పరీక్షకు]: [119] ఉర్దూ పాఠ్యపుస్తకము 1969 వ సం॥పు 8 వ తరగతి పబ్లిక్ పరీక్షకు]

# నవభారత నిర్మాత
# బాలగంగాధర తిలక్



కొండా లక్ష్మణ్ బాపూజీ
(జనసంబంధ, శ్రామికమంత్రి)

తిలక్ ఎలాంటి వారో, ఆయన చేసిన సేవలూ త్యాగాలూ ఏమిటో, ఆయనకు మనం ఎంతగా రుణపడి వున్నామో—వీటిని గురించి ఈనాటి యువతీ యువకులకు తెలియదు. ఇలాంటి మహా పురుషుల జీవితాలు శ్రావ్యమైన సంగీతం వంటివి. ఈసంగీత నాదాలు, వారి వాణి వినిపించకుండా పోయిన చాలకాలం తరువాత కూడా మన చెవులలో మారు మ్రోగుతుంటాయి. గొప్ప వ్యక్తుల విషయంలో గతం, వర్తమానంలోకి ప్రవేశించి భవిష్యత్తులో భాగంగా రూపొందుతుంది. వారు మన మధ్య వున్నట్లు అనుభూతి పొందుతాము. కాబట్టి తరుచుగా మనం వారిని స్మరించుకుటాము. భారతీయులకు గర్వకారణమైన గతానికి చెందినవారు లోకమాన్య తిలక్.

లోకమాన్య బాలగంగాధరతిలక్, రాజకీయ గగనసీమలో దివాకరునివలె ప్రకాశించారు. "కేసరి' "మరాటా" పత్రికల సంపాదకులుగా తమ లేఖనీ ప్రతిభతో ఆయన ఎందరినో ప్రభావితులను చేశారు. ఆయన, మతధర్మాన్ని నిష్ఠగా పాటించేవారు. ఆయన వ్రాసిన గీతా భాష్యం గొప్ప మతగ్రంథంగా పరిగణించబడుతున్నది. అయితే భారత స్వాతంత్ర్య యోధుడుగా భారతదేశ రాజకీయరంగం జనకుడుగానే ఆయన సుప్రసిద్ధుడు. కాంగ్రెసు మహాసభలో గ్రేట్ బ్రిటన్ జాతీయ గీతాన్ని పాడడాన్ని ఆయన ప్రతిఘటించారు.

తీవ్రవాదులకు నాయకుడైన బాలగంగాధరతిలక్, మన సంస్కృతిని ప్రకాశింప జేసిన మహావ్యక్తులలో ఒకరు. రాజకీయ స్వాతంత్ర్యాన్ని ఆయన ఎంత గాఢంగా ప్రేమించారో సంస్కృత భాషనూ, భారతీయ తత్వశాస్త్రాన్ని కూడా అంతే గాఢంగా ప్రేమించారు.

"కేసరి" పత్రిక సంపాదకుడుగా తిలక్ ఖ్యాతిపొందారు. భారతదేశంలో ఆంగ్లేయుల పరిపాలనను వ్యతిరేకించే పత్రికగా బ్రిటిష్ ప్రభుత్వం దీనినిపరిగణించింది. తిలక్‌కు నాలుగు నెలలఖైదు శిక్ష విధించబడింది. ఆ తర్వాత పూనా హత్య కేసు సందర్భంలో యువకులను ప్రోత్సహించాడనే నేరంపై 18నెలలుజైలుశిక్ష అనుభవించారు. హింసాత్మక చర్యలను అనుసరించడానికి బెంగాలు యువకులను ప్రోత్సాహించాడనే నేరంపై 6 సంవత్సరాలు జైలుకు వెళ్ళారు. ఈ దమన నీతికి తిలక్, ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.

1879 వ సంవత్సరంలో పూనాలో న్యాయవాద వృత్తి ప్రారంభించిన తరువాత తిలక్ ప్రధానంగా సాంఘిక కార్యకర్తగానే వున్నప్పటికీ ఆయన ఎక్కువ సమయం యితర కార్యకలాపాలకు వినియోగించవలసి వస్తుండేది. విద్యాసంబంధమైన కార్యక్రమాలలోనూ, దీనజనుల సేవలోనూ ఆయన ఎక్కువగా పాల్గొనేవారు. 1898 వ సంవత్సరంలో మహారాష్ట్రలో ప్లేగువ్యాధి వ్యాపించినప్పుడు ఆయన సహాయ కార్యకలాపాలలో ప్రముఖ పాత్ర వహించారు.

దేశప్రజలకు మహోజ్జ్వలమైన తమ గతాన్ని గురించిన చైతన్యం కలిగించడానికి తిలక్ ప్రయత్నించారు. ఆయన శివాజీ ఉత్సవాన్ని ప్రారంభించారు. ఇదిక్రమేపీ జాతీయోత్సవంగా రూపొందింది.

తిలక్ కాంగ్రెసు కార్యకలాపాలలో ప్రముఖంగా పాల్గొన్నారు. కాని 1905 లో కాంగ్రెసు ఆయన అభిప్రాయాలతో ఏకీభవించలేకపోయింది. 1907 లో సూరత్ మహాసభ తరువాత ఆయన శ్రీమతి అనిబెసెంట్‌తో కలిసి హోంరూల్‌లీగ్‌ను స్థాపించారు. 1916 లో లక్నో మహాసభ సందర్భంలో తిలక్ తిరిగి కాంగ్రెసులో ప్రవేశించారు.

అమృత్‌సర్ దుర్ఘటన జరిగినప్పుడు తిలక్ ఇంగ్లాండులో వున్నారు. అచ్చటినుంచి తిరిగి వచ్చిన తరువాత ఆయన బ్రిటిష్ ప్రభుత్వచర్యలను ఖండించారు. స్వరాజ్యాన్ని దయాధర్మంగా కాక జన్మహక్కుగా సాధించాలని దేశప్రజలకు ఉద్బోధించారు.

తిలక్, 1919 జులై 31 వ తేదీని తమ 66 వ యేట పరమపదించారు. మతం, చరిత్రలను గురించి ఆయన వ్రాసిన గ్రంథాలు అమూల్యమైనవి. *



హెలెన్ కెల్లర్

హెలెన్ కెల్లర్ జూన్ 1న తన 87 వ ఏట మరణించింది. ఆమె బధిరాంధురాలు. శైశవంలోనే మాట పడిపోయింది. "ఈ మూడింటిలో ఏవొక్కటి సంభవించినా జీవితం దుఃఖభాజనమే అవుతుంది. కాగా ఈ మూడులోపాలను అధిగమించి ఆమె పరిపూర్ణమైన జీవితాన్ని అనుభవించింది. లోకోత్తరమైన కీర్తిగడించింది. ఆమె తన వ్యక్తిగత విజయం ఫలితాలను ప్రపంచానికి, లక్షలాది బధిరాంధ వికలాంగులకు అందివ్వడానికి తన యావజ్జీవితాన్ని ధార వోసింది. మానవుడు ఆత్మ శక్తిచేత జయించలేని, అధిగమించ లేని దురదృష్టంలేదు. హెలెన్‌కెల్లర్ ధీరోదాత్త చరిత్ర దుఃఖిత మానవ జ్యోతికి ఆశాజ్యోతి".

## శ్రీ శ్రీనివాస శిరోమణి

సుప్రసిద్ధ రచయిత శ్రీ శ్రీనివాస శిరోమణి (70) విజయవాడకు సమీపానగల రామవరప్పాడులో మే 24న కాలధర్మం చెందారు. వాల్మీకి రామాయణాన్ని శ్రీ శిరోమణి మధురమైన తెలుగు వచనంలో ఆంధ్రులకు అందించారు. కథల రచయితగా కూడ ఆయన ఖ్యాతి గాంచారు.

## శ్రీ బచ్చు జగన్నాథదాస్

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి శ్రీ బి. జగన్నాథదాస్(75) మే 30న మద్రాసులో మరణించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా చేరడానికిముందు ఆయన ఒరిస్సాహైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు. రెండవ వేతన సంఘం అధ్యక్షుడుగా కూడ ఆయన వున్నారు.

## శ్రీ కె. ఈశ్వరదత్




ప్రఖ్యాత పత్రికా రచయిత శ్రీ కె. ఈశ్వరదత్ (69) జూన్ 9వ తేదీన న్యూఢిల్లీలో మరణించారు. శ్రీ ఈశ్వరదత్ 1954–55 లో అలహాబాద్ పత్రిక 'లీడర్' ఛీఫ్ ఎడిటర్‌గా పని చేశారు. 'హిందూ' 'పయొనీర్' 'హిందూస్థాన్ టైమ్స్' పత్రికలలో అసిస్టెంట్ ఎడిటర్, 'లీడర్' రైటర్‌గా పనిచేశారు. అలహాబాద్ నుంచి 1934–37 మధ్యలో వెలువడిన "ట్వెంటీయత్ సెంచరీ" మాసపత్రికకు ఎడిటరుగా ఆయనపనిచేశారు. 'పీపుల్స్ వాయిస్" "ది వీకెండ్" "న్యూ ఇండియా" మున్నగు పత్రికలలోకూడా ఎడిటర్‌గా పని చేశారు. ప్రకాశం పంతులుగారి "స్వరాజ్య"లో ఆయనపనిచేశారు. సర్ తేజ్ బహదూర్ సప్రూ, సర్. సి. వై. చింతామణి, మీర్జా ఇస్మాయిల్‌గార్లతో శ్రీ ఈశ్వరదత్‌కు సన్నిహితసంబంధంవుంది.

ఆయన వ్రాసిన పెక్కు గ్రంథాలలో "స్ప్రీట్ ఆఫ్ ఇంక్" (స్వీయ జీవిత చరిత్ర) "స్పార్క్స్ ఎండ్ ఫ్యూమ్స్" "మై పోర్ట్రెయిట్ గేలరీ" ముఖ్యమైనవి. 'కాంగ్రెస్ సైక్లోపీడియా'కు ఎడిటర్‌గా ఆయన పని చేశారు. రెండవ సంపుటి ఇటీవలే వెలువడింది.

## రాబర్ట్ కెన్నడీ

మళ్ళీ మరొక కెన్నడీ, మళ్ళీమరొక అమెరికా స్వేచ్ఛాప్రియశీలి రాజకీయరంగంనుండి జీవనప్రాంగణంలోనే తుడిచివేయబడ్డాడు. ఒక విధంగా జాన్ కెన్నడీ తమ దేశచరిత్రలో తన విశిష్ట వ్యక్తిత్వాన్ని ముద్రవేసేవరకైనా ఆయనను బ్రతకనిచ్చారు. కాని రాబర్ట్ కెన్నడీ మరణం అది నిజంగా విషాదాంతం. పరమ దారుణం. అమెరికా రాజకీయ రంగంలో అత్యంత కీలకమైన పాత్ర వహించడానికి అడుగు పెడుతుండగా ఆయన ఒక హంతకుని తుపాకీ గుండుకు బలికావలసివచ్చింది. మన గమ్యం చికాగో అన్నవి ఆయన కడపటి పలుకులు. బహుశా చికాగోనుంచి రాబర్ట్ కెన్నడీ రాజకీయ విజయం, ఆయనను వైట్ హౌస్‌కు తీసుకుపోవడం జరిగివుండేది. అయితే తన సోదరుడు జాన్‌కెన్నడీ వలె తన ప్రతిభను ప్రదర్శించే అవకాశం రాబర్ట్ కెన్నడీకి లేకపోయిందికదా!

# నాల్గవ ప్లాను యోచన

వావిలాల గోపాలకృష్ణయ్య

పంచవర్ష ప్రణాళికతో భారతార్థికాభివృద్ధి సాధించదలంచి మూడు ప్రణాళికలు పూర్తిచేశారు. నాల్గవ ప్రణాళిక ప్రారంభించారు. కాని మూడు ప్రణాళికలలో అలసిపోయినట్లు నాల్గవ ప్రణాళికను వార్షిక ప్రణాళికల క్రింద అమలు జరపడం ప్రారంభించారు. ఈ నాడు మరల నాల్గవ ప్రణాళికకు సూచనభావన కల్పించుకున్నామంటూ 17-5-68న జాతీయాభివృద్ధిమండలికి ప్లానింగు కమీషను తన యోచనను సమర్పించారు.

నాల్గవ ప్రణాళిక ప్రథమంగా రూపురేఖలు దిద్దటం ప్రారంభించినపుడు 21,000 కోట్లు లేక 25,000 కోట్లు పెట్టుబడులా అంటూ చివరకు 22,500 కోట్లకు స్థిరపరచారు. అది అంతా పోయిందికదా, ఇపుడు మరల నాల్గవ ప్రణాళిక ఆలోచనలో విదేశీవనరుల మీద ఆధారపడకుండా స్వయంపోషకంగా కనీసం మూడవ సంవత్సరం నుండి అయినావుండాలెనని, విదేశాలకు మనం ఎగుమతులు పెంచడంలో ఈ స్వయంపోషకత్వం నిర్వహించవలెనని అన్నారు. వ్యవసాయంలో 5శాతం అభివృద్ధిని ఆదర్శంగా పెట్టుకోవాలెనన్నారు. అట్టి పరిశ్రమలలో 8-9 శాతం అభివృద్ధిని సాధించాలెనన్నారు.

ఇదివరకు ప్రతి ప్లానులోను సోషలిజం అనీ, సోషలిస్టు తరహా సమాజం అనే ఆదర్శాలు పలుకుతుండేవారు. ఈ ప్లానులో ఆదర్శం, గమ్యం రెండూ లేకుండా తయారు చేశారు. అసలు ఆదర్శం, గమ్యం యేదో తేల్చకపోతే యెట్లా అంటే నిజమే మరచి పోయాంగనుక తరువాత ముఖ్య మంత్రులందరితో ప్రత్యేక సమావేశం చేసి తేల్చుకుందాం అన్నారు ప్రధాని ఇందిరాగాంధి.

ఈ నాటివరకు జరిగిన మూడు ప్లానులలోనూ జరిగిన వ్యయం తిరిగి ప్లానులోకి పెట్టుబడులుగా రాకుండా వ్యక్తిగత లాభాలక్రింద, వ్యక్తిగత ధనం క్రింద పోవడంతో జాతీయసంపద పెరిగినట్లు కనిపించినా భారత దేశపు సంపద పెరిగినంతగా మానవుని జీవన ప్రమాణం పెరగలేదని చేసుకుంటున్న ఆత్మ విమర్శ ఆత్మలోనే వుండిపోతున్నది.

## మిశ్రమ ఆర్థికవిధానం

ప్రభుత్వ పరంగా పరిశ్రమలు పెరగాలెనని, బ్యాంకులు మున్నగు కీలక సంస్థలు ప్రభుత్వ పరమగుటకు జాతీయం చేయవలెనని ఆర్థికవేత్తలు, ప్రజానీకం పదేపదేఆదేపనిగా కోరుతుంటే ఈ నాల్గవ ప్రణాళిక భావనలో "మిశ్రమ ఆర్థిక విధానం" పెంపొందవలెనని, పెట్టుబడి పెట్టుటకు వచ్చే వ్యక్తులకు చాలా ప్రోత్సాహం కలిగించాలెనని, అది ప్రాథమికంగానేకాక ప్రాతిపదికగాకూడా వుండవలెనని నిర్ణయించారు.

పరిశ్రమల విధానం 1949లోని నిర్ణయం పోగా 1956 ప్రాతిపదిక - కేంద్ర తీర్మానం ప్రకారం ప్రాతిపదిక పరిశ్రమలు ప్రభుత్వ పరంగా వుండవలెననే వాదాన్ని సన్నగిల్లచేసి వ్యక్తులకు ఎక్కువ ప్రోత్సాహం కలిగించాలెనని అన్నారు. అంతే కాదు భారత దేశపు ఆర్థిక విధానం ముఖ్యంగా విదేశీ ద్రవ్య సముపార్జన గమ్యంగా నడవవలెనని ఆ విధంగా కేంద్రీకరణ జరగవలెనని అన్నారు.

పరిశ్రమలు దెబ్బతినే విధంగా పన్నుల విధానం వుండకూడదని అన్నారు. అంతే కాదు పరిశ్రమాభివృద్ధికి దోహదం కలిగించేందుకు ఇంకా రాయితీలు యివ్వడంద్వారా ప్రోత్సహించవలెనని, విదేశాలకు ఎగుమతులుచేసే పరిశ్రమలకు రిబేటు రూపంగా కూడా సౌకర్యాలు కలిగించాలెనని, గ్రామీణ జీవనంపై పన్నులు అధికంగా వేయవలెనని అన్నారు.

అధిక ధరలు అరికట్టేందుకు ప్రభుత్వపరంగా ఆహార ధాన్యాలు, జీవితావసర వస్తువులు వగైరాలపై ప్రభుత్వమే అధికారం కలిగివుండవలెనని ప్రజాభిప్రాయం, ప్రభుత్వమూ అభిలషిస్తుంటే-దానిని అవతలకు నెట్టి అవసరం అయినపుడు ధాన్యం అక్కడక్కడ కొంత కొని నిల్వవుంచడం మంచిదని ధరలు తగ్గించుటకు ఇదే మంచిదని సూచించారు. మూడవ ప్రణాళికలో మిగిలిపోయిన పరిశ్రమలు పూర్తి చేయడం అవసరం అని, అన్ని పరిశ్రమలు ఎగుమతుల పెంపుదలనే సాధించాలన్నారు.

## ఎగుమతులు

ఇంతవరకు నాల్గింట మూడు వంతులు సాంప్రదాయ సిద్ధమైన వస్తువులనే ఎగుమతి చేస్తున్నాం అని, అవి అంతర్జాతీయ ఒడుదుడుకులకు లోనవుతున్నవని, అందుచేత అంతర్జాతీయ అవసరాల్కు ఉపయోగపడే వ్యవసాయ ఉత్పత్తులు పెంచేందుకు పరిశోధనలు సాగించి అట్టి ఉత్పత్తులు పెంచవలెనని, వాటిపై ఎక్సైజు సుంకాలు వేయడంలో మినహాయింపులు చూపాలని, విదేశాలకు పంపే వాటిని ప్రభుత్వమే సరాసరి కొనడం, రిబేటు వగైరాలు యివ్వడం అవసరమని అన్నారు. విదేశాల నుండివచ్చే వస్తువులు వ్యక్తులద్వారా కూడా రానివ్వవచ్చునన్నారు. అవకాశం వుంటె మనమే ఇతర దేశాలలో పారిశ్రామిక కేంద్రాలు నెలకొల్పవలెనని, అప్పులకు మన వస్తువులు విదేశాలలో అమ్మకం చేయాలని, ఇనుపరాయి, ఇనుము, ఉక్కు ఇంజనీరింగు సామానులు, రసాయనాలు, ఔషధాలు, ప్లాస్టికు సామానులు, కృత్రిమ వస్త్రాలు, సిమెంటు, కాగితాలు, చాకలి సోడాల ఎగుమతులకు ప్రాధాన్యం యివ్వాలెనని అన్నారు

ఆహార ధాన్యాలలో 3 సంవత్సరాలలో స్వయం సమృద్ధం సాధించాలెనన్నారు (ఆస్ట్రేలియాలో ప్రధాని ఇందిరా గాంధీ మాట్లాడుతూ 5 సంవత్సరాలలో ఆహారధాన్యాల విషయంలో ఇండియా స్వయం సమృద్ధంకాగలదని మే 27న చెప్పారు). దిగుమతులు ఆపుకోవాలెనని అన్నారు. ఇది సంతోష విషయమే. మరి వ్యవసాయోత్పత్తులు కూడ విదేశాలకెగుమతుల లక్ష్యంతో సాగిస్తె, ఆహార స్వయంసమృద్ధి ఎల్లా సాగుతుంది. మనదేశ ఆర్థిక వ్యవస్థ యేమవుతుంది?

ఎగుమతులు సంవత్సరానికి 7 శాతానికి పెంచాలె నన్నారు. ఎగుమతుల మంత్రి శ్రీ దినేశ్ సింగు 4.5 శాతంకన్నా సాధ్యం కాదన్నారు. అంక్టాడ్ కాన్ఫరెన్సువారు 3 శాతం కన్నా ఇండియా ఎగుమతులు సాధ్యంకాదన్నారు. వారేమన్నా, ఎగుమతులు బాగా జరిగిన 1954–59 నుండి 1964–65 లలో 4.5 శాతమే జరిగింది. మొదటి ప్రణాళికలో నికరంగా రు 572 కోట్లు, 2వ ప్లానులో 1816 కోట్లు, 3వ ప్లానులో 2311 కోట్ల నికరంగా దిగుమతులు జరిగినవి. 3వ ప్లానులో 6058 కోట్లు ఎగుమతులు జరిగినవి. ఇంకా 4.5 శాతం యేనాడూ మించలేదు. అయినా 7 శాతం ఎగుమతులు చేయాలె నన్నారు.

రక్షణ, పరిపాలన ఈ రెంటిలో పొదుపు సాధించాలె నన్నారు. అంటూనే అది సాధ్యంకాదన్నారు. ఇపుడు చేస్తున్న పొదుపు 8 శాతం కావాలెనని, ప్లానింగువల్ల 5 శాతం పెంపుదల కావాలెనని ఈ పొదుపు 12 శాతం వరకు అందుకోవాలెనని అన్నారు. గ్రామసీమలలో పన్నులద్వారా, పొదుపుద్వారా ఆదాయం సాధించవలెనన్నారు. ప్రభుత్వ పరంగావున్న పరిశ్రమలల్లో లాభాలు ఎక్కువ చేసుకోవాలెనన్నారు. అవసరమైతే ప్రధాన పరిశ్రమలలోని ఉత్పత్తులపై ధరలైనా పెంచి ఆదాయం గడించాలెనన్నారు. ప్రైవేటు పరిశ్రమలు తమంత తాము అభివృద్ధి సాధించుకోవటానికి వారి దారిన వారిని వదలి వేయడం అవసరం అన్నారు.

వ్యవసాయేతర రంగాలలో ఉద్యోగావకాశాలు ఎక్కువ చేయవలసివుంటుందని, చిన్నపరిశ్రమలు, గ్రామీణ పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు పెంపొందించ వలెనన్నారు.

ఇరిగేషను ప్రాజెక్టులు ప్రారంభించ బోయేముందు సమగ్ర పరిశీలనచేసి నివేదికలు తయారు చేసుకోవాలెనని, 5వ ప్లానులో తీసుకోదలచిన ప్రాజెక్టుల నివేదికలు కూడా యిపుడే తయారు చేసుకోవాలెనన్నారు.

విద్యుచ్ఛక్తి ప్రాజెక్టులు గిల్డ్ విధానం అంతా కేంద్రం చేతులో వుంచుకొని సమన్వయం చేసుకో కలగేటట్లుండాలెనని, యీ నాటివలె సలహా సంఘాలుగా ఉండడం తగదని అన్నారు.

ౘదువు అవసరాలు గమనించి వాటిని నిర్వహించాలె నన్నారు. రాజ్యాంగంలో నిర్దేశించిన విధంగా ప్రాథమిక విద్య అమలు జరపాలెనన్నారు. ఈనాడు విద్యా విధానంలోవున్న దుబారా, స్తబ్ధత (Wastage, Stagnations) వెంటనే తొలగించాలెనన్నారు. పరిశోధన పెంచాలె. అందరికి ఉచితవిద్య నిర్వహించడం మంచిదే అయినా సాధ్యం కానట్లున్నది. కావున చెల్లించగల వారి నుండి రుసుము వసూలు చేయడం మంచిదన్నారు. గ్రామసీమల నుండి విద్యాశాలలకు విరాళాలు వసూలు చేయడం మంచిదన్నారు.

వైద్యశాలలో కూడ బయట నుండి వచ్చిపోయే రోగుల నుండి, పడకలలో వుండే రోగుల నుండి రోజుకింత అని రుసుము వసూలు చేయడం అవసరం అన్నారు. సంతాన నిరోధం మరింతగా సాగించాలెనన్నారు.

పట్టణాభివృద్ధి, వెనుకబడ్డ జాతుల కులాల అభివృద్ధికి శ్రద్ధ వహించవలెనన్నారు.

రాష్ట్రాలలో పరస్పరం ఉన్న హెచ్చుతగ్గుల తగ్గింపును యోచన చెప్పలేదు. అయితే పారిశ్రామిక విధానానికి అనువుగా ప్రాతిపదికలు వుంచాలెనన్నారు. ఇండియా అంతా ఒకటే అనే అభిప్రాయం అందరు కలిగివుండాలెనని ఉద్బోధించారు.

## ప్రాతి పదిక

ఇంత కష్టపడి తయారుచేసిన యీ ప్లాను భావనలో ప్రణాళిక ధ్యేయంగాని, ఫలితాల అంచనాగానీ ఈ 5వ శాతం వ్యవసాయాభివృద్ధి అనడానికి, 10 శాతం పరిశ్రమాభివృద్ధి అనడానికి గాని, 7 శాతం ఎగుమతులు పెంచాలెనంటానికి అవకాశాలు, ఆధారాలు అనుభవాలు జరిగిన 3 ప్రణాళికలలోనివి సమీకరించి అయినా చెప్పినవారు కారు. అవి చెప్పితే ఇది కాక పోతే, ఇది కదా అని ఆలోచించే అవకాశం వుండేది. ఏదో తోచిన శాతాలు చెప్పుతున్నారు. ఇందుకు ప్రాతిపదిక యేమిటి అని అక్కడి కక్కడే ముఖ్యమంత్రులు అడుగక తప్పలేదు.

ఈ సంవత్సరం కేంద్రబడ్జెట్టులో అందజేసిన ఆర్థిక సమీక్షలో లోగడవలె ప్లానుల అభివృద్ధి తెలియజేశారు. అందులో మొదటి ప్లానులో 1.6, 2వ ప్లానులో 1.8, 3వ ప్లానులో 0.4 శాతంగా వారికాభివృద్ధి లభించిందని చెప్పారు. అందుకు అయిన వ్యయం మొదటి ప్లానులో 5సంవత్సరాలకు రు.4800, 2వ ప్లానులో 8000లు మూడవ ప్లానులో 12000. అంత వ్యయంపై ఆ విధంగా వారికాదాయం వచ్చిందనితేలింది. మరి వ్యవసాయంలో 5 శాతం పరిశ్రమలలో 10 శాతం, ఎగుమతులలో 7 శాతం పెరగవలెనని ఆశించినప్పుడు దానికెంత వ్యయం అవుతుంది. అందుకు వున్న వనరులు యేయే విధంగా యెంతంత వస్తుంది అని వివరాలు ఇవ్వక ఏదో భావన కలిగిస్తే అది ప్లానింగు అవుతుందా.

ఇది వ్యాసంగా వుండే గాని ప్లానుగా కనిపించడం లేదు. ప్లాను ఇతరులు అంగీకరించుతారా లేదా అనేది కాకుండా తమకున్న సిర నిర్ణయాలు అంకెలలో, వనరులలో ఆధారలలో అనుభవాలలో ఏఏ రంగానికి ఏ వ్యవస్థకు యెంత పెడితే బాగుంటుందో యోచన చేయనే లేదు. యోచన లేని యోజన (ప్లాను) అనవలసి వస్తుంది. ఆ మాట అనడానికి వీలు లేదు. వ్యక్తిగత పెట్టుబడుల నుండి కేంద్రానికి వచ్చే పన్నుల ఆలోచనలు లేకుండా, గ్రామీణ ప్రజలపై

(తరువాయి 54 వ పుటలో)

## జరిగిన కథ

తెల్లవారితే సూర్యం పట్నం వెళ్ళిపోతాడు. సత్యం షికారు కెళ్ళాడు. సూర్యం, సరళ ఏకాంతంగా కలుసుకొని ఒకరికొకరు మనసులు విప్పుకొని మాట్లాడుకొనేందుకు అవకాశం కలిగింది, సరళ తన్నే ప్రేమిస్తున్నదని గ్రహించిన సూర్యం ఈ విషయాన్ని తాను పట్నం వెళ్ళిన తర్వాత అన్న సత్యంతో సరళనే చెప్ప మంటాడు. ఇంత దారుణంగా ప్రవర్తించడానికి సరళకు మనస్కరించలేదు. తెల్లవారి వెళ్ళబోయే ముందు సరళ ముమ్మాటికి తన్నే ప్రేమిస్తుందని రూఢి చేసుకొన్న సూర్యం, సరళను దగ్గరకు తీసుకోబోగా, ఆమె తప్పించుకొని ఎదురుగా వస్తున్న సత్యంతో ఢీ కొట్టుకొని పడిపోయింది. సత్యం రాక సరళ, సూర్యంలకు గాభరా కలిగించింది. త్వరగా తెములు రైలు టైం అవుతుంది— అని అంటూ సత్యం తమ్ముడిని హెచ్చరించాడు.

# తిరస్కృతి

—వాసిరెడ్డి సీతాదేవి

## 6

సూర్యం మస్తిష్కం గత స్మృతుల తాలుకు ఆలోచనలతో చెదల పుట్టలా వుంది. హృదయంలో ఏదోభావం పుట్టలో పాములా కదిలి కదిలి అశాంతిని రేకెత్తిస్తుంది. సూర్యభగవానుడు వెళుతూ వెళుతూ లోకంకేసి జాలిగాచూశాడు.'అయ్యో నేను వెళ్ళిపోతున్నాను మరి మీ గతి ఏంకాను?' అని బాధతో ఎర్రబడిన ముఖంతో చివరి సారిగా చూశాడు. వెళ్లలేక వెళ్లలేక వెళ్ళుతున్న సూర్యుణ్ణి చూస్తూ "ఏం? ఫర్వాలేదు. నేనున్నానులే! నువ్వు వెళ్ళు!" అంది అప్పుడే పదహారు ఏళ్ళ పడుచుపిల్ల చేత వెలిగించబడిన ఆముదపు దీపం గూట్లో నుంచి తొంగిచూస్తూ. సూర్యుడు ముఖం కందగడ్డలా చేసుకొని గబుక్కున జారిపోయాడు ఆ అవమానాన్ని ఎదుర్కొనే ధైర్యం లేనట్లు.

కనుచీకటి పడుతుండగా బండి ఊళ్లో ప్రవేశించింది.

ఆనాడు సరళ తనకు మాట ఇచ్చింది. వివాహంప్రస్తావన రాగానే తనకు ఉత్తరం రాస్తానంది. కాని రాయలేదు. అంటే ఈ వివాహం సరళకు ఇష్టం అయ్యేవుండాలి. అందుకే క్షణ క్షణం ఆడవాళ్ల చిత్తములు మారుతూ వుంటాయన్నాడు ఓ మహాను భావుడు. కాని ఇందులో తన తప్పు మాత్రంలేదా? ఈ నాలుగు సంవత్సరాలగా ఒక సారికూడా ఇంటికి రాలేదు. శెలవుల్లో కూడా ఏదో వంకబెట్టి స్నేహితులతో కాలక్షేపం చేస్తూ వూళ్లు తిరిగాడు. ఈ నాలుగు సంవత్సరాల్లో ఏనాడూ తనకు 'సరళ లేకుండా తను బ్రతుకలేదు' అని అనిపించలేదు. తన క్లాసుమేట్ కల్పన అంటే పడి చచ్చేవాడు. కాని అదేం చిత్రమో! అన్నయ్య వివాహం నిశ్చయం అయిందన్నప్పటి నుంచే సరళ తనకు కావాలి అనే బలీయమైన కోరిక బయలుదేరింది. సరళను అన్నయ్య భార్యగా వూహించుకుంటున్నప్పుడు తనలో అశాంతి బయలు దేరుతుంది. అది కేవలం అన్నయ్య మీద ఈర్ష్య వల్లనా, లేక తనకు సరళమీద వున్న ప్రేమవల్లా అనే సందేహం తనను పీడిస్తూనేవుంది. కాని సరైన సమాధానం తనకు దొరకలేదు. ఛ! అన్నయ్య అంటే తనకు ఈర్ష్య ఏమిటి? అన్నయ్య అంటే తనకు ఎంతో గౌరవం పూజ్య భావం వుంది. సరళను తను ప్రేమిస్తున్నాడు. సరళ లేకుండా తను బ్రతుకలేడు. కాని అంతా మించి పోయింది, కాదు మించి పోలేదు. అన్నయ్యే ఈ సమస్యను పరిష్కరించాలి. తను అన్నయ్యతో మాట్లాడాలి. లోకం తనను స్వార్థపరుడు అన వచ్చు. కాని ఈ జీవితం దేనికోసం? ఆనందం అనుభవించడం కోసం. తన వస్తువు ఇతరుల దవుతూవుంటే చూస్తూ కూర్చునే మానవుడు పిరికిపంద, పిరికివాడంటే తనకు అసహ్యం. అంత కంటే స్వార్థపరుడే వెయ్యి రెట్లు గొప్పవాడు.

బండి మహాలక్ష్మమ్మ చెట్టు దగ్గరగా వచ్చింది. చెట్టు అరుగుమీద కూర్చొని కొందరు పెద్దలు కబుర్లు చెప్పుకుంటున్నారు. అందరి కళ్లు బండివైపు తిరిగాయి కుతూహలంతో.

"ఒరే రంగన్నా! ఎవరింటికిరా బండీ?" ప్రశ్నించాడు మునసబు.

"చంద్రయ్య బాబుగారింటికండీ! ఆరి చిన్నబ్బాయిగోరు వచ్చారు". అన్నాడు రంగన్న ఉల్లాసంగా ఎద్దును అదిలిస్తూ.

"ఏమిటీ? చంద్రయ్య చిన్న కొడుకా? డాక్టరు చదివే వాడేనా?" అంటూ పై పంచె దులుపుకుంటూ లేచాడు పిచ్చయ్య.

"ఏవయ్యోయ్ డాక్టరూ! బండి దిగవోయ్. నిన్ను చూసి ఎంతకాలమయిందో! ఆపరా బండి!" అన్నాడు మునసబు.

బండి ఆగింది. సూర్యానికి పల్లె సీమల ఆప్యాయతా, పలకరింపూ మొరటుతనంగా తోచి చిరాకు వేసింది. కాని బండి దిగక తప్పలేదు. సూర్యం బండి దిగి అందరికీ వినయంగా నమస్కరించాడు.

"ఏమిరోయ్! భద్రయ్యమామ అంటూ నా వొళ్లో ఆడుకున్ననాడివి నాకే నమస్కరిస్తున్నావ్?" అన్నాడు భద్రయ్య సూర్యం ఏదో తీరని అవమానం చేసినట్టు బాధపడుతూ. సూర్యం మనస్సు చివుక్కుమంది. ఏమనాలో తోచక దిక్కులు చూశాడు, పల్లె వాతావరణం అలవాటు తప్పిన సూర్యం.

"బస్తీలో చదివేపిల్లకాయలకు ఇదో ఫాషన్‌లే. అందులో తప్పేంలేదు." అన్నాడు అప్పుడప్పుడు బస్తీకి వెళ్ళి వస్తూ వుండే మునసబు, వాళ్ళిద్దరకూ తెలియని విషయాలు కొన్ని తనకు తెలిసినట్లు తెలియపరుస్తూ.

సూర్యానికి వళ్ళు మండింది. "నమస్కరించటం ఫాషన్ కాదండీ! గౌరవాన్ని తెలియ జేయటం!" అన్నాడు సూర్యం విసురుగా. సూర్యం స్వరంలోని తీవ్రతకు ముగ్గురు ఓ క్షణం తెల్లబోయి చూశారు. పెద్దంతరం చిన్నంతరం లేకుండా ఎంత గట్టిగా మాట్లాడుతున్నాడూ! అనుకున్నాడు భద్రయ్య.

"నువ్వెప్పుడు పెడతావోయ్ పప్పన్నం?" అన్నాడు పిచ్చయ్య విషయాన్ని మారుస్తూ.

"వస్తానండీ!" అంటూ వెళ్ళి బండి ఎక్కుతున్న సూర్యాన్ని వింతగా చూశారు ఆ పెద్ద మనుషులు ముగ్గురూ.

"చంద్రయ్య కొడుక్కి ఎంత గర్వం వచ్చిందీ? అడిగిన మాటకు జవాబన్నా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వెళ్ళి బండిలో కూర్చున్నాడు. మునసబుగారి అబ్బాయి చదవటం లేదూ పట్నంలో, ఎంత అణకువగా జవాబిస్తాడు పలకరిస్తే?' అన్నాడు భద్రయ్య పిచ్చయ్యవైపు ఓరగా చూస్తూ. ఆ మాటలు సూర్యాన్ని నిందించటానికి కాక, తనను ఉడికించటానికే అన్నట్లు, ఆవలిస్తే పేగులు లెక్క పెట్టగలిగే పిచ్చయ్యకు అర్థంకాక పోలేదు.

"బస్తీల్లో పెద్ద పెద్ద చదువులు చదివే కుర్రాళ్లు మనతో ఏం మాటాడతారు లెస్తూ?" అన్నాడు పిచ్చయ్య భద్రయ్య తన వైపు చూసినట్లే చూస్తూ.

"కాబోయే అల్లుడనా సమర్థిస్తున్నావ్?" అన్నాడు మునసబు ముసి ముసిగా నవ్వుతూ.

"కాబోయ్యే అల్లుడని ఈయనగారి అభిప్రాయం. ఆ మాట వాళ్ళుకూడా అనుకోవద్దూ!" వ్యంగ్యంగా అన్నాడు భద్రయ్య.

"నా కూతుర్ని చేసుకున్నా చేసుకోకపోయినా నీ కూతుర్ని మాత్రం చేసుకోడు. గుర్తుంచుకో" అన్నాడు కోపంగా పిచ్చయ్య.

"అవున్లే నీకున్న లప్ప నాకులేదుగా? నీ కూతురికంటె నా కూతురే చక్కంది. అది గుర్తుంచుకో!" అన్నాడు భద్రయ్య అంత కోపంగానూ.

"అందమెందుకేం కోసుకుతింటానికా? నా కూతురి బుద్ధి బంగారం బుద్ధి"

"అంటే నా కూతురి బుద్ధిలో లోపం ఏదయినా చూశావా?" అన్నాడు భద్రయ్య పిచ్చయ్య పైపైకి వస్తూ.

"ఊరుకోండయ్యా వెధవగొడవా మీరూను? అసలు విషయం వదిలేసి అనవసరంగా మీరిద్దరూ పోట్లాడుకుంటారేమిటి? చంద్రయ్య చిన్నకొడుకు ఎవర్నో బెంగాలీ అమ్మాయిని ప్రేమించాడంటగా?" మునసబు విషయం మార్చటానికి కావాలనే కల్పిత కథ చెప్పాడు. భద్రయ్య, పిచ్చయ్య, ఇద్దరూ ఆశ్చర్యంగా మునసబు ముఖంలోకి చూస్తూ నిలబడిపోయారు.

ఇల్లు అల్లంత దూరంలో ఉండగానే వీధి వాకిలి నుంచి పెట్రొమాక్సు వెలుగు ప్రసరించటం కనిపించింది సూర్యానికి, ఆ వెలుగు సూర్యం హృదయంలో చీకట్లను పరచింది. బండి వాకిట్లోకి వచ్చి ఆగింది. పందిరికింద ఆడుకుంటున్న బంధువుల పిల్లలు బండి మోత విని బిల బిల లాడుతూ వచ్చి చుట్టూ మూగారు. పందిరంతా అలికి ముగ్గులుపెట్టి ఉంది. చంద్రయ్య పందిరి స్తంభాలకు కట్టివున్న కొబ్బరి ఆకుల్ని సర్దుతున్నాడు. సున్నం కొట్టి, లక్కలువేసిన ఇల్లు పెట్రొమాక్స్ వెలుతుర్లో మెరిసిపోతూవుంది. ఇల్లంతా పెళ్ళి కళతో శోభాయమానంగా వుంది. చంద్రయ్య బండి ఆగిన శబ్దం విని గబ గబా వాకిట్లోకి వచ్చాడు. సూర్యాన్ని చూసి గిర్రున తిరిగి వెళ్ళి మళ్లీ తన పనిలో నిమగ్నమయ్యాడు. తండ్రికి తన మీద కోపంగా వున్నదని తెలుసుకున్నాడు సూర్యం. సూట్‌కేసు అందుకుని రంగన్న లోపలకు వెళ్ళాడు. ఆ వెనకే సూర్యం నడిచాడు. కొడుకుని చూసిన శాంతమ్మ ముఖం సంతోషంతో చాటంత అయింది. తలవంచుకొని పెట్రొమాక్స్ లైటుకు గాలి కొడుతున్న సత్యం తలెత్తి చూశాడు. పెదవుల మీద చిరునవ్వు లాస్యం చేసింది.

"ఇంత త్వరగా రాకపోతేనేం? ఎల్లుండి సాయంత్రం వస్తే సరిపోయేదిగా?" అన్నాడు చంద్రయ్య చిరుకోపంతో.

"ఊరుకో నాన్నా! వచ్చీరాకముందే తమ్ముణ్ణి చిన్నబుచ్చుతావేం! రారా తమ్ముడూ! ప్రయాణం సౌఖ్యంగా వుందా?" అన్నాడు సత్యం ఆప్యాయంగా.

"రారా నాయనా! ఆమనిషి తీరే అంత! నీకు తెలియంది మాత్రం ఏముంది!" తల్లి కొడుక్కి ఎదురు వస్తూ అంది.

"నేను మాత్రం ఇప్పుడు వాణ్ణి ఏమన్నాను గనక? ఇంటి బిడ్డగదా కొంచెం ముందుగా వస్తేబాగుండేది అన్నాను" అన్నాడు చంద్రయ్య సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్లు.

సూర్యం అన్నీ వినీ విననట్లే లోపలకునడిచాడు. ఓక్షణం అన్ని వైపులా పరికించాడు. మధువర్కాలలో సత్యం ఎంతో హుందాగా, అందంగా కనిపించాడు. 'అన్నయ్య చాలా చక్కని వాడు. ఆ ఒక్కలోపం లేకపోతే...'

మెల్లగా యింట్లో కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్న ఆడవాళ్లు సూర్యాన్ని చూసి గబుక్కున లేచి నిల్చున్నారు. సూర్యం ఉలిక్కి పడి వెనక్కు వచ్చేశాడు. తల్లి సూర్యాన్ని వెనక వాకిలి నుంచి ఇంట్లోకి తీసుకెళ్లింది. ఇల్లంతా సూర్యం మనస్సులాగే అలజడిగా వుంది.

సూర్యం స్నానం చేసి వచ్చేప్పటికి ఆడవారంతా మెల్లా ఇంట్లోనూ, మగవారంతా సావిట్లోనూ భోజనాలకు కూర్చున్నారు

"రారా తమ్ముడూ! నువ్వుకూడా అందరితోపాటు కూర్చొని భోజనం చేద్దువుగాని" అంటూ వచ్చాడు సత్యం తమ్ముడి దగ్గిరకు.

'కొంచెం ఉండి భోజనంచేస్తాలే' అన్నాడు సూర్యం లాల్చీ తొడుక్కుంటూ.

"అయితే! అందరూ వెళ్ళాక మనిద్దరం కలిసి కూర్చుందాంలే "అంటూ బయటకు వెళ్లాడు సత్యం. అతన్ని చూస్తూ నిలబడ్డాడు సూర్యం. దీర్ఘంగా నిట్టూర్చాడు.

యాథాలాపంగానే దేముడి గది గడపలో కాలుపెట్టిన సూర్యం మంత్రించినట్లు నిలబడిపోయాడు.

సరళను ఆరోజే పెళ్లికూతుర్ని చేశారు. ముగ్ధమోహనంగా వున్న ఆరూపాన్ని కన్నార్పకుండా చూస్తూ నిలబడ్డాడు సూర్యం. చుట్టూకూర్చున్న స్నేహితురాండ్రు ఏదో అంటున్నారు. సిగ్గుతో గులాబి రంగును పులుముకున్న ఆ నున్నని చెక్కిళ్లు ఆమె కట్టుకున్న లేత గులాబిరంగు బెనారస్ సిల్కు చీరను సవాలు చేస్తున్నాయి. ఆమె ముసి ముసి నవ్వులు వెదజల్లే కాంతి ముందు ఆమె తలలోని బొడ్డుమల్లెల మాల వెల వెల బోతూవుంది. మహాశిల్పి దీక్షతో చెక్కిన పాలరాతి విగ్రహంలా వున్న ఆసౌందర్యమూర్తిని మైమరచి చూస్తూ నిలబడి పోయాడు. స్థాణువులా నిలబడి పోయిన యువకుణ్ణి చూసిన సరళ స్నేహితురాళ్లు తుర్రున పారిపోయారు. సరళ తలెత్తి చూసింది. ఒక్కనిముషం బెదిరిపోయింది. అంతలోనే సూర్యాని గుర్తించి కళ్ళు పెద్దివి చేసుకొని చూడసాగింది.

సూర్యం గదిలోకి వచ్చాడు. సరళదగ్గిరగా వచ్చి నిల్చాడు. సరళ తడబాటు చెందింది. ఆమె కళ్లలోకి లోతుగా, తిరస్కారంగా చూశాడు. ఆ చూపుల్ని ఎదుర్కోలేని సరళ తన చూపుల్ని దాచేసుకుంది. చిన్నబావ! సంతోషం, దుఃఖం మిశ్రితమైన ఏదో అనిర్వచనీయమైన అనుభూతి ఆమె హృదయాన్నిలోబరుచుకుంది. బరువైన రెప్పల్ని ఎత్తి ఓసారి చూసింది. ఆరెప్పల చాటున దాగివున్న చెమ్మను సూర్యం చూడలేదు.

"సరళ...... కాదు .... ...వదిన గారూ!"

సరళ ఉలిక్కి పడింది! సూర్యం స్వరంలోని వ్యంగ్యం ఆమె గుండెలో కలుక్కున గుచ్చుకుంది. క్షమించమన్నట్లు కళ్లతోనే ప్రాధేయపడింది,

'' నీ సుఖ స్వప్నాన్ని చెరిపి వేయలేదు కదా!'' ప్రశ్నించాడు సూర్యం.

"బావా!" అంది సరళ ఆర్ద్రత నిండిన స్వరంతో.

ఆస్వరంలోని ఆర్ద్రతకూ, ఆప్యాయతకూ ద్రవించి పోయింది సూర్యం హృదయంలోని కాఠిన్యం.

"సరళా! ఎందుకిలా చేశావు? నాకు ఉత్తరం ఎందుకు రాయలేదు. నిజంగా నీకు అన్నయ్యఅంటేనే యిష్టం అయితే, నాకు ఆశలు చూపించి ఎందుకు నాలో కోర్కెలు రేకెత్తించావు? ఓ సుందరమైన జగత్తును నా చుట్టూ నిర్మించి, నన్ను మురిపించి ఎందుకు అక్కడ నుంచి నన్ను నిర్దయగా పాతాళంలోకి తోసేశావు;" ఆవేశంగా అన్నాడు సూర్యం. సరళ గాభరాగా నాలుగు వైపులా చూసింది.

"భయపడుతున్నావా! ఎవరూ వినటంలేదులే! అన్నయ్య అదృష్టవంతుడు!" నిట్టూర్చాడు సూర్యం.

" బావా! " గద్గదంతో అంది. ముందుకు మాటలు పెగల్లేదు. గొంతులోనే ఉండచుట్టుకొని పోయాయి.

"నీ ఇష్టంతోనే ఈ వివాహం జరుగుతుందా! "

సరళ మాట్లాడలేదు,

"చెప్పు సరళా! నిజంచెప్పు! నీకు మనస్ఫూర్తిగా అన్నయ్యను వివాహం ఆడటం ఇష్టమేగదూ! "

"నా ఇష్టాయిష్టాలకు విలువ ఏముంది. అసలు నన్ను ఎవరైనా అడిగారు కనుకనా చెప్పటానికి! " సరళ కళ్లలో నీరు తిరిగింది.

"మరి నాకు జాబు రాయలేదేం! "

సరళ జవాబివ్వలేదు,

"ఇప్పుడైనా మించి పోయిందేమీ లేదు. చెప్పు నీకు ఇష్టం లేకపోతే అమ్మతోచెప్పెయ్! నేను అన్నయ్యతో చెప్పేస్తాను."

సరళ బెదురు చూపులు చూసింది. అజ్ఞాతభయంతో ఆమె శరీరం బిగుసుకు పోసాగింది.

"ఇప్పుడు ధైర్యం చెయ్యకపోతే జీవితం అంతా ఏడుస్తావు! ఆ తరవాత నీ ఇష్టం! మధ్యలో ఒకరోజు మాత్రమే ఉంది ఆలోచించుకో! " ఎవరో వస్తున్నట్లు అలికిడై సూర్యం అక్కడనుంచి గబగబా వెళ్ళిపోయాడు.

సరళ ప్రశాంత మానస సరోవరంలోకి ఓరాయి విసిరి వెళ్ళిపోయాడు సూర్యం. హృదయంలో కల్లోలం బయలు దేరింది.

సరళ అశాంతిగా లేచి నిల్చుంది. ఎక్కడకు వెళుతుంది; తను పెళ్లికూతురు! ఇంటినిండా జనం. మళ్లీ అక్కడే కూలబడింది. రకరకాల ఆలోచనలతో బుర్ర బద్దలైపోతూంది.

## 7

భోజనాలయాక బంధువులంతా వారికోసం ప్రత్యేకించి యేర్పాటు చేయబడిన బసలకు వెళ్ళారు.

సూర్యం, సత్యంతోపాటు భోజనానికి కూర్చున్నాడు. సత్యం ఉత్సాహంగా తమ్ముణ్ణి ఏమేమో అడుగుతున్నాడు. అన్నింటికి అన్యమనస్కంగా అవును కాదు అంటూ జవాబిస్తున్నాడు సూర్యం. తమ్ముడు ఎందు కంత పరధ్యాన్నంగా వున్నాడో అర్థంకాలేదు సత్యానికి. ఎక్కువ మాట్లడకుండ భోజనం చేసి లేచి వెళ్ళిపోయాడు సత్యం. తమ్ముడు ఏమిటి రానురాను ఇలా తయారవు తున్నాడు? పట్నవాస జీవితము, పెద్దచదువులు మనుషుల్లోని మమకారాల్ని చంపి వేయడం లేదుగదా! ప్రేమే మనిషిని మనిషిగా చేస్తుంది. భయం మనిషిని సంఘ జీవిగా చేస్తుంది. అహంకారం మనుషులచేత సామ్రాజ్యాలను నిర్మింప చేస్తుంది. ప్రస్తుత నాగరికత చివరి రెండు గుణాలను పటిష్టం చేస్తుంది. కాని రానురాను మనిషిలోని మమకారం చచ్చిపోతుంది. చివరకు మనిషిలోని మానవత్వం మిగలదేమో! మనిషి కూడా మరో పశువులా జీవిస్తాడేమో! సత్యం అశాంతిగా తన గదిలో తిరుగుతున్నాడు.

సూర్యం భోజనం అయిందనిపించి తన మంచంమీద నడుం వాల్చాడు. ప్రయాణ బడలిక వల్ల వెంటనే నిద్రపోయాడు.

సరళ తలనొప్పిగా వుందని అన్నం తినకుండా పడుకుంది. శాంతమ్మ అన్ని పనులు ముగించుకొని పదకొండు ఆ ప్రాంతంలో సరళ గదిలోకి వచ్చింది. చంద్రయ్య విడిది ఇళ్ళలో వున్న బంధువులకు అన్ని సౌకర్యాలు లభించాయో లేదోనని చూట్టనికి వెళ్ళాడు.

"సరళా! లేమ్మా ! ఈ పాలన్నా త్రాగి పడుకో!" అంటు సరళను తట్టిలేపింది శాంతమ్మ.

సరళ విసురుగా లేచి కూర్చుంది. కళ్ళు ఎర్రగా వాచి వున్నాయి. చెక్కిళ్ల మీద ఎండిన కన్నీటి చారలు స్పష్టంగా చెబుతున్నాయి ఆమె అంతవరకూ ఏడుస్తూవున్నట్లు. శాంతమ్మ సరళ ముఖంలోకి ఓ క్షణం చూసింది.

"ఏమిటమ్మా! ఏడుస్తున్నావా? అమ్మ గుర్తొచ్చిందా?" అంది ఆప్యాయంగా తలనిమురుతూ.

శాంతమ్మ అనునయ వచనాలకు నిండుకుండ బ్రద్దలయినట్లు సరళ ఒక్క సారిగా బావురుమంది. వెక్కి వెక్కి ఏడుస్తున్న సరళను ఆప్యాయంగా అక్కున చేర్చుకుంది శాంతమ్మ.

"ఊరుకో తల్లీ? పెళ్ళికూతురివి. ఏడవడం శుభంకాదు." అంది శాంతమ్మ సరళ కన్నీటిని తుడుస్తూ.

" అత్తయ్యా !" వెక్కిళ్ళమధ్యలోనుంచి వచ్చిన ఆ పిలుపు అతి దీనంగావుంది.

" ఏంతల్లీ ?"

" నాకీపెళ్ళి ఇష్టంలేదు. నేనుచేసుకోను." దుఃఖంలోనే దృఢత్వం గోచరించింది.

శాంతమ్మకు ఆమాటలకు అర్థం వెంటనే అర్థంకాలేదు. అర్థం అయాక ఆలోచించే శక్తిని కోల్పోయింది. కొయ్యబారి పోయి సరళ ముఖంలోకిచూస్తూ ఉండిపోయింది శాంతమ్మ ముఖం నలుపురంగును పులుముకుంది. అప్పుడే ప్రాణంపోయిన శరీరంలా బిగుసుకొనివున్న శాంతమ్మనుచూసి సరళ భయపడి పోయింది.

" అత్తయ్యా! అత్తయ్యా !" అంటూ కుదుపుతూ ఆదుర్దాగా పిల్చింది.

క్రమంగా ఘనీభవించిన ఆమెలోని చైతన్యం ద్రవించ సాగింది. వెర్రిచూపులు చూస్తున్నది. తను విన్నది ఏమిటి ? ఆమాటలంది సరళేనా ? చిన్నప్పటినుంచి సరళను సత్యంభార్యగానే చూసిన శాంతమ్మకు మతిపోయినట్లయింది.

" అత్తయ్యా !" ఆత్రంగా కదిపింది సరళ.

" సరళా ! నువ్వు నిజంగా అలా అన్నావా లేక నాకు ఏమైనా భ్రమకలిగిందా ?" కలలో మాట్లాడుతున్నట్లు గొణిగింది. శాంతమ్మ.

సరళ ఓ నిముషం మౌనంగా తలవంచుకొని ఆలోచించ సాగింది. అంతలోనే ఆమెముఖం గాంభీర్యంగా మారింది. శాంతమ్మ సరళ ముఖంలోకి భయం భయంగా చూస్తూ కూర్చుంది.

" అవునత్తయ్యా ! నేను పెద్దబావను చేసుకోను. చిన్న బావనే చేసుకుంటాను."

శాంతమ్మ కోపంతో బుసలు కొట్టింది.

" వాడు అలా అనమని నీకు బోధించాడచే ?"

" ఒకళ్ళు బోధించేదేమిటి ? నేను కుంటివాణ్ణి చేసుకొని ఏంసుఖపడతాను."

వాక్యం పూర్తికాకుండానే సరళ కళ్ళకు జిగేల్‌మని మంట కనిపించింది. చెక్కిలి మంట పుట్టింది.


" మీరు కొట్టినా చంపినా నేను ఆకుంటివాణ్ణి చేసుకోను. మీరంతా స్వార్థపరులు. అందుకే నన్ను అంత ప్రేమగా పెంచారు" వాల్యూం పెద్దదిచేస్తూ అంది సరళ. సరళస్వరంలో కోపం, దుఃఖం నేనుముందంటే నేనుముందని పోటీ పడుతున్నాయి.

" ఎంతమాట అన్నావే దెస్టకుంకా ! కన్నతల్లి కంటె ఎక్కువగా కడుపులో పెట్టుకొని కాపాడామే,! నీ పెద్దబావ నిన్ను కళ్ళలో పాపలా కనికరించాడే ? వాడుకుంటివాడా ? వాడు కుంటివా

(తరువాయి 41 వ పుటలో)



అఖిల భారత తెలుగురచయితల మహాసభ సందర్భంలో శ్రీ మునిమాణిక్యం నరసింహారావును సన్మానిస్తున్న ముఖ్యమంత్రి



కేంద్ర నౌకాయానశాఖ మంత్రి శ్రీ వి కె ఆర్ వి రావు మే 31వ తేదీన హైదరాబాదులో అ భా తె రచయితల మహాసభను ప్రారంభిస్తున్న దృశ్యం

# తెలుగురచయితల మహాసభ

దేశంలోని అన్నిభాషలకు అదనంగా ఒకే విధమైన లిపిని రూపొందించడం, ఒక భాషలోని మహా కావ్యాలను మరొక భాషలోనికి అనువదించడం జాతీయసమైక్య సాధనకుతోడ్పడగలవని కేంద్ర నౌకాయాన శాఖమంత్రి డాక్టర్ వి కె, ఆర్ వి రావు-మే 31 న హైదరాబాదులో చతుర్థ అఖిలభారత తెలుగు రచయితల మహాసభను ప్రారంభిస్తూ-అన్నారు సమైక్యభావన పాదుకొల్పడంలో ప్రజాహృదయాలను స్పర్శించే శక్తిగల రచయితల పాత్ర మహోత్కృష్టమైనదని డాక్టర్ రావు అన్నారు వేర్పాటు ధోరణివల్ల ఏభాషా అభివృద్ధి చెందజాలదని ఆయన హెచ్చరించారు తెలుగు కన్నడ భాషలమధ్యగల చారిత్రిక ప్రాముఖ్యమైన సాన్నిహిత్యాన్ని వివరిస్తూ ఆయన ఈ రెండు భాషలకు ఒకే లిపిని రూపొందించాలని, దానివల్ల ఈ రెండు భాషలలోని రచయితలకు కొత్త మార్కెట్లు లభించ గలవని అన్నారు ప్రపంచ తెలుగు మహాసభ జరపాలనని ఈ సభ అధ్యక్షుడు మాజీ కేంద్ర మంత్రి శ్రీ డి సంజీవయ్య సూచనను సమర్థిస్తూ డాక్టర్ రావు సన్నాహక చర్యగా కొన్నితెలుగు కావ్యాలను అంతర్జాతీయ భాషలలోనికి అనువదించి ప్రచురించాలని సూచించారు దీనివల్ల బహుప్రాచీన భాషలలో ఒకటైన తెలుగు సంపత్తిని ప్రపంచ ప్రజలు తెలుసుకొనగలరని ఆయన అన్నారు భాషల పవిత్రతను పరిరక్షించడానికి జరుగుతున్న ప్రయత్నాలపై ఆయన హెచ్చరిస్తూ ఇది అభివృద్ధి నిరోధక చర్య అనీ దీనివల్ల ఆ భాషలను వేర్పాటు చేయడమేనని హెచ్చరించారు ప్రయోజనకరమైన సాంఘిక పరిణామం సాధించడానికి ప్రజల అభిప్రాయాలను ఆశయాలను అవగాహన చేసుకుని వాటిని ప్రతిబింబిస్తూ రచనలు చేయాలని డాక్టర్ రావు రచయితలకు విజ్ఞప్తి చేశారు హింసాయుత చర్యలు సాగించి అరాచకం కొనివచ్చే ప్రయత్నాలను వమ్ము చేయాలని కూడ ఆయన రచయితలకు విజ్ఞప్తిచేశారు దేశంలో హిందీ తర్వాత ఎక్కువమంది మాట్లాడే భాష తెలుగు భాషకావడం వల్ల అవసరమని భావించినప్పుడు దేశంలో అది రెండవ జాతీయ భాష కాగలదని డాక్టర్ వి కె ఆర్ వి రావు అన్నారు అయితే దురదృష్టవశాత్తు ఈ వాస్తవం దేశంలో చాలా మందికి తెలియదని తెలుగు భాష దక్షిణాది భాషలలో ఒకటని మాత్రమే భావిస్తున్నారని ఆయన అన్నారు తమిళభాష ప్రచారంవల్ల చాలా మందికి తెలుసునని ఆయన అన్నారు

మహాసభకు హాజరైన ప్రతినిధులకు ఆహ్వాన సంఘాధ్యక్షుడిగా ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి స్వాగతం చెప్పారు అధికార భాషగా తెలుగును ప్రవేశ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన దృష్ట్యా ఇంతవరకు సాహిత్యోపాంగంగానే వుంటూ వస్తున్న తెలుగు భాష ఇకనుంచి సర్వవ్యవహారాలకు ఉపయోగ

పడుతుందని ఆయన అన్నారు తెలుగుభాష స్వరూపస్వభావాలను స్పష్టంగా నిర్ధారించి చెప్పవలసిన బాధ్యత భాషాభిజ్ఞులపైన కలదని ముఖ్యమంత్రి అన్నారు.

సాంఘికమైన చెడుల నిర్మూలన తమ మహత్తరధ్యేయంగా పరిగణిస్తూ దానికితోడు దైవభక్తి జాతీయసమైక్యత వంటి మహోత్కృష్ట ఆశయాలను ప్రచారం చేయాలని శ్రీ డి. సంజీవయ్య రచయితలను ఉద్బోధించారు.

ఈ మహాసభకు పార్లమెంటు సభ్యుడు శ్రీ తెన్నేటి విశ్వనాథం అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంలో ప్రచురించిన సావెనీర్‌ను ఒరిస్సామంత్రి శ్రీనూతక్కి రామశేషయ్య ఆవిష్కరించారు.

ఉదయం రాష్ట్ర మద్యనిషేధ శాఖ మంత్రి శ్రీ వెనిగళ్ల సత్యనారాయణరావు "సరస్వతి" పతాకాన్ని, జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. జనసంబంధ శాఖ మంత్రి శ్రీకొండాలక్ష్మణ్‌బాపూజీ పుస్తకప్రదర్శనను ప్రారంభిస్తూ తెలుగుసాహిత్యంలో ప్రయోజనాత్మకమైన నూతనోత్తేజానికి ఈసమావేశం ప్రేరకం కాగలదని, తెలుగు భాషా సంపదను తెలుగు వారు పూర్తిగా తెలుసు



గ్రంథ-చిత్ర ప్రదర్శనకు మే 31 వ తేదీన జనసంబంధ శ్రామిక మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రారంభోత్సవం చేశారు

కోవాలనీ అన్నారు. ఈసందర్భంలో ఏర్పరచిన సాహిత్య ప్రదర్శనలో మూడువేల పుస్తకాలు ప్రదర్శితమైనాయి.

మారిషస్‌దీవుల తెలుగు ప్రతినిధులుకూడా ఈసభలకు హాజరయ్యారు.

★

---

[ తిరస్కృతి 39వ పుటనుండి ]

డెందుకయాడు? వాడుకుంటివాడు కాకుంటావుంటే ఎంతగొప్పవాడయే వాడు. వాడు ఇలా అవటానికి కారణంఎవరు ? వాడు నువ్వన్న మాట వింటే నిన్ను చస్తే చేసుకుంటాడా! నిన్ను ఈ ముహూర్తానికే నువ్వు కోరిన వాడికిచ్చిచెయ్యడూ ! రేపురాత్రికి పెళ్ళయితే ఇప్పుడు నేను చేసుకోనంటావా ? నేనూ మీ మామయ్య బ్రతకటం నీకు ఇష్టంలేదా ? నోరుమూసుకొని పడివుండు," అంటూ కళ్లు వత్తుకొని లేచింది శాంతమ్మ. బయట ఎవరో గబగబా వెళుతున్నట్లు అడుగులశబ్దం వినిపించి బయటకు వచ్చింది. ఎవరూ కనిపించలేదు కాని ఎవరో సత్యం గదిలోకి వెళ్ళినట్లయి శాంతమ్మ వణికిపోయింది. సత్యం వినలేదుకదా ? గబగబా సత్యం గదిదగ్గిర కెళ్ళింది. గదిలో దీపం లేదు. సత్యం మంచి నిద్రలో వున్నాడు. శాంతమ్మ తేలిగ్గా నిట్టూర్చింది.

సరళ ఆలోచనలో పడిపోయింది. హృదయం అట్టడుగున పూడుకుపోయిన గత స్మృతులు ఒక్కొక్కటీ లేచివచ్చి కళ్ళ ముందు నిలిచాయి.

(సశేషం)

## ఆదర్శఘట్టాలు

# ప్రోత్సాహక బహుమతులు

విధినిర్వహణలో విశిష్ట ప్రతిభ ప్రదర్శించినందుకుగాను ప్రభుత్వోద్యోగులకు ప్రత్యేకంగా ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడానికి సంబంధించి, 1965 జనవరిలో ప్రవేశపెట్టిన పథకాన్ని పురస్కరించుకొని అట్టి బహుమతులు మంజూరు చేయడానికిగాను వివిధ శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనలను, బహుమతుల నిర్ణయ సంఘంవారు 1968 మే 20 వ తేదీన సమావేశమై పరిశీలించారు. ఈ సంఘంవారు చేసిన సిఫార్సులను శ్రద్ధగా పరిశీలించిన మీదట ప్రభుత్వం దిగువ విధంగా ఉత్తర్వులు చేసింది:

అత్యవసర పరిస్థితి అమలులో వున్న కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరరక్షణ సంఘం, ఉపసంఘాల నిర్మాణం విషయంలో విశిష్ట ప్రతిభతో పనిచేసినందుకుగాను ఎస్. సి. శాఖకు చెందిన దిగువ పేర్కొన్నవారందరికీ ఒకనెల జీతానికి సమానమైన రొఖ్ఖాన్ని బహూకరించాలి:—శ్రీ బి. వి. వి. రామకృష్ణారావు సెక్షన్ ఆఫీసరు (ఎస్. సి.), శ్రీయుతులు సి. రామలింగం, వి. రామలింగేశ్వరరావు, హెచ్. సి. హన్మంతరావు—ఎస్. సి. అసిస్టెంట్లు.

కొత్తపైర్లను ప్రవేశ పెట్టడంలో, ముఖ్యంగా తుంగభద్ర ప్రాజెక్టు ప్రాంతంలో సీఐలాండ్‌రకం ప్రత్తిసేద్యాన్ని అభివృద్ధిపరచడంలో విశిష్ట ప్రతిభ ప్రదర్శించినందుకుగాను వ్యవసాయశాఖ విస్తరణాధికారి శ్రీ పి. రంగాచార్యులకు రూ. 500ల రొఖ్ఖాన్ని బహూకరించాలి.

నల్లవాగు ప్రాజెక్టు పనులను శీఘ్రంగా ముగించడంలో అభినివేశం, చొరవ ప్రదర్శించినందుకుగాను లోగడ అసిస్టెంటు ఇంజనీరుగా వున్న శ్రీ ఆర్. రామకృష్ణారెడ్డికి రూ. 500 ల రొ న్ని, సూపర్‌వైజర్లు శ్రీయుతులు ఖాజా ఫజియొద్దీన్, మహమ్మద్ మునీరుద్దీన్‌లకు చెరి రూ. 200ల రొక్కాన్ని బహూకరించాలి.

కోటిపల్లివాగు ప్రాజెక్టు నిర్మాణాన్ని నిర్ణీత సమయానికి $1\frac{1}{2}$ సంవత్సరాలు ముందుగా పూర్తిచేయడంలో అభినివేశం, చొరవ ప్రదర్శించినందుకుగాను అసిస్టెంట్ ఇంజనీరు, శ్రీ జి. రామకృష్ణయ్యకు రూ. 500 ల రొఖ్ఖాన్నీ, సూపర్‌వైజర్లు శ్రీయుతులు బి. ప్రతాపరెడ్డి, మహ్మద్ యూనుస్‌ఖాన్‌లకు చెరి రూ. 200 ల రొఖ్ఖాన్నీ బహూకరించాలి.

మంజీరా నీటి సరఫరా పథకం పనులను క్లిష్టసమయంలో విశిష్ట ప్రతిభతో నిర్వహించినందుకు పరిగణనగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీ ఎం. తిరుపతిరెడ్డికి, ఇదివరకే ఆయనకు అసిస్టెంటు ఇంజనీరు గ్రేడులో మంజూరుచేసిన రెండు అడ్వాన్సు ఇంక్రిమెంట్లకు బదులుగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు గ్రేడులో ఒక అడ్వాన్సు ఇంక్రిమెంటు బహూకరించాలి.

ప్రతాప్‌గిరిజికోటీని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంలో అభినివేశం, చొరవ ప్రదర్శించినందుకుగాను ఆర్థికశాఖ అసిస్టెంట్ శ్రీ మన్సూర్ అలీఖాన్‌కు ఒక నెల జీతానికి సమానమైన రొక్కాన్ని బహూకరించాలి.

పోలీసు పరిపాలనా విషయాలకు సంబంధించిన ముఖ్య సమస్యల విషయంలో అభినివేశం, చొరవ ప్రదర్శించినందుకూ సి. ఐ. డి. క్రైం బ్రాంచిలో వివిధ కేసుల విషయంలో విశిష్ట ప్రతిభతో పనిచేసినందుకూ పరిగణనగా హైద్రాబాదు ఎస్. బి. సి. ఐ. డి. డిప్యూటీ పోలీసు సూపరింటెండెంటు శ్రీ డి. వి. నరసింహమూర్తికి రెండు అడ్వాన్సు ఇంక్రిమెంట్లు బహూకరించాలి.

తమ తమ సర్కిళ్లకు నిర్ణయించిన లక్ష్యాలను మించి పన్నులు వసూలుచేయడంలో విశేష ప్రతిభ కనబరిచినందుకు పరిగణనగా విశాఖపట్నం వాణిజ్య పన్నుల అధికారి శ్రీ సి. వెంకటేశ్వరరావుకు రెండు అడ్వాన్సు ఇంక్రిమెంట్లనూ, విజయనగరం వాణిజ్యపన్నుల ప్రత్యేకాధికారి శ్రీ ఎన్. కృష్ణమూర్తి, అనకాపల్లి వాణిజ్యపన్నుల అధికారి శ్రీ కె. ఎల్. నారాయణ, హైద్రాబాదు వాణిజ్యపన్నుల ప్రత్యేకాధికారి శ్రీ జగదీశ్‌లకు ఒక్కొక్కరికి ఒక అడ్వాన్సు ఇంక్రిమెంటునూ బహూకరించాలి.

కృష్ణా, గుంటూరు జిల్లాలలో వరిమళ్లలో ప్రత్తి సేద్యాన్ని పెంపొందించడంలోనూ, కృష్ణాజిల్లాలో ప్రత్తి సాగుదార్ల సహకార మార్కెటు సంఘాన్ని నెలకొల్పడంలోనూ విశేష ప్రతిభతో పనిచేసిన కాటన్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసరు శ్రీ మహమ్మద్ జైనులాబెదీన్‌కు ఒకనెల జీతానికి సమానమైన రొక్కాన్ని బహూకరించాలి.

## సామాన్యరైతు సాధించిన అద్భుత విజయం

ఆరుకూ, ముప్పదికీ తేడా ఇరవైనాలుగు, ఆరుకు అయిదురెట్లు ముప్పది. అంటే మూడు పదులు. ఏమిటీ అంకెలు! అంకెలలోనే ఉన్నది నేను సాధించిన విజయం—అంటారు యువరైతు శ్రీమానేపల్లి కాశియ్య 1963 సంవత్సరం వరకు శ్రీకాశియ్య ఎకరాకు ఆరుబస్తాలే వరి ధాన్యం పండించగా, నేడు తనకున్న మూడు వందల ఎకరాలలోను సరాసరిని ముప్పదిబస్తాలు పండించగలుగుతున్నారు. అదే రెండవ పంట (దాళ్వాపైరు) కాలంలో ఆరుకు అయిదురెట్లు మేర ఎకరాకు ధాన్యం పండించిన శ్రీకాశియ్య దగ్గర ఏవేవో టక్కుటమారాలు ఉన్నాయని మనకందరకూ అనుమానం కలగడం సహజం. మరి ఆ టక్కుటమారాలేమిటో తెలుసుకుంటే తక్కువ దిగుబడులు యిస్తున్న పొలాల నుంచి

ఆరుకు అయిదింతలు కాకపోయినా నాలుగు రెట్లయినా దిగుబడులు సాధించవచ్చు.

మానేపల్లి కాశియ్య స్కూలు ఫైనల్ వరకు చదివి తన తండ్రి తాతల అడుగు జాడలలోనే బియ్యపు వ్యాపారంలో కాలు పెట్టాడు. అన్నదమ్ములందరు వ్యాపారంలో, ఉద్యోగాలలో మునిగి పోతే, ఉన్న పొలాన్ని సాగుచేసే వారెవరు? ఆ బాధ్యతను కాశియ్య నెత్తిన వేసుకొన్నాడు. వ్యాపార దక్షత వ్యవసాయ రంగంలో ఎంతవరకు ఉపయోగపడుతుంది అని కాశియ్య ప్రశ్నించుకున్నాడు.

ఇదివరకటి పద్ధతులలోనే వ్యవసాయంచేస్తే లాభం అంతగా వుండదని గ్రహించిన కాశియ్య లాభం అధికంగా వచ్చే మార్గాలు అన్వేషించడం మొదలుపెట్టాడు. అందుకు ప్రాతిపదికగా వ్యవసాయశాస్త్ర నిపుణులను సంప్రదించాడు.


అసలు కాశియ్య కుటుంబానికున్న భూమి కొల్లేటిభూమి. అంటే వరాకాలంలో మూడడుగులు లోతున నీరు నిలవవుంటుంది. అందుచేత సార్వాలో అందులో ఎలాంటిపైరు పండించడానికీ ఆస్కారంలేదు. కాగా, దాళ్వా సీజనులోనే వరిపండిస్తున్నారు. ఆదిలో నల్లారు అనే ఎర్రబియ్యపు రకాన్ని పండించేవారు ఈ గింజలకు ముల్లుంటుంది, కొంటి పిట్టపోటుకు తట్టుకుంటుంది, కాని ఈ రకపు బియ్యానికి మార్కెట్‌లో ధరలేదు, అందుచేత పిట్టపోటుకు తటుకొని పిదపకాలంలో పంటకు వచ్చే వరిరకాలనే కొల్లేటి భూములలో పండించవచ్చునని వ్యవసాయ శాఖ వారి సలహాల ప్రకారం సామర్లకోట_16 వరి రకాన్ని పండించడం ప్రారంభించారు.

అయితే ఈరకం ఈ కొల్లేటి భూములలో ఎన్నడూ ఎకరాకు సరాసరిని ఆరుబస్తాల కంటే ఎక్కువ దిగుబడి నివ్వలేదు. ఈ భూములనుంచి అధిక దిగుబడులను సాధించాలి అని ఆదుర్దాతో వున్న కాశియ్య తాను సంపాదించిన పరిజ్ఞానంతో కృషిచేయగా దిగుబడిని ఎనిమిది బస్తాలకు మాత్రమే పెంచగలిగారు.

నూతనాధ్యాయం ప్రారంభమైంది. శ్రీ కాశియ్య 1965_66 దాళ్వా సీజనులో యకరాకు 25 బస్తాలు పండించారు. 1966_67 దాళ్వాకాలంలో 50 ఎకరాల మేర తైచుంగ్ నేటివ్_1 వరిరకాన్ని పైరుచేసి ఎకరాకు 30 భస్తాల చొప్పున పండించి, ఆ వచ్చిన ధాన్యాన్ని యావత్తూ విత్తనాలకు నేషనల్ సీడ్సు కార్పొరేషన్ వారికి అమ్మారు.

ఆ భూముల నుండి మరింత దిగుబడులు సాధించాలని శ్రీ కాశియ్య పట్టుదల వహించారు. 1967_68 దాళ్వాకాలంలో తైచుంగ్‌నేటివ్_1. 20 ఎకరాల మేర ఐ. ఆర్. 8 వరిరకం 50 ఎకరాల మేర ఐ. ఆర్. 868 రకాన్ని 175 ఎకరాల మేర నేషనల్ సీడ్స్ కార్పొరేషను వారికి మేలిరకం విత్తనాలు సరఫరా చేయడానికి పండించారు. ఇంతవరకు కొల్లేటి భూముల నుంచి దాళ్వా సీజనులోనే ఒకే ఒక పైరుపండిస్తున్న శ్రీ కాశియ్య, ఆ భూముల నుండి రెండు వరిపంటలు లేదా మూడు వరిపంటలు పండించాలనే ప్లానుతో వున్నారు.

శ్రీకాశియ్య ఆదర్శంగా ఇతర రైతులు కూడా కృషిచేసి నట్లయితే మన వ్యవసాయంలో ఒక పెద్ద విప్లవం వచ్చినట్లే. అదెంతో దూరంలేదు.



ఆదర్శ యువకుడు ఎస్. మల్లారెడ్డి

## రాత్రి పాఠశాల

ఆలేరుకు ఒకటిన్నరమైలు దూరంలో బహదూర్ పేట గ్రామంవుంది. ఈ గ్రామం, జాతీయరహదారికి ఒక అప్రోచ్ రోడుతో కలపబడివుంది. ఒక ప్రత్యేకమైన భారతీయ గ్రామాన్ని జ్ఞప్తికి తెస్తుందది. ఈ గ్రామంలోని వారు వ్యవసాయమే ప్రధాన వృత్తిగాగలవారు. వారిలో ఒక యువకుడు, పాతికేళ్ళ వాడు ఎస్. మల్లారెడ్డి అనే ఆయన వున్నాడు. ఆయన మెట్రిక్యులేషన్ వరకు చదువుకున్నారు. ఆయన అభ్యుదయరైతు మాత్రమేగాక అక్కడి యువక మండలి అధ్యక్షుడూ, పంచాయతీ దళపతి కూడా.

శ్రీ మల్లారెడ్డి అభ్యుదయ దృక్పథం గలవ్యక్తి. పగలు పాఠశాలకు వెళ్ళి చదువుకోలేని పిల్లలకొరకు తన యింటిలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేద్దామని ఆయన తలపోశారు. 1967 జూన్‌లో పశుల కాపర్లయిన కుర్రాళ్ళ కొరకని ఒక రాత్రి పాఠశాలను ప్రారంభించారు. ఇరవైమంది పిల్లలు వచ్చిచేరారు. వారందరికీ గ్రామస్తులనుంచి సేకరించిన విరాళాలద్వారా పుస్తకాలు, పలకలు మొదలైనవి సరఫరాచేశారు. వీరికి తెలుగుతో పాటు గణితంకూడా నేర్పుతున్నారు. ఇప్పటికి పదిమంది బాలురు 2వ తరగతి పాసయ్యారు. వారికి వ్రాయడం, చదవడం, సులభమైన లెక్కలనుచేయడం చేతనవును.

జీవితంలోని ప్రతిరంగంలోనూ యీ నాడు వస్తున్న విప్లవాత్మకమైన మార్పుల్నిగూర్చి తెలుసుకునేట్టుగా_కనీసం వార్తాపత్రికలద్వారా నైనా తెలుసుకునేట్టుగా_నిరక్షరాస్యులైన బాలురను విజ్ఞానవంతులుగా చేయడమే శ్రీ మల్లారెడ్డి లక్ష్యం.

# పచ్చని చెట్లు

చెట్టు సృష్టికే అలంకారం. సృష్టినే సింగారిస్తుంది చెట్టు. సృష్టిలో కొబ్బరిచెట్టే గాని లేకపోతే చంద్రునికి అందమేలేదని వెనక ఓ రచయిత చెప్పినమాట అక్షరాలా నిజం! కొబ్బరి చెట్ల మధ్యనే చంద్రుడు నూతన శోభలను సంతరించుకుంటాడు. చెట్లు గృహానికీ, ఉద్యానవనం ఊరికీ, అడవి దేశానికీ అందాన్నిస్తాయి.

పరిశీలించి చూస్తే ఒకో చెట్టు ఒకో విషయాన్ని జ్ఞప్తికి తెస్తుంటుంది. కొబ్బరిచెట్టు తలవిరబోసుకున్న స్త్రీలా అనిపిస్తుంది. అందుకే కొబ్బరిచెట్టు విరహానికి గుర్తు. జువ్వి చెట్టు విషాదానికి గుర్తు. పొన్నచెట్టు స్నేహానికి, పొగడచెట్టు అనురాగానికి, బాదంచెట్టు ఛిలిపి తనానికి, చింతచెట్టు భయానికి, బోధిచెట్టు విజ్ఞానానికి, తాటిచెట్టు ఒంటరితనానికీ గుర్తులు. ఇలా ఒకో చెట్టు ఒకో విషయాన్ని గుర్తుకు తెస్తుంటాయి.

చిత్రకారుడికి చెట్టంటే యిష్టం. కవికికూడా చెట్టు చాలా ప్రీతి పాత్రమైంది. ఇద్దరూ చెట్టును తమ తమ నగిషీ పనుల్లో పదిల పరుచుకున్నారు. ఉత్కృష్ట కళా, కవితాఖండాలను సృష్టించి లోకానికి అందించారు.

ఆధునిక జీవితానికి చెట్టు చేస్తున్న సేవ అపారమైనది. ఈ శాస్త్రీయయుగంలో చెట్టు విమానాల్ని ఎగరేస్తోంది. రైళ్ళను నడుపుతోంది. యంత్రాల్ని తిప్పుతోంది. ఎప్పుడో కొన్ని లక్షల సంవత్సరాల క్రిందట భూకంపంవచ్చి భూమిలో కూరుకుపోయిన చెట్లు కాలగతిలో మాడి బొగ్గు అవుతున్నాయి. తనలోని చమురు పదార్థాన్ని బయటికి విడుదలచేసి చమురు నిధుల్ని భూమిలో సృష్టిస్తున్నాయి. ఆ బొగ్గుతోనే, ఆ చమురుతోనే నేడు రైళ్ళు నడుస్తున్నాయి. యంత్రాలు తిరుగుతున్నాయి. ఓడలు కదులుతున్నాయి. విమానాలు ఎగురుతున్నాయి. ఇంకాఎన్నో వింతలు, బొగ్గుతో విద్యుచ్ఛక్తి తయారై కనీ వినీ ఎరుగని అద్భుతాలు జరుగుతున్నాయి. ఆధునిక జీవితాన్ని చెట్టు నడిపిస్తోంది!

భిన్న భిన్న రుచుల ఫలహారం పెట్టి, రంగు రంగుల, రక రకాల పరిమళాల పూలతో కళ్ళను చెదర్చి, మనసును మత్తెక్కించే చెట్టు లేకపోతే మనిషి ప్రశాంతంగా బ్రతగ్గలడా?

ప్రాణం నిలవడానికి చెట్టు అవసరం.
నిత్యజీవితానికి చెట్టు అవసరం.
రసమయ జీవితానికి చెట్టు అవసరం.

—కాని, నాగరికత పెరిగిన కొలది మనిషి చెట్టు అవసరాన్ని గుర్తిస్తున్నట్టు లేదు. అడవుల్ని పడగొట్టి మైదానాలు చేస్తున్నాడు. చెట్లను నేలకూల్చి నగరాలు నిర్మిస్తున్నాడు. జనాభా పెరుగుతున్న కొద్దీ చెట్లు నేలకూలుతున్నాయి. చెట్లు నేలకూలుతున్న కొద్దీ వాతావరణంలో మార్పువస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో వున్న చల్లటిగాలి, ఆహ్లాదకరమైన వాతావరణం పట్టణాల్లో లభించక పోవడానికి కారణం యిదే. చెట్లు మేఘాల్ని ఆకర్షిస్తాయి. వర్షం కురిపిస్తాయి. వర్షాలు లేకపోతే ప్రాణికోటికి ఆహారం వుండదు. అంతేకాదు చెట్లు ప్రమాదకరమైన బొగ్గుపులుసు గాలిని పీల్చి ప్రాణాధారమైన ప్రాణవాయువును దానం చేస్తాయి.


మనకింత సేవచేస్తున్న చెట్టును మనం గుర్తించక పోవడం అనుచితంకదూ. చెట్టు కొమ్మను విరిచి, దానితో చేసిన గొడ్డలితో ఆ చెట్టునే నరుకుతున్నాడు మనిషి. అయినా చెట్టు అతనికి నీడనిచ్చి అతన్ని సేదదీరుస్తోంది. ఎంత నిస్వార్థత దానిది!

మన పెరడులో మనం ఒక చెట్టును నాటితే, అది మనకే కాదు మన పొరుగు వారికి, మన వూరి వారికి, యింకా అనేక పశుపక్ష్యాదులకూ, భవిష్యత్ తరాల వారికి ప్రయోజనాన్నిస్తుంది. ఇంత మందికి యిన్ని విధాల ప్రయోజనకారి అయినచెట్టును మనం అలక్ష్యం చెయ్యడం కూడదు.


పచ్చగా కనిపించేయిల్లు ప్రశాంతతను కురిపిస్తోన్న ఆశ్రమంలా వుంటుంది. చెట్లనీడలక్రింద ఏ కుటీరాన్ని చూసినా ధ్యానముద్రలో మునిగిన ఋషి జ్ఞప్తికి వస్తుంటాడు. పగలల్లా ఎండలో మనకు గొడుగుపట్టి, సాయంకాలం వింజామరలు వీచి, రాత్రి సంగీతంతో నిద్రపుచ్చి, తెలతెలవారేవేళ కోయిలమ్మల మంగళ నిస్వనాల ప్రభాత గీతికలతో మేల్కొలిపి మనల్ని మహారాజుల్ని చేసి, తానొక సేవకురాలై పరిచర్యలు చేసే చెట్టంటే ఎవరికి మాత్రం యిష్టంవుండదు కనుక. పూలతోవున్న చెట్టునుచూస్తే ఏ దేవతో అందమైన తలమీద అలంకరించుకున్న వజ్ర వైడూర్యాది మణులు పొదిగిన పచ్చలకిరీటం గుర్తుకొస్తుంది. వినీల కుంతలాలను సిగచుట్టి, ఆ సిగలో పూలు తురుముకొని భర్త రాకకోసం ప్రోషిత భర్తృకలాగా ఎదురుచూసే భారతీయ స్త్రీ గుర్తుకొస్తుంది.

ఎప్పుడో, ఎక్కడో ప్రత్యేకంగా 'కల్పవృక్షం' వుండేవని మురిసిపోవడం దేనికి. ఆలోచించి చూస్తే మనముందున్న ప్రతి చెట్టూ ఒక కల్ప వృక్షమే!





జన సంబంధ శ్రామిక మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీతో మైసూరులో ఆంధ్ర ప్రదేశ్ యాత్రిక బృందం



మైసూరు రాష్ట్రంలోని శ్రీరంగపట్నం దేవాలయం వద్ద

# మా దక్షిణదేశయాత్ర

రావుల సూర్యనారాయణమూర్తి


1968 మే 16 వ తేదీ—అంటే నడి వేసవి మిట్ట మధ్యాహ్న వేళ హైదరాబాదులో గాంధీ భవన్‌కు ఎదురుగా గల జనసంబంధ శాఖ కార్యాలయ ఆవరణ అవశ్యకమైన ప్రయాణ సన్నాహముతో యాత్రోన్ముఖులవుతున్న వారితోను, ప్రయాణం ప్రమోదభరితం కావాలని శుభాకాంక్షలు తెలియజేసే నిమిత్తం విచ్చేసిన వారి బంధు మిత్రులతోను చూపరులకు అతిఉత్సాహమూ, కొత్త ఆనందమూ కలగజేస్తున్నది. ఏదో పని మీద అక్కడకు వచ్చిన ఒకాయన "ఏమిటండీ ఈ సంరంభం" అని ప్రశ్నించగా "యాత్రికుల సౌకర్యార్థం మాజనసంబంధశాఖ నిర్వహిస్తున్న దక్షిణ దేశయాత్ర ప్రారంభించ బడుతున్న" దని ప్రత్యుత్తర మిచ్చాడొక ప్రభుత్వోద్యోగి. లాంఛన ప్రాయమే అయినప్పటికీ శోభావహంగా జరిగిన ప్రారంభోత్సవ సభలో సంచాలకులు శ్రీ బి. ఎన్. రామన్ యాత్రికులకు సుఖ సంతోషాలు సంప్రాప్తం కాగలవనే ఆశాభావాన్ని వెలిబుచ్చిన వెంటనే ఆంధ్ర ప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థవారి సరికొత్త బస్సులో ఎవరికి కేటాయించ బడ్డ స్థానాల్లోవారు ఆసీనులయ్యారు. హృదయంగమమైన ఆ దృశ్యమంతటిని లలితశ్రీ పిక్చర్సు వారు నేర్పుతో, ఓర్పుతో చిత్రీకరించారు. పవిత్ర దేవాలయాలను, పురాతనక్షేత్రాలను, తులలేని శిల్పకళా సంపదను సందర్శించే సమయంలో హృదయాలలో ఎలాంటి భావాలు పొంగుతాయో అని తదీయ దర్శనాపేక్ష పరువులు తీయగా లోలోపల ఉవ్విళ్ళూర సాగిన పర్యాటకులతో నిండిన కుతూహలాయత్తమైన బస్సు యాత్రిక సమితికి ప్రధాన కార్యనిర్వాహకులైన చలనచిత్ర విభాగం సహాయ సంచాలకులు శ్రీ పి.వి. నరసింహారెడ్డి ఆదేశం లభించ గానే నిండు గర్వంతో పురోగమించింది.

కర్నూలు కనుచూపు మేరలో లేకముందే విహాయసం వినీలమేఘావృతమై సన్నని వర్షపు జల్లు పడడంతో ఆహ్లాద కరమూ, ఆరోగ్యదాయకమూ అయిన శీతోష్ణస్థితి మా బృందానికి స్వాగతాంజలులు సమర్పించింది.

ఆవేళరాత్రి అనంతపురంలో మకాంచేశాము. వయస్సు మళ్ళుతున్న మనస్సును ఆనందమయం చేసుకుని, హాస్యపద ప్రయోగాలతో అనుక్షణం నలుగురినీ నవ్విస్తూ ప్రయాణం హాయిగా తీయగా జరగడానికి దోహదం చేసున్న శ్రీ సీతారామయ్య అపారమైన అనుభవాన్ని అల్పవ్యవధిలోనే అంగీకరించి, ఆయనను ముప్ఫైమంది యాత్రికులు, ముగ్గురు అధికారులు, ఇద్దరు భృత్యులతో కూడిన మా దళానికి నాయకులుగా ఎన్నుకున్నాము.

మరునాడు ప్రశాంత ప్రభాత సమయంలో నిత్యకృత్యాలు తీర్చుకుని, విశిష్టశిల్పకళావిలసితమైన విజయనగర సంప్రదాయ శైలికి ప్రత్యక్షనిదర్శనంగా నిలిచిన లేపాక్షి దేవాలయాన్ని దర్శించే నిమిత్తం బయలుదేరాము. మార్గమధ్యంలో బస్సులో వెడుతూనే పెనుగొండ దుర్గం, దానిని చేరివున్న కొన్ని శిథిల దేవాలయాలు తిలకించాము. కన్యాకుమారి నుంచి కటకం వరకూ ఆంధ్ర సామ్రాజ్యాన్ని స్థాపించిన సహజప్రతిభాదురంధరుడైన శ్రీకృష్ణ దేవరాయల వంశీయుల రాజధానిగా ఒకనాడు భోగభాగ్యాలతో తుల తూగుతూ శత్రువులకు కన్నెఱ్ఱ కావించిన ఆ పట్టణం పూర్వవైభవాన్ని కోల్పోయినప్పటికీ ప్రాచీనాంధ్ర వీరవిస్ఫూర్తిని ఒక్క మాటు స్మరింప జేసింది. హిందూపురానికి పది మైళ్ళ దూరాన గల ఒక కుగ్రామం చేరాక "లేపాక్షి బసవయ్యా—లేచి రావయ్యా,


కైలాస శిఖరిలా–కదలి రావయ్యా" అనే పసందైన పాట ద్వారా బసవయ్య కీర్తి ప్రతిష్ఠలను దేశం నలుచెరగులా చాటిన శ్రీ అడవి బాపిరాజు వ్రాసిన ప్రతి చరణం కళ్లకు కట్టినట్లయింది. భారత దేశంలోని బసవయ్యలలో ఆకారంలో అత్యున్నత స్థానాన్ని ఆక్రమించిన నంది మువ్వలు, తాళ్ళు, గంటలు, గజ్జెలు ఆదిగాగల అలంకారాలతో బ్రహ్మాండమైన ఏకశిలపై మలచబడింది. లేపాక్షిలోని లేత్రాయపు వృషభం మనోహరాకృతి అందరినీ మంత్రముగ్ధులను చేసింది. అక్కడకు సమీపంలో చిన్న కొండపై గల దేవాలయాన్ని చూడడానికి మెట్లెక్కి ప్రథమ ప్రాకారాన్ని ప్రవేశించగానే యిరువైపుల గల మంటప స్తంభాలపై మనోహర శిల్పాలు మానవుడి భావనా వైచిత్రిని ప్రస్ఫుటం చేశాయి. ప్రకృతి ప్రసాదించిన తరులతాగుల్మాదులు, పశుపక్షుల దైనందిన జీవితాలకు సంబంధించిన అనేక భంగిమలు, పురాణాంతర్గత గాథలూ గోడలపై శిల్పిబ్రహ్మల సునిశిత హస్తాలలో సుందర శిల్పకళా నిలయాలుగా రూపొందాయి. రాతి జాతికీ, శిల్ప నైపుణ్యానికీ ప్రసిద్ధిచెందిన ఆ ఆలయంలో నిజమైన సర్పమేనా అని భ్రాంతి గొలిపే సప్తఫణి కళాకారుడి అద్వితీయ ప్రతిభకు ప్రత్యక్ష నిదర్శనం. అసంపూర్ణ కళ్యాణ మండపం, గజా



మైసూరు రాష్ట్రంలోని శ్రీరంగ పట్నంలో టిప్పుసుల్తాన్
వేసవి విశ్రాంతి కేంద్రం వద్ద

గుండం, సోమవారమండపం, రంగమండపం మొదలైన వాటి శిల్పవైశిష్ట్యం వర్ణనాతీతం. నేలపై నిలబడకుండా, పైనుంచి వ్రేలాడే అంతరిక్ష స్తంభం అందరినీ ఆశ్చర్య చకితులను చేసింది. ఈ ఆలయంలో మరో విశేషం వర్ణచిత్రాలు. పై కప్పుపై కిరాతార్జునీయం, శివపార్వతీ కళ్యాణం, ద్రౌపదీ స్వయంవరం ఆదిగాగల గాథలు వన్నె చిత్తరువులలో నయనానందంగా ప్రదర్శించబడ్డాయి. సిద్ధహస్తులైన చిత్రకారులకుగల వస్త్ర విశేష పరిచితినీ, వర్ణసమ్మేళనా నైపుణినీ అవి వేనోళ్ళ చాటుతున్నాయి. ఆ శివాలయంలోని ప్రతి స్తంభమూ సుందరశిల్ప విభాసితమే. ఎంతసేపు తిలకించినా తనివితీరని ఆ దేవాలయాన్ని వదలి వెళ్ళడానికి కాళ్లురాలేదు. అది అంతటి హృదయాకర్షకమైన శిల్ప సౌందర్యం.

యాత్రికుల సౌకర్యార్థం జనసంబంధశాఖ నిర్మించిన వసతి గృహం 'అభయగృహ'లో మార్గాయాసం తీరేటట్లు కొంచెం సేపు విశ్రాంతి తీసుకుని, హిందూపురం వెళ్ళి భోజనాలు చేసుకున్నాము. అక్కడనుంచి అందమైన వేసవి విశ్రాంతి కేంద్రం నంది కొండలకు వెళ్ళాము. రకరకాల వృక్షాలతోను, రంగురంగుల పూలతోను అలరారుతున్న అతి మనోహరమైన పరిసరం గల దారిపై మెలికలు తిరుగుతూ బస్సు కొండను అధిరోహించేటప్పుడు ప్రకృతి సౌందర్యోపాసకులు ఆనంద పరవశులైనప్పటికీ, కొంతమంది భయభీతులు కాకపోలేదు. సముద్రమట్టానికి 4,850 అడుగుల ఎత్తులోవున్న కొండపై ఫలవృక్షాల మధ్య రమణీయమైన తరుచ్ఛాయలతో విలసిల్లుతున్న అందమైన బాటల్లో నడవడం ఆహ్లాదం కలిగించింది. అక్కడ ''అమృత సరోవరం'' అనే జలాశయం ఒకటి లోతుగా, విశాలంగా వున్నది. ఆ సరోవరం నీటిలో ఆరోగ్యాన్ని ప్రసాదించే లక్షణాలువున్నట్లు ప్రతీతి. నంది కొండలపై ప్రాచీన శిల్పకళా సంపదను సాక్షాత్కరింపచేసే శివాలయము, గాంధీమండపం, కబ్బన్‌భవనం మొదలైనవి చూచి, హృదయాహ్లాదకరమైన వాతావరణాన్ని అనుభవించి, అక్కడనుంచి 38 మైళ్ళ దూరానవున్న బెంగుళూరు రాత్రికి చేరుకున్నాము. మైసూరు ప్రభుత్వం సహాయంతో, అవసరమైన సదుపాయాలను సమకూర్చే నిమిత్తం ముందుగా పంపించబడ్డ హైదరాబాదు జిల్లా



మహాబలిపురంలో

సహాయ జనసంబంధాధికారి శ్రీ ఇంద్రసేనరెడ్డి, ఆధునిక సౌకర్యాలతో కనుల పండువుగా విరాజిల్లుతున్న సమున్నత సౌధం ప్రభుత్వ అతిథి గృహంలో మాకు విడిది ఏర్పాటు చేశారు.

మూడో రోజు ఉదయం త్వరత్వరగా స్నానాలు ముగించుకొని ఉపాహారం తీసుకున్నాము. వేకువవేళ లేచి, కాలకృత్యాలు తీర్చుకుని ముందుకు పరువెత్తసాగిన హృదయాలతో కొత్త ప్రదేశాల సందర్శనకు సంసిద్ధులం కావడం మాకు అప్పుడప్పుడే అలవాటు అవుతున్నది. మైసూరు ప్రభుత్వం ఏర్పాటు ప్రకారం సమాచారశాఖ సహాయడైరెక్టరు ఒకరు వెంటరాగా నిర్ణీత కార్యక్రమం ప్రకారం వివిధ స్థలాలను, సంస్థలను చూడడానికి బస్సులో బయలుదేరాము. మైసూరు రాష్ట్రానికి రాజధాని అయిన ఆ అందమైన నగరం సుదీర్ఘమైన రహదారులతోను, సువిశాలమైన సుంద

రోద్యానవనాలతోను, బ్రహ్మాండమైన భవనాలు, కర్మాగారాలు, వాణిజ్య కేంద్రాలతోను మమ్మల్ని సమ్మోహితులను చేసింది. హిందూస్తాన్ యంత్ర పరికరాల కర్మాగారంలో సున్నితంగా, సుకుమారంగా చేతి గడియారాలను తయారుచేసే పద్ధతిని పరిశీలించాము. అనునిత్యం వెయ్యి గడియారాలను ఉత్పత్తిచేస్తున్న ఆ సంస్థను ఎవరికి తోచినట్లు వారు కొనియాడారు. అక్కడ నుంచి ప్రభుత్వ చందనం సబ్బు కర్మాగారానికి వెళ్లాము. మాకు సబ్బు తయారీలో వివిధ దశలూ వివరించబడ్డాయి. తరువాత అడుగడుగునా ఆనందోత్సాహాలు రేకెత్తించే రెండు ప్రదర్శనశాలలు చూచి మకాం చేరుకున్నాము. భోజనానంతరం కాస్సేపు శయనించి, పయనం ప్రారంభించాము. బసవన్న గుడిలోని నందిదేవాలయం, ప్రధాన చారిత్రక కట్టడమైన టిప్పుసుల్తాను కోట తిలకించి, బెంగుళూరు అందాన్ని ఇనుమడింపజేస్తున్న లాల్‌బాగుకు వెళ్లాము. హైదరాలీ, టిప్పుసుల్తానుల వర ప్రసాదంగా మైసూరుకు లభించిన ఈ లాల్‌బాగ్, గత శతాబ్దంలో ఆశియాలో కల్లా అత్యుత్తమ వృక్షశాస్త్ర విజ్ఞానవనంగా అభివృద్ధి పరచబడింది. విభిన్న శీతోష్ణస్థితిగతులను చవిచూచే ప్రాంతాలకు చెందిన అనేకరకాలైన మొక్కలు, చెట్లుచేమలు ఇక్కడవున్నాయి. కన్నుల కరవు తీరేటట్లు మహోన్నత సౌధరాజం విధాన సౌధను చూశాము. ఇటీవలి కాలంలో నూతనంగా వెలసిన ఆ హర్మ్యంలోనే రాష్ట్రశాసనసభ, సచివాలయం వున్నాయి. అక్కడనుంచి బెంగుళూరు నగరవ్యవస్థాపకుడైన కెంపెగౌడ్ పేరిట నిర్మితమైన రమణీయమైన రోడ్డు మీదుగా ప్రయాణంచేసి, కానుకలు సమర్పించదలచి వారికీ, కళాస్వారస్యమూర్తులకూ అద్భుతమైన హస్తకళా వస్తువులు లభిస్తున్న కాంగ్రెసు ప్రదర్శనశాలను దర్శించడంతో నాటి కార్యక్రమం ముగిసింది.

పంథొమ్మిదో తేదీన మళ్లీ మామూలుగా ప్రథమ సంధ్యవేళ ప్రయాణం ప్రారంభించి, మైసూరు వైపుకు సాగుతుండగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీరంగపట్నం చేరుతున్నామనగానే ప్రభుత్వ వాహనంనుంచి ఒక వ్యక్తిదిగి మా బస్సును ఆపుచేశాడు. తాను మైసూరు జిల్లా ప్రచారాధికారిననీ, మా రాకకోసం నిరీక్షిస్తున్నాననీ తెలియజేశాడు. పరస్పర పరిచయాలు పరిపూర్తి అయ్యాక ఆయన 13వ శతాబ్దానికి చెందిన శ్రీ రంగనాథస్వామి ఆలయానికి తీసుకు వెళ్లాడు. టిప్పుసుల్తాను పరిపాలనాకాలంలో రాజధానిగా పేరు ప్రఖ్యాతులు గడించుకున్న ఈ దీవిపట్టణంలో ఆంగ్లేయ ఖైదీలు వుంచబడ్డ భూగర్భగృహం, కావేరీ నదీ తీరంలోని అందమైన ఉద్యానవనంలో వెలసిన టిప్పుసుల్తాను వేసవి నిలయం "దరియా దౌలత్‌బాగ్" ప్రాచీనవస్తు ప్రదర్శనశాలచూచి, పదిమైళ్ల దూరంలో వున్న మైసూరులో ప్రవేశించాము. నిత్యకళ్యాణం పచ్చతోరణంలా సర్వాంగ శోభితంగా అలరారుతున్న ఆ నగరం అందరికీ వుత్తేజ కారకం అయింది. దక్షిణాదిలో మహోన్నతమూ, మనోహరమూ అయిన ఫిలామినా క్రైస్తవాలయం ప్రశస్త పరచబడ్డ శిల్పసంపదతో ఎంత ప్రసిద్ధిచెందిందో, దానిలోపల ప్రశాంతతకు అంత ప్రఖ్యాతివహించింది.

అక్కడగల క్రీస్తు జీవితాన్ని ప్రతిబింబింపజేసే ప్రతిరూపాలు మా హృదయాలలో చెరగని ముద్రలు వేశాయి. జగన్మోహన్ కోటలో కళాఖండాల ప్రదర్శనశాల, జంతుశాస్త్ర విజ్ఞానవనాలు సందర్శించి, సుప్రసిద్ధమైన సుజాత హోటల్‌కు వెళ్లాము. విజ్ఞాన వికాసానికి దోహదంచేసే ఈ యాత్రకు సూచన ప్రోత్సాహాలు అందజేసిన జనసంబంధ శ్రామిక మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ మాతో మధ్యాహ్న భోజనంచేసి ప్రయాణం సుందాగా, సంతోషంగా సాగుతున్న సంగతి ప్రతి ఒక్కరి నుంచి తెలుసుకొని తమ సంతృప్తిని వ్యక్తపరిచారు. సాయంకాలం వారి బృందంతో పాటు మహారాజు కోటను అవలోకించే అవకాశం కలిగింది. అతి సూక్ష్మంగా, సుందరంగా తీర్చిదిద్దబడ్డ కుడ్య చిత్రాలు అలంకరణాలతో అలరారే గంభీరమైన ఆ ఆధునిక కట్టడాన్ని చూడడానికి రెండు కళ్లూ చాలవేమో అనిపించింది. మైసూరు పట్టణానికి సహజ సౌందర్యం సమకూరుస్తున్న చాముండి పర్వతానికి వెళ్లేముందు లలితామహాలు చూశాం. మనోహరమైన చాముండీ పర్వతాన్ని అధిరోహించేటప్పుడు దారిలో బ్రహ్మాండమైన ఏకశిలపై మలచబడ్డ నంది విగ్రహం కనుపించింది. కొండపై గల శ్రీ చాముండేశ్వరీ దేవి ఆలయంలో భక్త్యంజలులు సమర్పించుకుని బృందావనతోటలకు బయలుదేరాము. కనుచీకటివేళ అయింది. అక్కడ వృక్షసముదాయపు సౌందర్యం, వన్నెవన్నెల కన్నెపూల సొగసు, జలయంత్రాలు విరజిమ్మే కిరణ ప్రసరణాలు, దీపాల కాంతులలో మెరిసే కొలనులలోని జలాలు ముగ్ధుల్ని గావించాయి. వివిధ వృక్ష పరిమళాలతో పిల్లగాలులువీస్తూ, వాతావరణాన్ని ఆహ్లాదకరంచేస్తూ, మానసికోల్లాసం అందరికీ అందజేసిన ఆ సుప్రసిద్ధ ఉద్యాన వనాలనుంచి అపూర్వమైన ఆనందంతో విశ్రాంతిగృహం చేరుకున్నాము.

ప్రకృతి రమణీయకతతో విలసిల్లుతూ, హృదయాలను పరవశ్ము తొక్కించిన మైసూరులో ఆ మరునాడు బయలుదేరి నేత్రానందం కలిగించే మనోహర దృశ్యాల మధ్యనుంచి ఉదకమండలం వచ్చాము. దాక్షిణాత్యులకు ప్రీతిపాత్రమైన వేసవి విశ్రాంతి కేంద్రాలలో ఇది ముఖ్యమైనది. ఇక్కడి చెట్ల సముదాయాన్ని, పూలపాన్పులను, జలయంత్రాలను ప్రశాంత ఆహ్లాదకర వాతావరణాన్ని పరికించాక నీలగిరులను అంతా ఎందుకింత హృదయ పూర్వకంగా ప్రేమిస్తారో విశదమయింది. రమ్యమైన ప్రకృతి దృశ్యాలతో అలరారుతూ, ఒక ప్రత్యేకతను చాటే ఆ సుందరమైన ప్రదేశంలో ప్రభుత్వ వృక్ష శాస్త్ర విజ్ఞాన వనాలు ప్రతి ఒక్కరి హృదయాలను సంతోష సంభరితం చేశాయి. సాయంత్రం 4 గంటలకు మా బస్సు కోయంబత్తూరు వైపుకు ప్రయాణం ప్రారంభించింది. కూనూరు దాటిన తరువాత ఇరుకైన ఒక రైలు వంతెన మా భారీవాహనం ముందుకు సాగడానికి అవరోధం కలగజేసింది. అందువల్ల కూనూరు, కోటగిరిమీదుగా కోయంబత్తూరు చేరడానికి బస్సును వెనుకకు మళ్ళించాము. ఆ పరిసరమంతా అప్పటికే మసక చీకటి మయమయింది. దారి అంతా సురక్షిత మయింది కాదని గ్రహించినప్పటికీ ధైర్యోత్సాహాలకు మారుపేరయిన డ్రైవరు ప్రయాణం ఆపుచేయడానికి అంగీకరించలేదు. మరో డ్రైవరుకూడా నిశ్చింతగా, నిర్భయంగా వెళ్ళిపోవచ్చనే అభిప్రాయం వెల్లడించాడు.

ఆ వుభయుల అభయాలను ఆధారంగా తీసుకుని అలాగే కొనివ్వమన్నాము. సన్నని మార్గంగుండా పర్వతాలను దిగేటప్పుడు ప్రతి ఒక్కరి గుండెలూ అరచేతుల్లోనే వున్నాయి. ప్రమాద భరితమైన ఆ ప్రయాణం జయప్రదంగా పూర్తి చేయడంలో బస్సు డ్రైవరు సమయ సముచితంగా ప్రదర్శించిన సమయం, సాహసం సంస్తవనీయమైనవి.

అందరిలోనూ భయాందోళనలు కలగజేసిన ఆ పర్వతావరోహణం పరిపూర్తి చేసుకుని రాత్రి 11 గంటలకు కోయంబత్తూరులో దిగాము. 21వ తేదీ ఉదయమే ఫలహారం ముగించుకుని వాహనారూఢుల మయ్యాము అందాలుచిందే నారికేళ వృక్షాదులతో నేత్రపర్వమైన క్షేత్రలక్ష్మిని సందర్శిస్తుండగా బస్సు చల్లచల్లగా సాగిపోతున్నది. లేత లేత చిగురు చేతులతో పలురకాల ఫల వృక్షాలు ఆప్యాయంగా ఆహ్వానించే కేరళరాష్ట్రపు ప్రకృతి సౌందర్య సమీక్షణంలో పరవశ హృదయులమైపోతూ మధ్యాహ్నానికి ఎర్నాకుళంలో అడుగు పెట్టాము కేరళ రాష్ట్రంలో మాకు ఏర్పాట్లన్నీ చేసిన పరిగి పంచాయతీసమితి సహాయ జనసంబంధాధికారి శ్రీ శేషాచారి మమ్మల్ని కలుసుకున్నాడు. భారత్ టూరిస్టు హోంను అధిపతి అధరాగ్రంపై చిరునవ్వులుచిందిస్తూ మా బృందానికి స్వాగతమిచ్చాడు. పూర్వపు కొచ్చిన్ రాష్ట్రానికి రాజధాని అయిన ఆ సహజసుందరనగరంలో సంతోష జలధిలో మునిగి తేలాము. అక్కడ నిశ్చల జలాలలో మోటారుబోటుపై సలిపిన విహారం అందరికీ ఉత్సాహం, ఉల్లాసం కలిగించింది. ఆ తర్వాత రోజున కళకళలాడుతున్న చెట్ల మధ్యనుంచి అలప్పీ, క్విలను మీదుగా తిరువనంతపురం చేరుకున్నాము. కేరళకు ముఖ్య పట్టణమైన ఆ నగరసౌందర్యం వర్ణణాతీతం. ఇక్కడ మిక్కిలి ఆకర్షణీయమైన భవనం నేపియర్ మ్యూజియం దీనిచుట్టూ ఆనందకరమైన ఉద్యానవనంలో జంతుప్రదర్శనశాల విలసిల్లుతున్నది అదే ప్రాకారంలో ఉత్తమకళాఖండాలతో నిండిన చిత్రాలయం యాత్రికులను మంత్రముగ్ధులను చేసింది. కేంద్ర ప్రభుత్వ యాత్రిక సమాచారకేంద్రానికి చెందిన ఒక అధికారి మాకు మార్గదర్శిగా వ్యవహరించాడు మధ్యాహ్నం జలక్రీడాస్థలంగా ప్రపంచ ప్రఖ్యాతిని సముపార్జించుకున్న కోవలం సముద్రతీరం చేరాము తిరువనంతపురంనుంచి 7 మైళ్లదూరంలోగల ఆ దారి పొడవునా మనోహరమైన కొబ్బరిచెట్ల నీడలలో ప్రయాణం చేస్తూంటే ఆనందం పొంగి పొరలింది కోవలం వద్ద సాగరస్నానం చేస్తున్నంత సేపూ స్వర్గసౌఖ్యం వేరేలేదనిపించింది మళ్లీ తిరువనంతపురం చేరుకుని చారిత్రకంగాను, శిల్పకళారీత్యాను విశిష్టశ్రేణికి చెందిన శ్రీ పద్మనాభస్వామి దేవాలయం దర్శించాము శోభాయమానమైన ఆ ఆలయం చుట్టుగల కోట ఎన్నో ప్రాచీన రాజమందిరాలు కలిగి వున్నది ఆరాత్రి భోజనానంతరం కన్యాకుమారి వెళ్లి అక్కడ మకాంచేశాము మాకు మద్రాసురాష్ట్రంలో సౌకర్యాలు కలగజేయడానికి నియమించబడ్డ ఖమ్మం జిల్లా సహాయ జనసంబంధ అధికారి శ్రీ వి ఎస్ సుబ్రహ్మణ్యం స్వాగతమిచ్చారు.

భారత భూభాగపు దక్షిణకొనను గల కన్యాకుమారిలో నయనమోహనమైన సూర్యోదయాన్ని తిలకించి, ప్రఖ్యాత కన్యాకుమారి దేవాలయ దర్శనం చేసుకున్నాము బంగాళాఖాతం, అరేబియా సముద్రం, హిందూమహాసముద్రం అనే మూడు సాగరాల సంగమస్థానమైన ఆ పవిత్ర ప్రదేశం నుంచి రామేశ్వరం వెళ్లేమార్గంలో ప్రసిద్ధ సాగరతీరస్థ దేవాలయమైన తిరుచెందూరు శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దర్శన భాగ్యం లభించింది. పవిత్ర రామేశ్వరద్వీపం చేరుకోడానికి మండపంనుంచి రైలులో ప్రయాణం చేసేటప్పుడు సౌందర్య విలసిత సాగరదృశ్యాలు సమ్మోహితులను చేశాయి ఆ రాత్రి అలసట తీరేటట్లు విశ్రాంతి తీసుకుని, 24 తేదీ ఉదయం సముద్రస్నానం చేసి శ్రీరామనాథ స్వామి ఆలయానికి వెళ్లాము అక్కడవున్న వేయిస్తంభాల విశాలమందిరప్రాకారం మమ్మల్ని మంత్రముగ్ధులను చేసింది. నాలుగు వేల అడుగుల పొడవుగల ఈ శోభావహమైన లోపలి ప్రాకారం ప్రపంచంలోని ప్రాకారాలలో అత్యున్నతస్థానం ఆక్రమిస్తున్నది. సీతాన్వేషణలో శ్రీరామచంద్రుడు విచ్చేసి పునీతంచేసిన ఆ ప్రభుత్వ యాత్రిక గృహం వద్ద దిగాము.

శనివారం నాడు—అంటే మే 25వ తేదీన మద్రాసు రాష్ట్రంలోని రెండవ పెద్దనగరమై, తమిళ సారస్వతానికి మాతృపీఠమైన మధురలో జగద్విఖ్యాతమైన మీనాక్షి దేవాలయం చూశాము. ద్రావిడ శిల్పకళావైభవానికి ప్రత్యక్ష తార్కాణమైన ఆ ఆలయం గోపురాలు ఆశ్చర్య చకితులను చేశాయి. పచ్చ పచ్చని పంట భూములతోను, పొడవైన నారికేళవృక్షాలతోను, ఉన్నత దేవాలయ గోపురాలతోను విరాజిల్లే తమిళనాడుకు మచ్చుగా మధుర చూడ ముచ్చటగా అతిరమణీయంగా వున్నది. అ ప్రాంతాన్ని పరిపాలించిన నాయక వంశీయులలో అతిప్రసిద్ధుడైన తిరుమల నాయకుడి (క్రీ.శ 1623—29) విశాలమూ, విశిష్టమూ అయిన రాజమందిరాన్ని కళాత్మక కట్టడంగా అభివర్ణించిన మేము ఆనాటి ప్రశాంత నిశా సమయంలో మనోహరమైన మందమారుతంలో మహానందంగా ప్రయాణంచేసి తిరుచినాపల్లిలో హాయిగా నిద్రించాము. మళ్లీ ఉదయంకాగానే అక్కడగల దేవాలయానికి వెళ్లాము. నేల మట్టం నుంచి 273 అడుగుల ఎత్తునగల రాతి కోటలో శివాలయం అద్భుతంగావున్నది ఆ తరువాత తిరుచినాపల్లికి మూడుమైళ్ళ దూరంలో వున్న శ్రీరంగక్షేత్రోన్ముఖులమయ్యాము కావేరినదికి, దాని ఉపనదులకు మధ్య ఏర్పడిన సుందరమైన శ్రీరంగ ద్వీపం దక్షిణా పథంలోని మహోన్నత విష్ణ్వాలయాలలో ఒకటి అయిన శ్రీరంగ నాథాలయం మూలంగా సత్ప్రభావం సంతరించుకున్నది. అక్కడ దైవారాధన ముగించుకుని మధ్యాహ్నభోజనానికి తిరుచినాపల్లిలో మేము బసచేసిన ప్రభుత్వ యాత్రిక విశ్రాంతి గృహానికి వచ్చాము. సాయంత్రం విశాల విస్తృతచోళ సామ్రాజ్యానికి పది, పద్నాలుగు శతాబ్దాల మధ్య రాజధానిగా ప్రఖ్యాతి వహించిన తంజావూరు దర్శించాము అలనాటి చోళరాజుల మహైశ్వర్య సూచకమై శేషించిన శ్రీ బృహదీశ్వరాలయం మా హృదయాలను ద్రవింపజేసింది. అది భారతావనిలో మహోత్కృష్ట దేవాలయమనీ, తమిళులు బహుశః ప్రపంచంలోనే మహోన్నత దేవాలయ నిర్మాతలనీ బ్రిటన్ విజ్ఞాన

సర్వస్వం వర్ణించింది. ఆ ఆలయ ప్రాంగణంలోవున్న ఏకశిలా నిర్మితమైన నంది మన దేశంలోని బసవన్నలలో పరిమాణంలో ద్వితీయస్థానం వహిస్తున్నది. ఆ ఆలయం చుట్టూగల ప్రాకారం సుందర శిల్పకళానిలయం. గర్భాలయంలో లింగమూర్తిని దర్శించినప్పుడు ప్రతి యాత్రికుడి అంతరంగంలోనూ భక్తితరంగాలు పొంగక మానవు. తంజావూరు కోట శిథిల దృశ్యాలు చూస్తూ సరస్వతీ మహలుకు వెళ్లాము. అక్కడ అనేక ప్రాంతీయ భాషలకు చెందిన అమూల్యమైన ఆది గ్రంథ లిఖిత ప్రతులు భద్రపరచబడ్డాయి.

27 వ తేదీ తెల్లవారుఝామున తిరుచినాపల్లిలో కదలిన మా బస్సు పదకొండు గంటలయ్యేసరికి పుదుచ్చేరి చేరింది. భారత భూమిలో ఫ్రెంచి సంస్కృతికి నిలయంగా, నిదర్శనంగా నిలచిన ఈ పురాతన పట్టణంలో శ్రీ అరవిందాశ్రమం ప్రపంచప్రసిద్ధి గడించుకున్నది. సజీవ భక్తివిశ్వాసాల ప్రత్యక్ష చిహ్నమైన ఈ ఆశ్రమం సంవిలీనయోగానికి కేంద్రం. ఆ ప్రశాంత ప్రదేశంలో ప్రసూనాలంకృతమైన శ్రీ అరవిందుని సమాధికి సవినయాంజలులు సమర్పించుకున్నాము సమస్త వస్తు సమ్మోహకమై శోభిల్లుతున్న పుదుచ్చేరిలో సముద్రతీరం, రాజనివాసం మొదలైనవి చూసుకుంటూ తీర్చిదిద్దినట్లు సుందరంగా నిర్మించబడ్డ రోడ్లపై ప్రయాణం చేశాము. భోజనాలయ్యాక పక్షితీర్థంమీదుగా మహాబలిపురం వెళ్లాము సప్తగోపురాలుగా ప్రసిద్ధిచెందిన సముద్రతీర విహారస్థలం అందరికీ ఆహ్లాదం కలుగజేసింది. పల్లవరాజుల కాలంనాటి శిలాశిల్పసంపద కళాహృదయులను కదిలించివేసింది. నాటి రాత్రి 63 మైళ్ళ దూరంలోవున్న మద్రాసు మహానగరం చేరుకున్నాము.

మరునాడు మద్రాసులో ఆ రాష్ట్ర సమాచారశాఖోద్యోగి ఒకాయన వెంటరాగా హైకోర్టు, మిన్నుముట్టేటట్టున్న లైటుహౌసు నుంచి మనోహర నగర దృశ్యం, ప్రపంచంలోని అతిపొడవైన సముద్రతీరాల్లో ద్వితీయ స్థానం ఆక్రమిస్తున్న మెరీనాలు తిలకించి పులకించిన హృదయాలతో మైలాపూరులోని కపాలేశ్వరస్వామి గుడిని దర్శించాము ఆ తరువాత దివ్యజ్ఞాన సమాజానికి ప్రపంచ కేంద్రస్థానమైన అడయారు, వివిధ ప్రాంతాలనుంచి వేలాది ప్రజలను ఆకర్షిస్తున్న వటవృక్షం చూశాము. నాలుగువేల చదరపు అడుగుల వైశాల్యాన్ని ఆక్రమించిన ఆ వృక్షం ఉత్తర దక్షిణాలుగా 220 అడుగులూ, ప్రాక్పశ్చిమాలుగా 205 అడుగులూ వ్యాపించింది ఆ నాటి కానాడు అనేక పిల్లఊడలను పెడుతూ అభివృద్ధి చెందుతున్న ఆ తరుచ్ఛాయలో కొంతసేపు విశ్రమించి సుఖశాంతులు పొందాము. అక్కడ నుంచి ప్రసిద్ధమైన ప్రభుత్వ మ్యూజియంకు వెళ్లి అనేక వినోదవిషయాలను తెలుసుకున్నాము. మధ్యాహ్నం జంతు ప్రదర్శనశాల, మూర్‌మార్కెటు చూశాము. రాత్రి చలనచిత్ర కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆ సుందర విశాల నగర వైభవం మాలో కొత్త ఆనందాన్ని ప్రజ్వరిల్లజేసింది.

29 వ తేదీ ప్రత్యూషవేళ బయలుదేరి కాంచీపురం వచ్చాము. దక్షిణకాశిగా ప్రఖ్యాతిచెందిన దివ్యస్థలం కంచిలో కైలాసనాథస్వామి ఆలయం, ఏకాంబరేశ్వరస్వామి దేవాలయం, వరదరాజస్వామి గుడి, వామనమూర్తి ఆలయం దర్శించి, జీవశక్తి తొణికిసలాడుతున్న అక్కడి శిల్పాలకు ముగ్ధులమయ్యాము. ఆ పట్టణంలోను పరిసరాలలోను తయారుచేయబడ్డ నాణ్యమైన పట్టు చీరలను కొందరు కొన్నారు. భోజనాలు అయిన వెంటనే తిరుపతికి బయలు దేరాము. దేశం దశ దిశల నుంచీ నిరంతరం నిరంతరాయంగా వేలాది భక్తజనులను ఆకర్షించి, వారిని శ్రీ వెంకటేశ్వరస్వామి వాత్సల్యానుగ్రహాలకు పాత్రులను చేసే పవిత్రక్షేత్రం తిరుపతిలో మా బస్సు దిగి, దేవస్థానం వారి బస్సులో తూర్పు కనుమలుగా ప్రసిద్ధి గాంచిన పర్వత శ్రేణిలో మధ్యభాగము ఆక్రమించి, మానవుడి ఆత్మోన్నతిని, భగవంతుని చిద్విలాసాన్ని వర్ణించే ఉత్తమ శృంగాలుగా వెలసిన కొండలను దాటుతూ తిరుమల వెళ్ళాము అక్కడ దేవస్థానం వారు సకల సౌకర్యాలతో నిర్మించిన కుటీరాలలో బస చేశాము. తెల్లవారక ముందే నిద్రనుంచి లేచి స్నానాలు చేసుకుని, సుప్రభాత దర్శనార్థం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లాము. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వరస్వామికి మేమందరం భక్తి తాత్పర్యాలతో నమస్కరించాము. అనునిత్యం వేలాదిగా విచ్చేస్తున్న యాత్రికులకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు కలగజేస్తున్న సముచిత సదుపాయాలకు అంతా ఆనందం వ్యక్తపరచారు తరువాత తిరుపతి వచ్చి జనసంబంధ శాఖకు చెందిన యాత్రిక విశ్రాంతి గృహం "పర్వత దృశ్యం" లో అంతకు ముందు రోజు విడిచిపెట్టిన సామాను మా బస్సులో వేసుకుని తిరుచానూరు వెళ్లాము అక్కడ పద్మావతీ అమ్మవారి దర్శనానంతరం మళ్ళీ తిరుపతి చేరి భోజనకార్యక్రమం పూర్తి చేసుకుని విజయవాడ వైపుకు ప్రయాణం సాగించాము 22 మైళ్లలో వున్న పవిత్రమైన శైవక్షేత్రం కాళహస్తిలో ఈశ్వరారాధన సలిపి అర్ధరాత్రి వేళకు విజయవాడ చేరుకున్నాము. మా బృందంలో రమారమి సగము మంది మాకు హృదయపూర్వకమైన వీడ్కోలు యిచ్చి అక్కడే ఆగిపోయారు. 31 వ తేదీ ఉదయం 9 గంటలకు హైదరాబాదులో జనసంబంధశాఖ కార్యాలయం వద్ద బస్సు దిగి గృహాభిముఖులమయ్యాము.

సరస మధుర సంభాషణలతో, సంఘీభావంతో సాగిన దక్షిణదేశ యాత్ర ప్రశాంత సుందరమై, ప్రమోదభరితమై మా స్మృతిపథాలలో చిరకాలం మసలే మధురానుభూతులు ప్రసాదించింది.

*

## యాత్రల ప్రాముఖ్యత

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ జన సంబంధ శాఖ నిర్వహించిన యాత్ర యొక్క ముఖ్య ఆశయం నెరవేరింది. వివిధ ప్రదేశాలను గురించీ, ప్రజల ఆర్థిక రాజకీయ పరిస్థితులను గురించీ 15 రోజుల స్వల్ప వ్యవధిలో తెలుసుకునే అవకాశం కలిగింది. ఈ సందర్భంలో ప్రభుత్వ సిబ్బంది తీసుకున్న శ్రమ ప్రశంసనీయమైనది. బుద్బుదప్రాయమైన జీవితంలో మానవుడు అనేక ప్రాంతాలను తిలకించి, పులకించాలని నా అభిప్రాయం. ఇటువంటి యాత్రలు అందుకు దోహదం చేస్తాయనడంలో సందేహం లేదు

డి వి వి సూర్యనారాయణ
సర్పంచ్, తంటికొండ
రాజమండ్రి తాలుకా, తూర్పుగోదావరి జిల్లా.

## పర్యటనలకు జనసంబంధశాఖ ప్రోత్సాహం

జనసంబంధశాఖ నిర్వహణలో దక్షిణ భారత దేశయాత్ర మే నెల 16 వ తేదీని హైద్రాబాదులో ప్రారంభించబడి 16 రోజుల పాటు జయప్రదంగా జరిగింది ఈ యాత్రలో చారిత్రక ప్రదేశాలు, శిల్ప కళా విలసిత దేవాలయాలు వినోద కేంద్రాలు ఎన్నో సందర్శించాము వివిధ ప్రాంతాలనుంచి ఈ యాత్రలో పాల్గొన్న వారికి అవసరమైన సౌకర్యాలు చక్కగా ఏర్పాటు చేయబడ్డాయి. ఈ యాత్రవల్ల విజ్ఞానం, వినోదం ఇతోధికంగా సముపార్జించుకున్నాము. ఇది సుఖప్రదంగా, ఆనందదాయకంగా జరిగినందుకు సంతోషిస్తున్నాము ఇటువంటియాత్రలను మరికొన్నిటిని నిర్వహించి జనసంబంధశాఖ వారు ప్రజలకు సౌకర్యం కలుగ జేయాలని నా మనవి

బి ఎస్. రామచంద్రమూర్తి
వడ్డె గూడెం, భద్రాచలం తాలుకా.

## మరికొన్ని యాత్రల నిర్వహణకు జనసంబంధ శాఖ పూనుకోవాలి

యాత్రలు అనేవి మన భారతదేశానికి కొత్తవేమీకావు. ప్రభుత్వ నిర్వహణలో ఏర్పాటైన దక్షిణ భారతదేశ యాత్రలో అనేక చారిత్రిక ప్రదేశాలు, దేవాలయాలు, వేసవి వినోద కేంద్రాలు సందర్శించాము. ఏ విధమైన అసౌకర్యాలు జరుగకుండా ఎంతో నేర్పుతో యాత్రను నిర్వహించినందుకు జనసంబంధశాఖ వారు అభినందనీయులు. ఇటువంటి యాత్రలను ఇతోధికంగా నిర్వహించి, ప్రజలకు పలుప్రాంతాలను చూచే వీలు కలిగించాలని నా ప్రార్థన.

ఎం. సాంబమూర్తి రెడ్డి
సర్పంచ్, ఓబుళం, కడప జిల్లా.

## విజ్ఞానాభివృద్ధికి విలాస యాత్రలు

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ జనసంబంధశాఖ వారిచే నిర్వహించబడ్డ దక్షిణ భారత దేశయాత్రలో అనేక పుణ్య క్షేత్రాలు, విజ్ఞాన కేంద్రాలు, వేసవి విశ్రాంతి ప్రదేశాలు దర్శించి అమితమైన ఆనందం పొందాము. నిర్ణీత కార్యక్రమం ప్రకారం క్షేత్రాటనం చేయడంలోను, నిర్దిష్ట సమయాలలో భోజనాది సౌకర్యాలు సమకూర్చడంలోను ప్రజ్ఞను ప్రదర్శించిన జనసంబంధశాఖ ఉద్యోగులు "ప్రజా సేవయే ప్రభుత్వాధికారుల కర్తవ్యం" అన్న భారత ప్రియతమ నాయకుడు శ్రీ నెహ్రూజీ ఉవాచకు అనుగుణంగా ప్రవర్తించినందుకు వారికి నా ప్రత్యేకాభినందనలు. మున్ముందు కూడా యిటువంటి ప్రజోపయోగకరమైన కార్యక్రమాలను నిర్వహించి ప్రజల విజ్ఞాన వికాసానికి తోడ్పడవలసిందని జనసంబంధశాఖ వారిని ప్రత్యేకంగా కోరుతున్నాను.

గొందేశి ముసలయ్యరెడ్డి
సర్పంచ్, రేకపల్లి
భద్రాచలం తాలుకా, ఖమ్మం జిల్లా

## జయప్రదమైన దక్షిణ భారతదేశ యాత్ర

ఇటీవల మన రాష్ట్ర ప్రభుత్వ జనసంబంధశాఖ యాత్రికుల సౌకర్యార్థం నిర్వహించిన దక్షిణ భారత దేశ యాత్రలో పాల్గొనే అవకాశం కలిగినందుకు ఎంతో సంతోషిస్తున్నాను. వివిధ యాత్రిక స్థలాల సందర్శనలోను, భోజనాది సౌకర్యాల ఏర్పాటులోను ప్రత్యేక శ్రద్ధాసక్తులు ప్రదర్శించిన ప్రభుత్వోద్యోగులను ప్రశంసించక తప్పదు. పర్యటన సర్వ విధాల సుఖ సంతోషాలను కలిగించడమే కాకుండా విజ్ఞానాభివృద్ధికి అపారంగా తోడ్పడింది. ఇదేవిధంగా యితర ప్రాంతాలను దర్శించే అవకాశం కలుగచేయవలసిందిగా జనసంబంధశాఖ వారిని కోరుతున్నాను. అనేక ప్రాంతాలను స్థిమితంగా చూడడానికి అనువుగా పర్యటన కాలాన్ని పెంచవలసిందని కోరుతున్నాను.

కాటా సీతారామయ్య
అధ్యక్షుడు, సహకార పరపతి సంఘం,
కూనవరం, ఖమ్మం జిల్లా.


## జరిగిన కథ

పార్థసారథికి నాటకాలపిచ్చి. రాఘవ నాట్యకళామండలి ద్వారా నాటకాలు వేస్తూండేవాడు.

ఏలూరునుండి హీరోయిన్ సరోజతోకలసి మద్రాస్ వెళ్ళి సరదాగా కాలంగడిపి పార్థసారథి తిరిగి యిల్లుచేరుకున్నాడు. జబ్బుతోవున్న పార్థసారథి భార్య విజయలక్ష్మిని పరామర్శించడానికి వచ్చిన కృష్ణమూర్తి ఏ విధంగానైన సరోజ మోసాన్నిగూర్చి పార్థసారథికిచెప్పి విజయలక్ష్మి కాపురం నిలబెట్టాలను కున్నాడు. కృష్ణమూర్తి మాటలకు పార్థసారథి లెక్కచేయలేదు. విజయలక్ష్మి అన్నీ ఆలోచించి ఎలాగో బాధ భరించి ఊరుకొనడమే మంచిదని తీర్మానించుకొంది. సరోజ యింటికి వెళ్లిన పార్థసారధికి, ఆమె తమ మద్రాసు ట్రిప్పుగూర్చి రహస్యంగా వుంచాలన్నవిషయం అనుమానం కలిగించింది కృష్ణమూర్తి మాటలుగుర్తుకొచ్చాయి. అయితే కాసేపట్లోనే మళ్ళీ అది నీలాపనిందగా భావించుకొని సరోజతో మామూలు ధోరణిలో మాట్లాడ సాగాడు.

# గ్రహణ

## పిలకా గణపతిశాస్త్రి



"నువ్విప్పుడు నాకొక ఉపకారం చేసిపెట్టాలి" అన్నాడు పార్థసారథి సరోజతో. "ఏమిటది" సరోజ ఎంటీ అంటనట్టుగా అడిగింది

'చేస్తానంటే చెబుతాను'

'అలాగేచేస్తానులెండి ! ఇంతకి ఏమిటది ?' సరోజ సన్నగా బొమముడి విరిచింది. పార్థసారథి తన వ్యవహారం చల్లగా బయటపెట్టాడు

'ఏమీలేదు పాపం గుప్త ఈవేళ మళ్ళీ ఉత్తరం రాశాడు' మన నాటకానికి ఎక్కడ ఏవిధమయిన లోపమురాకుండా పూతిక పుల్ల దగ్గిరనించి కావలసినవన్నీ జాగ్రత్త పెట్టాలని, అన్ని ఏర్పాట్లు పూర్తిగా చెయ్యాలని ఆలోచిస్తున్నాడు. కాస్త నాలుగయిదు రోజులు ముందుగానే ఏలూరు రమ్మని ఉత్తరం రాశాడు. నేను ఎల్లుండి బయలుదేరి వెడుతున్నాను. నువ్వు మిగిలిన వాళ్ళతో ఎలాగో అలాగ ఇంకొకసారి రిహార్సల్ జరిపించి, అందరిని వెంట పెట్టుకొని 21వ తారీఖు ఉదయానికల్లా ఏలూరువచ్చి వెయ్యాలి. ఇదీ నువ్వు నాకు చెయ్యవలసిన ఉపకారం'

'అలాగే వస్తాను దానికేమిటి ? కాని నా ఒక్కతివల్ల ఇవన్నీ ఎలాగ జరుగుతాయి !...... కాస్త రాఘవగారితో కూడా చెప్పండి ! ఆడదాన్ని. నామాటవిని వాళ్ళందరు ఒక్క తాటిమీద నడుస్తారా ?'

మొత్తంమీద సరోజ నీళ్ల నమిలింది. పార్థసారధి రవంత సేపాలోచించాడు. 'రాఘవతోకూడా చెబుతానులే ! ఈ బరువంతా నీ ఒక్కత్తి మీద పడవెయ్యదంలేదులే ! ఆపైన వాళ్ళందరు కాస్సేపట్లో ఇక్కడికే వస్తున్నారుగా ! అప్పుడు ప్రత్యేకించి వాళ్ళందరితోనుకూడా చెబుతానులే ! అయినా నువ్వుకాస్త శ్రద్ధపట్టి పని చెయ్యకపోతేమాత్రం మాటదక్కదు. తెలిసిందా?'

"ఏమోబాబూ, ఈ లేనిపోని పూచీలన్నీ నామీద పెట్టకండి. ఇవన్నీ రాఘవగారికి అప్పజెప్పండి. మేమందరము ఆయన ఎప్పుడు రిహార్సల్ జరపమంటే అప్పుడు జరుపుతాము. ఏ క్షణంలో బయలుదేరమంటే ఆక్షణంలో బయలుదేరుతాము. సరికదా !'

సరోజ బుంగమూతితో పెడముఖం పెట్టుకుని కూర్చుంది. పార్థసారథి క్షణకాలం మౌనంవహించి నవ్వుముఖంతో బుజ్జగించాడు

'నువ్వు నేను చెప్పిన వేవి తిన్నగా వినిపించుకోలేదు. ఈ పూచీలన్నీ నీమీద పెట్టకంలేదు ! అనవసరంగా కంగారుపడకు;

కాస్త మన ఆడమేళాన్ని వేళకి ప్రయాణం చేయించి వెంటబెట్టుకొని రమ్మంటున్నాను అంతే! ఇంతకన్న నీమీద పెద్ద బరువు లేవి మోపదంలేదు! తెలిసిందా?'

'ఓ! ఇదా మీరు చెప్పింది. దీనికేం? ఈ మాత్రం చెయలేగలను లెండి! అయినా వాళ్లందరు ఇప్పుడిక్కడికి వస్తున్నారుగా! కాస్త రాఘవగారితోను వాళ్లతోనుకూడా రిహార్సల్ సంగతి. ప్రయాణం సంగతి ఒకసారి చెప్పి మరీ వెళ్లండి! ఆపైన నాపని బాగా తేలికవుతుంది...... ... అదేమిటి? పళ్లెంలో పెట్టి నవన్నీ అలాగే ఉంచివేశారేమిటి? కాస్త ముందు ఫలహారం కానివ్వండి! ఈ గొడవలన్నీ ఆ తరువాత చూసుకుందాము. వాళ్లందరు వచ్చే వేళయింది!'

ప్రత్యేకించి నటీనటులందరితోనుకూడా చెప్పగలనని పార్థసారథి అంగీకరించాడు. ఫలహారం కానీయవలసినదని సరోజ తిరిగి బలవంతపెట్టింది. కాదనలేక పళ్లెంలో జిలేబీ ఒకటి నోటపెట్టుకున్నాడు.

'ఇవ్వన్నీ ఇంట్లోనే తయారుచేశావా? లేక బజారునించి తెప్పించావా? '

'ఈవేళ అందరు రిహార్సలుకి వస్తున్నారు కదాని మా అమ్మా నేను ప్రత్యేకంగా తయారుచేశాము బాగా ఉన్నాయా?'

'అలాగ చెప్పుమరి! నేను మొదటనే అనుకున్నాలే! ఇది బజారు సరుకు కాదని; అయితే ఊరికే యాధా లాభంగా అడగాలని అడిగాను. అంతే! చాలా బాగున్నాయి!"

పార్థసారథి తిరిగి ఇంకొక జిలేబి నోట పెట్టుకున్నాడు.

'మీకన్నీ అనుమానాలే! అయినా యాధా లా భం గా నే అడుగుతూంటారు. ఈ మధ్యన ఈ ధోరణి ఒకటి కొత్తగా అలవాటయినట్టుంది."

సరోజ మంద్రమధుర కంఠస్వరంతో కిలకిల నవ్వింది. ఆమె తానన్నమాటకొక వింతయిన కొత్త అర్థం కల్పించినదని క్షణంలో గ్రహించుకున్న పార్థసారథి ఆమె చాకచక్యానికెంతో మురిసిపోయాడు.

'ఉండి ఉండి గట్టి దెబ్బ కొట్టావులే! నీచేతిలో చిత్తయి పోయానని ఒప్పుకుంటున్నాను జితోస్మి! శరణు! శరణు!"

ఆ అభినయనం గమనించి ఆమె మరింతగా కిలకిల నవ్వింది. అదే సమయంలో రాఘవ, వెంకటనారాయణ మొదలయిన నటులందరు చరచరా మేడమెట్లెక్కి పైకి వచ్చారు. సరోజ పార్థసారథి వారందరిని ఉట్టిపడుతున్న అభిమానంతో ఆహ్వానించారు. వారొక్కొక్కరిని కుర్చీలలో కూర్చోమని ఎంతో ఆదరంగా ఫలహారాలందించింది సరోజ. ఫలహారాలందించడం ముగిసిన పిమ్మట పార్థసారథి ఏలూరు నాటకం వివరాలన్నీ సవిస్తరంగా వారికి తెలియజేశాడు.

ఆనాడు వారందరు ఇనుమడించిన ఉల్లాసంతో తాము ప్రదర్శించబోయే నాటకాన్ని గురించి అనేక విధాల ముచ్చటించుకున్నారు. ఇంచుమించుగా అందరు హాజరయ్యారు. ఒక్క మిత్రవిందవేషధారిణి పూర్ణ మాత్రమే సమయాని కందుకోలేక పోయింది. అయినవారందరు నాటకంలో తమ తమ భాగాలన్నీ జాగ్రత్తగా అభినయిస్తూ ఏకరువు పెట్టారు. మధ్య మధ్యన ఛలోక్తులతో, కలకల నవ్వులతో మొత్తం మ్మీద రిహార్సలంతా సుమారు రెండు మూడు గంటలలోనే ముగిసింది

రంగాలంకరణలు, హాలులో ఏర్పాట్లు మొదలయిన వ్యవహారాల పరిశీలన కోసంఅక్టోబరు 19వ తేదీ సాయంకాలానికే తాను మున్ముందుగా ఏలూరు వెళ్ళబోతున్నట్టు పార్థసారథి వారికందరికి వెల్లడించాడు. అందరు కలిసి 21వ తేదీ ఉదయానికయినా తప్పకుండా ఏలూరు చేరుకుని తీరాలని తిరిగి తిరిగి హెచ్చరించాడు. కొత్త రంగు దీపాల వెలుగులతో నాటకం బ్రహ్మాండంగా రక్తి కట్టగలదని ఏలూరులో ప్రేక్షకులందరు ఎదురు చూస్తున్నారన్నాడు.

తానక్కడ ఉండకపోయినా, రాఘవతో సరోజతో కలిసి అందరు ఇంకొక్క మారయిన స్టేజిమీద రిహార్సలు జరపక తప్పదని తిరిగి హెచ్చరించాడు. ఏలూరులో నాటకం మాట దక్కించిన పక్షంలో గుప్త వారికందరికి యథాశక్తిగా బహుమానాలివ్వబోతున్న సంగతి కూడా బయటపెట్టాడు. అయితే సరోజకు, తనకు బహూకరించబోతున్న బంగారు పతకాల సంగతి మాత్రం బయట పెట్టలేదు ఆ పైన అది నెమ్మదిగా రాఘవచెవిని వేయవచ్చునని అనుకున్నాడు.

అప్పటి కించు మించుగా రాత్రి ఏడున్నర గంటలయింది. నటీనటులు ఒకరొకరే సరోజా పార్థసారథుల దగ్గిర సెలవు తీసుకుని తమ తమ ఇళ్ళకు జారుకున్నారు. రాఘవకూడా వారిద్దరితోను చెప్పి బయలుదేరబోయాడు. 'ఇదిగో నేను కూడా వస్తున్నాను' అని చెప్పి పార్థసారథి అతని వెంట వెళ్ళాడు.

రాఘవ ఆ వేళ ఎందుచేతనో తనతోబాగా ముభావంగా ఉన్నాడని పార్థసారథి కనిపెట్టాడు. దాని కేమి కారణమో అతని కెంతగా ఆలోచించినా బోధపడలేదు. అయినా దారిలో యాధాలాభంగా ఏదో ప్రస్తావన ప్రారంభించి కొంచం కదిపి చూశాడు. రాఘవ యథాప్రకారంగా కులాసాగానే సమాధానం చెప్పాడు. దానితో పార్థసారథికి తనకి కలిగినది వట్టి అపోహ అన్న నమ్మిక కలిగింది. ఇద్దరు అలాగే కబుర్లు చెప్పుకుంటూ నడిచివెళ్ళి రాఘవ ఇంట్లో హాలులో కుర్చీలలో ఒకరికొకరు ఎదురుగా కూర్చున్నారు.

రాఘవ సిగరెట్టు ముట్టించి రెండుమూడు దమ్ములలాగి పొగ వదులుతూ కొంత జిజ్ఞాసతో పార్థసారథి వైపు చూశాడు.

'ఏమిటయ్యా! విశేషాలు ?'

'కొత్తవిశేషాలేమి ఉన్నాయి అన్ని పాతవే! ఏలూరులో మాట దక్కించుకుని బయట పడడం ఎలాగా అని ఆలోచిస్తున్నాను అంతే!'

పార్థసారథి రెండు మూడు నిమిషాలవరకు తన ప్రసంగం అదే ధోరణిలో కొనసాగనిచ్చి చల్లచల్లగా బంగారు పతకాల బహూకరణ సంగతి బయటపెట్టాడు. రాఘవ క్షణకాలం మౌనం వహించి పైపైకి అతవినెంతో అభిమానంతో అభినందించాడు. ఏలూరు నాటకంవల్ల తనకందవలసిన బహుమతి సంగతి తేల లేదని అతడంతకుముసుపే కొంత మధనపడుతున్నాడు. పతకాల వ్యవహారం వినగానే అది మరింతగా అతని మనస్సులో అసూయా అక్కసుని రేకెత్తించింది. అయినా రాఘవ ఎక్కడా చెక్కు చెదరలేదు. అపైన పార్థసారథి తన మనస్సులో ఆందోళన కలిగిస్తున్న వ్యవహారం నెమ్మదిగా బయటపెట్టాడు.

'ఈ మధ్యన నేను ఊళ్లో లేకపోవడం మూలాన రిహార్సల్స్ జరగవలసినన్ని జరగలేదయ్యా! ఈ వేళకూడా బాగా జరిగినట్టు లేదు. నాకేదో అంతా అదరాబాదరాగా నడిచినట్టుంది! గుప్త కొంచం ముందుగా రాకతప్పదని బలవంతం చేస్తున్నాడు. అందు చేత నేను కొంచం ముందుగానే ఏలూరు వెడుతున్నాను కాస్త నువ్వు నడుంకట్టుకుని మనవాళ్ళందరిచేత స్టేజి రిహార్సల్ జరిపించాలి. ఆ పైన అందరిని వెంటబెట్టుకుని అథమం 21 వ తేదీ ఉదయానికయినా ఏలూరు చేరుకోవాలి ఈ ఒక్క మాటు నువ్వు కొంచెం శ్రమపడక తప్పదు".

రాఘవ తిరిగి ఇంకొక సిగరెట్టు ముట్టించి, నెమ్మదిగా దమ్ములాగి రవంత సేపాలోచించాడు.

'సరేలే గాని ఇంతకి నువ్వు ఎప్పుడు బయలు దేరు తున్నావు?'

'19 వ తేదీ మధ్యాహ్నానికయినా అక్కడికి వెడదామని అనుకుంటున్నాను. అదిగానికుదరకపోతే రాత్రికి తప్పదు'

రాఘవమరి మాట్లాడలేదు. అలాగ ఏడెనిమిది క్షణాలు గడిచాయి. అతడు తిరిగి గట్టిగా ఇంకొక దమ్ముపీల్చి సిగరెట్టు ట్రేలో పారవేసి వెనక్కి చేర్లబడి కూర్చుని ఆవలించాడు. అతని ముఖభావము, తటస్థ వైఖరి పార్థసారథి కెంతో ఆందోళన కలిగించాయి. అయినా నెమ్మదిగా అడిగాడు.

'ఏమిటలాగ ఆలోచిస్తున్నావు?'

'ఏమీలేదు! ఈ కోతుల మూకని కూడగట్టుకొని స్టేజీమీద రిహార్సల్ నడిపించడం ఎలాగా అని ఆలోచిస్తున్నాను. అంతే!'

'నీ పేరే రాఘవ! కోతుల మూకని కూడగట్టుకోవడం నీ కల వాటే! మరి దీనికింత ఆలోచన ఎందుకు?'

పార్థసారథి నవ్వుతూ ఒక ఛలోక్తి విసిరాడు. అయినా రాఘవ రవంతయినా నవ్వలేదు! నాటకాల వ్యవహారాలు అతడు అంతకు ముసు పెన్నడు అంత నిర్లిప్తంగా తన కేమి పట్టనట్టు మాట్లాడలేదు.! లోలోపల చెలరేగుతున్న ఆందోళనతో పార్థసారథి తిరిగి బ్రతిమాలుకున్నాడు.

'రాఘవా! నువ్వుకూడా ఇలాగ మాట్లాడ కూరుకుంటే ఇక నేనేమి చెప్పగలను? ఏలాగో అలాగు యీ ఒక్కసారి శ్రమ పడక తప్పదు! ఖర్చుల కోసం నువ్వేమి ఆలోచించ నక్కరలేదు. కావలిసినంత సరోజ నడిగి తీసుకో! అథమం ఇంకొక సారి అయినా రిహార్సల్ జరగక పోతే మాట దక్కదేమో అని భయ పడుతున్నాను. లేకపోతే నిన్నింత ఇబ్బంది పెట్టను!'

'సరేలే! ఎలాగో అలాగ తంటాలు పడతానులే! కొంచం సరోజతో కూడా చెప్పలేక పోయావా?'

'ఆ! చెప్పాను. సరే అంది, కాని సరోజ ఒకతి వల్ల ఏమవుతుంది! కాస్త మనవాళ్ళందరిని కూడగట్టుకుని ఏలూరు తీసుకువచ్చే భారం కూడా నీమీద పెడుతున్నాను. నేనిక్కడ ఉంటే మిమ్మల్ని ఇంత శ్రమ పెట్టను! నువ్వు గట్టిగా కలగ జేసుకోక తప్పదు. దీనితో మన రాఘవ నాట్యకళా మండలి పేరు దేశంలో నాలుగు మూలల హోరుమని మారుమోగి పోవాలి! తెలిసిందా?'

'ఏమో! ఏంమోగిపోతుందో! రిహార్సల్ మాటకేంగాని వీళ్ళందరిని వెంటబెట్టుకుని వచ్చేపని మాత్రం నామీద పెట్టవద్దు! నాకు వేరే అత్యవసరమయిన పని ఒకటి వచ్చిపడింది. బాబ్జాబు కొంచెం వెంకటనారాయణతో చెబుదూ?'.

ఆ నిరాదరణగమనించి పార్థసారథి మరింతగా ఆందోళన పడ్డాడు. ఇన్నాళ్లనుంచి కృష్ణతులాభారాని కామాత్రం పేరువచ్చిం దంటే దానికి ప్రదర్శనాలలో జరిగిన గట్టిఏర్పాట్లే ప్రధాన కారణం. ఇంతకుముసుపావ్యవహారాలలో రాఘవచాలా అభినివేశంతో పనిచేశాడు. అందులోను రిహార్సల్స్ ఎంత ఎక్కువ జరిగితే అంత మంచిదని అంతకుముసుపు అనేక పర్యాయాలు హెచ్చరించాడు. తానే అందరిని కూడ గట్టుకుని చాలా సారులవి జరిపించాడు. లేకపోతే తన పేరుతో ప్రసిద్ధికెక్కిన మండలి అప్రతిష్ఠపాలై పోగలదని ఆందోళన పడ్డాడు. ఎప్పుడైన అవసరమైనప్పుడు మండలి నటీనటుల పైఊళ్ల ప్రయాణాల గొడవలన్ని అడగకుండానే తన నెత్తిమీద వేసుకున్నాడు. అటువంటి వాడీనాడు ఎందుచేత ఇలాగ తనకేమి పట్టనట్టు మాట్లాడుతున్నాడు పార్థసారథి రవంత సేపాలోచించి ఆందోళన తొణికిసలాడుతున్న ఆర్ద్ర స్వరంతో తిరిగి బతిమాలుకున్నాడు.

'రాఘవా! ఎందుకిలాగ నిరుత్సాహంగా మాట్లాడుతున్నావు! ఇన్నాళ్లనించి మన మండలికేమైనా పేరువచ్చిందంటే అది నీ మూలానే! ఏలూరులో మంచిపేరు తెచ్చుకుంటే మనం మిగిలిన ఊళ్లకికూడ వెళ్లవచ్చును! అక్కడ కనక దెబ్బతిన్నామంటే మళ్లా తేరుకోవడం చాలా కష్టం! ఏలూరులో మాటదక్కి తీరుతుందనే నా నమ్మకం! దానికినువ్వు గట్టిగా నడుంబిగించి పనిచెయ్యాలి. పాపం గుప్త చాలా ఉత్సాహంగా పనిచేస్తున్నాడు. మొట్టమొదట అను కోకపోయినా నాటకం రక్తి కట్టిందంటే అందరికి యథాశక్తిగా బహుమానాలు కూడ ఇస్తానంటున్నాడు. వాళ్లందరికన్నా నీ కింకా మంచి బహుమానం ఇవ్వాలని గట్టిగా చెప్పాను! సరే అన్నాడు...."

అంతలోనే విపరీతమైన విసుగుదలతో రాఘవ అకస్మాత్తుగా అందుకున్నాడు.

'అదేమిటి సారథీ! అలాగమాట్లాడుతున్నావు! నేనెప్పుడయినా బహుమానాల సంగతి గాని సొమ్ము మాటగాని నీ ఎదట ఎత్తానా? అసలా మాట ఎప్పుడయినా ఆలోచించానా? ఇప్పుడేదో తొందరపని ఒకటి వచ్చి పడింది కాని లేకపోతే ప్రత్యేకించి ఇన్ని విధాల నువ్వు నాతో చెప్పాలా! అదీ ఇదీ సర్దుబాటు చేసుకోవడం ఎలాగా అని తటపటాయిస్తున్నాను. అంతే!'

'ఏమిటాపని?'

పార్థసారథి మరింత ఆత్రతతో ప్రశ్నించాడు.

"ఏమీ లేదు నిలుచున్న పాటుగా కాకినాడ వెళ్ళవలసిన అర్జంటు పని ఒకటి నెత్తిమీద పడింది! దానిసంగతి ఎలాగా? అని ఆలోచిస్తున్నాను. ఏమి పాలుపోవడం లేదు"

'పోనీ ఆ వ్యవహారం మనము నాటకం అయినతరువాత చూసుకోకూడదా?'

'ఆ మాత్రం అవకాశం ఉంటే నీచేత ఇన్నిసార్లు అడిగించుకుంటానా? నాకామాత్రం బాధ్యత తెలియదూ?'

పార్థసారథి మనస్సులో ఆందోళన, ఆత్రత మరింతగా ఎక్కువయ్యాయి. అయితే రాఘవ ఎందుచేతనో బాగా బెట్టుసరి చేస్తున్నాడని పసికట్టాడు. కాకినాడ వెళ్ళవలసిన పని ఎలాగయినా వాయిదా వెయ్యక తప్పదని తిరిగి ప్రతిమాలుకున్నాడు నాటకం అంతా అనుకున్నట్టు సవ్యంగా సాగిపోతే ప్రత్యేకించి అతని కొక బంగారు పతకం ఇచ్చేటట్టు ఏర్పాటు చేయించగలనని గట్టిగా మాట ఇచ్చాడు. ఒకవేళ గుప్త దాని కంగీకరించకపోతే ఆ సొమ్ము తానే ఇచ్చుకోగలనని వాగ్దానం చేశాడు. రిహార్సల్ సంగతి, ప్రయాణాల వ్యవహారము పైన వేసుకోక తప్పదని పట్టుపట్టాడు.

రాఘవ ఎట్టకేల కతికష్టంమీద కాకినాడపని వేరొకరి కప్పగించి నాటకం వ్యవహారాలన్ని పూర్తిగా తనమీద వేసుకోడాని కంగీకరించాడు అంతేకాదు ఈసారి నాటకం మరింత చక్కగా రక్తికట్టేటట్టు చూడగలననికూడా మాట ఇచ్చాడు దానితో సారథికి పంచ ప్రాణాలు తిరిగి లేచి వచ్చాయి!

వెంటనేవెళ్ళి ఆ వృత్తాంతం అంతా సరోజ చెవినివేశాడు ఆమెకూడా శాయశక్తులా రాఘవ కన్నివిధాల సాయపడగలనని మాటఇచ్చింది కాని పార్థసారథి మనస్సులోమాత్రం ఏలూరు నాటకాని కడుగడుగునా అడ్డంకులే ఎదురు పడుతున్నాయని ఆందోళన కలిగింది. ఆ గజిబిజి ఆలోచనలతో, వేదనతో అతడింటికి చేరుకునేసరికి ఇంచుమించుగా రాత్రి పన్నెండు గంటలయింది!

(సశేషం)

---

(35 వ పుటనుండి)

పన్నులు వేయమనడంలో వీరి ఆలోచనంతా పెద్ద పెట్టుబడిదారుల రక్షణకు సహాయపడే విధంగా వుందనవలసి వస్తుంది అందుకు జవాబుగా వెంటనే ముగ్గురు, ముఖ్యమంత్రులు, గ్రామసీమల ప్రజలపై పన్నుభారం యిక్కడికే చరమస్థాయి అందుకున్నదని ఇక మోయలేరని అనడం జరిగింది

అయితే గుత్తవ్యాపారుల విషయంలో ఎవరన్నా ఏమన్నా అనుకుంటారేమోనని అందుకు విరుగుడుగా రానున్న గుత్త వ్యాపారుల నిషేధ చట్టాన్ని అమలుజరపాలెనన్నారు.

దీనిని ప్రజానీకం త్రిప్పికొట్టాలి. రాష్ట్రాల హెచ్చుతగ్గులను సమస్థితిలో పెట్టగల విధంగా సోషలిస్టు పురోగమనానికి మార్గగామిగా పరిశ్రమలు జాతీయ విధానానికి అనుగుణంగా, ధరల స్థిరీకరణ చేయగల విధంగా దేశసంపద పెరగడం మాత్రమే కాకుండా ఆ పెరిగిన దేశసంపద ఏ కొందరో ఆకట్టుకొనగలిగే విధంగా కాకుండా, అది సామాన్య మానవుని జీవన విధానంలో ప్రతిబింబించే విధంగా నాల్గవ ప్లాను తయారుచేయవలసివుంది. అందుకు శాస్త్రవేత్తలు, ఆర్థిక ప్రవీణులు, రాజకీయనాయకులు, సాంకేతిక నిపుణులు పునరాలోచన చేసి స్వయం సమృద్ధమగు భారత ఆర్థిక విధానాన్ని ప్రణాళికాబద్ధంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో నిర్వహించుటకు పూనుకోవాలె.

ఇదివరకు ప్లాను గమ్యం వ్యయంగా భావించారు. ఆ విధంగా అంచనాలు యోజనాలు సాగించారు అది తప్పు అని, ప్లానింగు ధ్యేయం ధర హెచ్చించడం కాదని, దాని ఫలితాలు ఉత్పత్తిలో అగుపడవలెనని, తీవ్రంగా విమర్శ వచ్చింది దానికి అనుగుణంగా ప్లాను ప్రాతిపదిక ఉత్పత్తులు ఎంత పెరగవలె, అందుకు ఎంత వ్యయం అవుతుంది, అని తలంచి అంచనా వేయడానికి బదులు శాతం ఒక్కమాట చెపితే సరిపోతుందా?

ప్లానింగు, పరిశ్రమ జాతీయాకరణ, సోషలిజం పండిత నెహ్రూతోనే నశించిపోయినవా అనిపిస్తుంది. రాష్ట్రాల అసమానతలను, మానవజీవితస్థాయిలో వున్న అసమానతలను సరిదిద్దే యోచనా భావనా రెండూ లేకుండా పోయినవి. ప్రజానీకం తీవ్రంగా ఆలోచించి పారిశ్రామిక జాతీయాకరణ, సోషలిస్టు పురోగమనాన్ని ధ్యేయంగా 4 వ ప్లానును రూపొందించేందుకు కృషి చేయవలసివుంది

ముఖచిత్ర కథ


## నూతన భవనంలో

# సాలార్ జంగ్ మ్యూజియం

డి. ఎస్. వర్మ

సాలార్ జంగ్ మ్యూజియంను 1968 జూన్ ఒకటవ తేదీ నుంచి తిరిగి తెరిచారు. పంథొమ్మిదో శతాబ్దపు ప్రాసాదం దివాన్ దేవిడీ నుంచి అధునాతనంగా నిర్మించిన నూతన భవనంలోకి సాలార్ జంగ్ మ్యూజియంలోని కళాఖండాలను తరలించేందుకై గత రెండు నెలలుగా దీనిని మూసి వుంచారు. ముూసీనది దక్షిణ వడ్డున ఈ నూతన సాలార్ జంగ్ మ్యూజియం వుంది.

పది ఎకరాల స్థలంలో నిర్మించిన యీ మ్యూజియం భవనానికి రూ. 40 లక్షలు ఖర్చయ్యింది. దీనిని, వెనక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్టేట్ ఆర్కిటెక్ట్ శ్రీ హస్మత్ రాజా రూపొందించారు. ఆయన మహారాష్ట్ర ప్రభుత్వ కన్సల్టింగ్ ఆర్కిటెక్ట్ స్వర్గీయ శ్రీ ఎం.కె. జాదవ్ సలహా సంప్రదింపులతో దీనిని రూపొందించారు. స్వర్గీయ నవాబ్ మీర్ యూసుఫ్ అలీఖాన్ సాలార్ జంగ్ III సేకరించిన వివిధ అపూర్వ వస్తుసంచయాన్ని ప్రదర్శించడానికి అవసరమయ్యే ప్రత్యేకపు ఏర్పాటులన్నీ ఈ భవనంలో ఉన్నాయి. ఈ భవన నిర్మాణపు పనిని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ వర్క్సుశాఖ చేపట్టి పూర్తిచేసింది.



సాలార్ జంగ్ మ్యూజియం నూతన భవనం

ఈ కొత్త మ్యూజియం ఆవరణలో విశాలమైన ఉద్యానవనం ఉంది. మ్యూజియంలోకి ప్రవేశించేచోట, వచ్చే ప్రేక్షకులకు స్వాగతంచెప్తూ అప్పుడే పచ్చటి తివాసీలాంటి గడ్డిమైదానం ఒకటి తయూరయ్యింది. మ్యూజియం లోపలకూడా అనేక చోట్ల పెరడులు ఉండి రంగురంగుల పూలతో స్వాగతమిస్తుంటాయి.

నూతనంగా నిర్మించిన సాలార్ జంగ్ మ్యూజియంలో క్రింది భాగంతోసహా మొత్తం నాలుగు అంతస్తులు ఉన్నాయి. దిగువ భాగంలో మొత్తం పదకొండు హాలులు, గదులు ఉన్నాయి. వీటిలో సాలార్ జంగ్ కాలానికి సంబంధించిన వస్తు సంచయము, ఫ్రెంచి దేశంనించి సేకరించిన వస్తువులు, యూరప్ నుంచి సేకరించిన వస్తువులు, పాశ్చాత్య చిత్రాలు, గడియారంగది, పాలరాతి విగ్రహాలు, కంచు విగ్రహాలు, యూరోపియన్ గ్లాసు వస్తువులు విడి విడిగా విభాగాలుగా వున్నాయి. అవిగాక పిల్లల విభాగం కూడా యిక్కడేవుంది. ఈ పిల్లల విభాగానికి ప్రవేశ రుసుము లేదు.

మొదటి అంతస్తులో పద్నాలుగు హాలులు, గదులు వున్నాయి. అందులో భారతీయ చిత్రాల విభాగం, దంతపువస్తువుల విభాగం, దక్షిణ భారతీయ వస్తువుల విభాగం, ఈజిప్టు వస్తు విభాగం, జేడ్ విభాగం, వస్త్రాలు-ఆభరణాల విభాగం, తివాసీల విభాగం, ఇండో-పర్షియన్ విభాగం, ఆయుధాల విభాగం, కాశ్మీరీ వస్తువిభాగం, బర్మా, నేపాల్, టిబెట్ వస్తువుల విభాగం, చైనా విభాగం, జపాన్ విభాగం ఉన్నాయి.

(తరువాయి 64 పుటలో)

# సాహితీ సదనం

## ముక్తకాలు

—మాదిరాజు రంగారావు

ఉదయం వెలుగుతో సూర్యుడు
రాత్రి చీకటిలో చంద్రుడు
వివృత, సంవృత రూపాలలో
సృష్టి వికాసం, పరివర్తనం.

ఒకచోటునుండి కదలలేరు కొందరు,
వారి శరీరం వారికే బరువు
వారి రాకడగాని పోకడగాని
ఇతరులపై ఏ ప్రభావమూ నెరపదు.

ఆగకు నడువు, ఆలోచనలతో ముందుకు
ఎదురు పడనీ వరుసగా పెనుచీకట్లు.
విచ్చుకొని వెలుగుకు దారులవే ఇస్తవి.
గమ్యం తెలినపుడు ఉన్నచోటే చాలు.

ముగిసిన కలవలె గతించింది రాత్రి
కలలు కనడంమాని మేల్కొన్నాడు మనిషి.
ఒక వలయంనుండి ముక్తమైంది మనస్సు
మరొక వలయంచే సంగ్రహితమైంది.

ఒకనాటికి తుది అవని గ్రంథం ప్రపంచం
చాలమంది చదవరు, కొందరు యత్నిస్తారు
అర్థమయిన వారిసంఖ్య బహుస్వల్పం
ఎవరేమన్నా ఎవరి ప్రపంచం వారిది.

నీలి మబ్బువలె క్రమ్మిన దుఃఖం వెనుక
చంద్రబింబంవలె దాగిన ఆనందం.
బ్రతుక్కి లేనొక నియమితమైన ఆకృతి
కలసివస్తే పుష్పశయ్య, లేకపోతే శరతల్పం.

రోజులు పక్షాలు ఋతువులు వత్సరాలు
పునః పునరావృత్తమౌ కాలచక్రం
కోపాలు ద్వేషాలు ఈర్ష్యలు కలహాలు
అవే ఊహలు చేష్టలు, అదే మనస్తత్వం

చావు జయింపబడదు, అందుకే అంతభయం.
గతం చచ్చినారాదు, అందుకే దురభిమానం.
మెలకువయే వర్తమానం, అందుకే అంత ఇష్టం
భవిష్యత్తు భద్రమైంది, అందుకే ఎంతో ఆశ. ☆

# గ్రంథసమీక్ష

## ఆంధ్ర మహోభ్యుదయము :

విద్వాన్ శ్రీ బండ్ల సుబ్రహ్మణ్యకవి ప్రణీతము :

వెల రూ. 5 లు. పేజీలు 74+138.

ప్రతులకు రచయిత, వేటపాలెం, బాపట్ల తాలూకా, గుంటూరు జిల్లా

ఇది 4 ప్రకరణములుగల ఆధునిక పద్యకావ్యము. ఆత్మార్పణచేత ఆంధ్రుల చిరకాల వాంఛితము నెరవేర్చి చరిత్రలో అమరుడై పురాణ పురుషశ్రేణి కెక్కిన శ్రీ పొట్టి శ్రీరాములుగారి ఆదర్శవంతమైన జీవిత చరిత్రను కవిగారు యీ పద్యకావ్యముగా తీర్చిదిద్దినారు. నాల్గవ ప్రకరణమున శ్రీరాములుగారి కల్యాణ మహోత్సవము వర్ణింపబడినది. అంటే ఇది సంకల్పిత కావ్యములో ప్రథమ భాగము మాత్రమే ఇంకా ఇటువంటి ఎన్ని భాగములు వ్రాసి జీవిత చరిత్రను పూర్తి చేయదలచినారో కవిగారు సూచించలేదు

ఈ కావ్యములో కీ॥ శే॥ కాశీ కృష్ణాచార్యులుగారి అభిప్రాయముతో ప్రారంభమై శ్రీయుతులు విశ్వనాధ సత్యనారాయణ, శివ శంకరస్వామి, నిడదవోలు వెంకటరావు, కోట సుందరరామ శర్మ, వడ్లమూడి గోపాల కృష్ణయ్య, దివాకర్ల వేంకటావధాని, సి. నారాయణరెడ్డి, తుమ్మల సీతారామమూర్తి, జమ్మలమడక మాధవరామశర్మ, జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి ప్రభృతులైన అనేక సంస్కృతాంధ్రాంగ్ల కవిపండితులు యిచ్చిన అభిప్రాయములు మొదటి 74 పేజీలో ఉన్నవి వీటి చివర కృతజ్ఞత పేరుతో కవిగారు ఒక సుదీర్ఘ రచనలో తమ అభిప్రాయాలు వెల్లడించినారు. నిజానికి మంచి కావ్యానికి ఎవరి అభిప్రాయాలు అక్కరలేదు కాని పండితాభిప్రాయాలు సేకరించి ప్రదర్శిస్తే కావ్యమునకు ఎక్కువ గౌరవం కలుగుతుందనే భ్రాంతి యింకా అనేకమంది రచయితలకు వున్నది కావ్యం ప్రారంభం కాకముందే యింత మంది అభిప్రాయాలు చదవాలంటే పాఠకుడికి విసుగా వుంటుందనే విషయం నిస్సందేహం ఒక రకంగా చెప్పాలంటే యిది "రసభంగము" వంటిది

ఆంధ్ర మహోభ్యుదయము పూర్వాలంకారిక ప్రోక్తమైన వివిధ వర్ణనలతో కూడిన ప్రబంధము, సూర్యోదయ వర్ణన, వసంతర్తు వర్ణన మొదలగునవి వున్నవి. మిగిలిన గ్రంథ భాగములలో అష్టాదశ వర్ణనలలో మిగిలిన వాటిని కవిగారు పూర్తి చేస్తారని మనం సులభంగా వూహించుకోవచ్చు. అలాగే కృత్యాది, అవతారిక, సుకవి స్తుతి, కర్తృవంశాదికము, మొదలగు పూర్వ కావ్యలక్షణములన్నీ వున్నవి.

ఏది ఎలావున్నా కవిగారు సహజ కవితా గంభీరమైన శైలిలో ఎటువంటి ఘట్టాన్ని అయినా సునాయాసంగా నడపగలరు. మంచి ధారాశుద్ధి వున్న కవి కనుక ఎక్కడా శైలి కుంటుపడినట్లు కనపడదు. వసంత వర్ణన పద్యం .

అంత వసంత శోభలు దిగంత జనాంత లతాంత వాంత ని
ర్యంత్రిత సౌరభమ్ములయి రమ్య సుమాసవ పాన గాన వి
శ్రాంతి విహీన బంభర పరంపరలై పరభృద్వినోద వి
భ్రాంతి కుహూకుహూ నినద భవ్యములై యలరారె నెల్లెడన్.

ఈ కావ్యంలో నన్నయోత్పలమాలలు, తిక్కన కందములు, ఎఱ్ఱన గీతములు, శ్రీనాధుని సీసములు, సోమనాధుని ద్విపదలు, పెద్దన మత్తేభములు, భట్టుమూర్తి శార్దూలములు, వేమన ఆట వెలదులు ; యింకా కృష్ణదేవరాయలు, రఘునాధ నాయకుడు, నన్నె చోడుడు, పోతన, చేమకూర వెంకన, పింగళి సూరన ప్రభృతులైన పూర్వ కవుల పాకములు సమృద్ధిగా వున్నవని గ్రంథాదిని అభిప్రాయము లిచ్చిన పండితులు సోదాహరణంగా నిరూపించినారు అంటే కవి గారికి పూర్వ కావ్యముల పరిచయము అంత ఎక్కువగా వున్నదని మనం అర్థం చేసుకోవాలి.

నీల నిర్మలశిఖాస్నిగ్ధోత్త మాంగమ్ము
స్ఫటిక లింగాకృతి సరస మాడ
భ మ్రరేఖాంతర భాసచిత్రక కళల్
ఫాలాంబకచ్ఛవి పరిఢవిల్ల
మణిగణాన్విత దివ్య మకరకుండల రుచుల్
గురు శుక్రదీధితి పరిభవింప
స్వర్ణశాటీ వ్యక్త ధర్మతంత్రీ బద్ధ
రుద్రాక్ష మాలల రోచులెసగ

ధవళ యజ్ఞోపవీతమ్ము దాల్చి మ్రోల
గ్రంథ పీఠమ్ముపై కన్యకా పురాణ
మలర పరశివధ్యాన కల్యాణుడగుచు
పరగె పద్మాసనమున సద్బ్రాహ్మణుండు.

వంటి పద్యాలలో శ్రీనాథుని కవితాశైలి పదన్నా తొంగిచూస్తూ వుంటుంది. ఈ కవి ద్వ్యర్థి కావ్య నిర్మాణదక్షుడు కూడా. ద్వితీయ ప్రకరణాంతమున ఒక ఉదాహరణ—

పూజితరాజమౌళి బుధ పోషణనైజవసూత్తముండు వి
భ్రాజదఖండ సత్కరుడు పాండుయశస్వి విలోకనక్రియా
తేజితమన్మథాస్త్రుడు సుధీవరసన్నుత దివ్యమూర్తియౌ
రాజు కిలా ప్రపూర్ణుడయి రాజిల మానస వార్ధి పొంగదే!

## ఇంద్ర ద్యుమ్నీయము: శ్రీ రంగరాజు కేశవరాయ ప్రణీతము :

సంపాదకుడు : పేర్వారం జగన్నాథం, ఎం. ఎ ; ప్రచురణ, సాహితీ బంధు బృందం, హనుమకొండ ; పేజీలు 182, వెల ; రూ 6లు; ప్రతులకు, చందా నారాయణ శ్రేష్ఠి, వరంగల్లు.

శ్రీరంగరాజు కేశవ రాట్కవి 19 వ శతాబ్దపు చివరి భాగమునకు చెందిన ప్రౌఢకవి. గర్భ. బంధ కవిత్వములలో సమర్థుడు. 1874 సంవత్సర ప్రాంతములో యీ కావ్యం వ్రాయబడినదని వ్రాత ప్రతిని బట్టి నిర్ణయించినారు.

ఇంద్ర ద్యుమ్న మహారాజునకు సంబంధించిన యిందులోని కథ చాలవరకు భాగవతము నుండి గ్రహింపబడినదే. ఇంద్ర ద్యుమ్న మహారాజునకూ హూహూ నామ గంధర్వునకూ జరిగిన యుద్ధము మాత్రము కవిగారి కల్పన.

భాగవతంలో గజేంద్రమోక్ష కథలో చివర గజేంద్రు డెవరో, మకరి ఎవరో చెప్పడం జరిగింది

"అవనీ నాథ గజేంద్రు డా మకరితో నాలంబు గావించె మున్

ద్రవిళాధీశు డతండు పుణ్యతము డింద్రద్యుమ్న నాముండు, వైష్ణవ ముఖ్యుండు..............."

ఆ ఇంద్రద్యుమ్నుడే ప్రస్తుత ప్రబంధనాయకుడు అగస్త్య మునీంద్రుని శాపముచేత మరుసటి జన్మలో గజేంద్రుడై పుట్టినాడు. అదే విధంగా దేవల శాపముచేత హూహూ నామగంధర్వుడు మకరియై పుట్టినాడు. వీటికి పూర్వజన్మలో సైతము వైరమున్నట్లు, యుద్ధము జరిగినట్లు కవిగారు కల్పన చేసినారు దీనిలోని కథ మా మూలు ప్రబంధములలోని కథే. ఇంద్రద్యుమ్నుడు ద్రవిడదేశమునకు రాజు. ఆటవికుల ప్రార్థన కారణంగా ఆయన వేటకు వెళ్ళడం, హూ హూ నామ గంధర్వుని వనంలో విహరించడం ఆ కారణంగా యిద్దరికీ యుద్ధం. ఇంద్రుడు మరల వారి రాజీచేయటం. అగస్త్య శాపము, హూహూ నామ గంధర్వుడు శివుని మెప్పించి మరుసటి జన్మలో రాజును గెలుచునట్లు వరము పొందుట మొదలగు ఘట్టములు వర్ణింపబడినవి శాపమోక్షము పొందిన తర్వాత ఇంద్రద్యుమ్నుడు చేసిన విష్ణుస్తవము బంధ గర్భకవిత్వములలోనూ, గజేంద్రమోక్షణ కథ దండకములోనూ వర్ణింపబడినవి.

కవిగారి ప్రబంధ రచనాశైలికి ఉదాహరణలుగా యీ గ్రంథంలోని ప్రతి పద్యాన్ని ఉదాహరించవచ్చు నారదాగమన వర్ణనలో,... ...

"దరముతో శరదంబు ధరముతో తుహినభూ
ధరముతో ఖర్జూర ధరముతోడ
శరముతో సురపరిచ్ఛరముతో స్మరకుంద
శరముతో నవసుధా . రముతోడ
పరముతో పాండురాంబరముతో నమృతసా
గరముతో విమల పుష్కరముతోడ" వంటి పద్యము
లున్నవి.

ఈ ప్రబంధములోని శైలి చాలా భాగము సంస్కృత సమాస భూయిష్టమై పూర్వకావ్యాల్లో లాగా సామాన్య పాఠకులకు గ్రాహ్యం కాకుండా వుంటుంది. చూడండి ·

"అతిమలీమస వృత్తి ఆంగనాజనకచ
ప్రతిరూపమత్త షట్పదవితతిని
బహుళ రాగోద్రేక మహిమవామాశయాం
ఘ్రి ప్రకల్ప్యాగ్ర పంకేజనిహతి" వంటివి కావ్యం నిండా

వున్నవి. సంపాదకులు తమ పీఠికలో చివర "ఆంధ్రవాఙ్మయములో నీజాతికి చెందిన ప్రబంధములు మిక్కిలి తక్కువేయని చెప్పవలయును"అన్న మాట యథార్థంకాదు. నిజానికి క్షీణ ప్రబంధ యుగంలో యిటువంటి కావ్యలు కొల్లలుగా వచ్చినవి.

స్వీకారం

చలినెగళ్లు : రచన శ్రీ వరవరరావు ; ప్రచురణ స్వేచ్ఛాసాహితి, హనుమకొండ వెల రూ 2 లు, ప్రతులకు (1) నెల్లుట్ల సంజీవరావు, స్వేచ్ఛాసాహితి, హనుమకొండ (2) పార్వతీ ప్రింటింగ్ ప్రెస్, జడచర్ల, మహబూబ్‌నగర్ జిల్లా

వైతరణి : రచన శ్రీ సి వి. కృష్ణారావు ప్రచురణ ఫ్రీవర్స్ ఫ్రంట్ హైదరాబాదు వెల రూపాయి, ప్రతులకు చింతల నరసింహులు అండ్ సన్స్, హన్మకొండ

గేయరామాయణము : రచన . కవిభూషణ చింతలపూడి సన్యాసిరావు వెల 50 పై. "చైతన్య"

## నగరంలో



నేతాజీ సుభాష్ చంద్రబోసు కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి జూన్ 8 వ తేదీన ఆవిష్కరించిన దృశ్యం

### సికింద్రాబాదు పార్కులో నేతాజీ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

సికిందరాబాదు రైల్వే స్టేషన్ సమీపంలో నేతాజీ సుభాస్ చంద్రబోస్ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానంద రెడ్డి జూన్ 8న ఆవిష్కరించారు. ఈ విగ్రహం చేసిన శిల్పి శ్రీ బి. ఏ. వాఘ్. మునిసిపల్ కార్పొరేషన్ ఈ విగ్రహాన్ని ఇక్కడ నెలకొల్పినది.

నేతాజీకి జోహార్లర్పిస్తూ ముఖ్యమంత్రి, అతనికంటె మించిన దేశభక్తుడు ఇంతవరకు ఈ ప్రపంచంలో జన్మించలేదనడం అతిశయోక్తికాదన్నారు. రాజకీయాలలో నేతాజీ తీవ్ర వైఖరిమూలంగా మహాత్మాగాంధీ-నహ్రూజీలతో ఆయనకు విభేదాలు వచ్చినవనీ దేశానికి స్వాతంత్ర్యం సాధించాలంటే ఆత్మబలిదానానికి సిద్ధం కావాలని ఆయన ఒకదశలో గాంధీజీకి వ్రాసినారనీ, ఇంత కృతనిశ్చయం కర్తవ్యదీక్ష ఉంటేనే జాతి మనగలుగుతుందనీ ముఖ్యమంత్రి అన్నారు. భౌతికమైన ప్రగతిమాత్రమే చాలదనీ జీవితంలో మౌలికవిలువల గురించి ఆలోచించాలనీ ముఖ్యమంత్రి అన్నారు.

రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి శ్రీ బి.వి. గురుమూర్తి ప్రసంగిస్తూ స్వాతంత్ర్య సమరానికి తీవ్రవాద లక్షణాన్ని సమకూర్చడం ద్వారా నేతాజీ స్వాతంత్ర్యం త్వరితగతిని సాధించడానికి తోడ్పడినారని అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోసు నికార్సయిన జాతీయవాది అనీ బ్రిటిష్ వారిని మనదేశంనుండి పారద్రోలడానికై ఎటువంటి సాహసచర్యకైనా పూనుకొనడానికయినా ఆయన సిద్ధమయినారనీ మాతృదేశ విముక్తికై జపాన్‌వంటి దేశాలతో చేతులు కలపడానికి ఆయన వెనుకాడలేదనీ ఆయన అచంచల దేశభక్తికి ఇది నిదర్శనమనీ శ్రీ గురుమూర్తి అన్నారు.

ఈ ఆవిష్కరణోత్సవానికి నగర మేయర్ శ్రీ కొండారెడ్డి అధ్యక్షత వహించారు.

### వీరసావర్కార్ కాంస్య విగ్రహం




మే 28 వ తేదీన కాచిగూడలో 'స్వాతంత్ర్యవీర' వినాయక దామోదర సావర్కార్ కాంస్య విగ్రహాన్ని జనసంబంధ శ్రామిక మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ఆవిష్కరించారు

విప్లవ మహానాయకుడు వినాయక్ దామోదర సావర్కార్ నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర జనసంబంధ, గ్రామీణమంత్రి శ్రీ కొండాలక్ష్మణ్ బాపూజీ కాచిగూడాలో ఆవిష్కరించారు సావర్కార్ ఎనభై ఎనిమిదవ జన్మదినంనాడు ఈ విగ్రహాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ విగ్రహాన్ని బొంబాయికి చెందిన ప్రసిద్ధ శిల్పి రూపొందించారు. ఇది హైదరాబాదు పురపాలక సంఘానికి బహూకరించబడింది.

సావర్కార్ త్యాగాన్ని, దేశభక్తిని మంత్రి శ్రీ బాపూజీ ఇతర వక్తలు కొనియాడారు సావర్కార్ జీవితం భారతదేశం లోని యువకులనేకాక విదేశీయులనుకూడ ఉత్తేజితులను చేసిందని మంత్రి అన్నారు.

సావర్కార్ సాహిత్యమండలి అధ్యక్షులు డాక్టర్ ఎ కె షా ప్రసంగిస్తూ సావర్కార్ ప్రఖ్యాత చరిత్రకారుడు, నిర్భీకతగల విప్లవవాది, అంతర్దృష్టి కలవాడు, సంఘసంస్కర్త అని అభి వర్ణించారు.

## సికింద్రాబాదులో కేంద్రమంత్రిచే సూపర్ బజారుకు ప్రారంభోత్సవం



హైదరాబాదు సూపర్ బజారు

సికింద్రాబాదులో మే 27న కేంద్ర సమాజ వికాస శాఖ సహాయమంత్రి శ్రీ యం యస్ గురుపాదస్వామి, సూపర్ బజారుకు ప్రారంభోత్సవం చేశారు. ఉత్పత్తి కేంద్రాలనుంచే సరాసరి అన్ని వస్తువులను సేకరించడానికి ప్రయత్నం చేసే వినియోగదారుల సహకార సంఘాల రాష్ట్ర సమాఖ్యనుంచి తమకు అవసరమైన అన్ని వస్తువులను సేకరించాలని కేంద్రమంత్రి సూపర్ బజారుకు సూచించారు. సహకార ఉద్యమాన్ని మార్కెటింగ్ సంస్థలతో జోడించాలని రాష్ట్ర సహకారశాఖ మంత్రి శ్రీ కె. విజయభాస్కరరెడ్డి సూచించారు.

## జాతీయ సమైక్యతకు కమ్యూనిటీ హాలులు

హైదరాబాదు, సికిందరాబాదు నగరాలలో కమ్యూనిటీహాలులు నిర్మించినందుకు కార్పొరేషనును రాష్ట్ర గవర్నరు శ్రీ కందూభాయ్ దేశాయి అభినందించారు. మే 27న ఆయన రహీంపురలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్, లాల్‌బహదూర్ ఆటస్థలం, బన్సీలాల్ వ్యాస్ పార్కులకు ప్రారంభోత్సవం చేశారు ఇండియాలో ఇంతకన్నా పెద్దవైన కార్పొరేషన్లువున్నా కమ్యూనిటీ హాలులు మాత్రం లేవని కులమత విచక్షణలు లేకుండా అన్నివర్గాలవారిని ఒకచోట సంఘటితపరిచేందుకు ఈ కమ్యూనిటీహాలులు ఉపయోగపడతాయని ఇక్కడ అందరూచేరి తమ సమస్యలను పరిష్కరించుకుని జాతీయ సమైక్యతను పెంపొందించవచ్చునని ఆయన అన్నారు. సభకు రెవిన్యూమంత్రి శ్రీ వి బి రాజు అధ్యక్షత వహించారు.

## జెనిటిక్స్ క్లినిక్
## హైదరాబాదులో ముఖ్యమంత్రిచే ప్రారంభం

వంశానుగతంగా వచ్చే వ్యాధుల నివారణకు ఒక ఆస్పత్రి హైదరాబాదులో ఏర్పడింది. ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి దీనికి ప్రారంభోత్సవం చేశారు

దేశంలో ఇటువంటి వైద్యశాల ఇది ఒక్కటే

వంశానుగతంగా వచ్చే వ్యాధులపై సలహాలనీయడం, పుట్టుకురుపుపై పరిశోధనా విషయాలను సేకరించడం ఈ క్లినిక్ ప్రధానోద్దేశం

భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ ఈ భవన నిర్మాణానికిగాను అయిదు లక్షల రూపాయల గ్రాంటునే కాక శాఖను ఏర్పరచడానికి గాను ఇంకా ఎనిమిది లక్షల రూపాయల గ్రాంటును ఇచ్చింది ఈశాఖకు కావలసిన ప్లుటోనియం, బరల్లియం న్యూట్రాన్ వస్తువులను సరఫరా చేయడానికి భారతీయ అణు పరిశోధనా సంస్థ అంగీకరించింది.

రాష్ట్ర ప్రభుత్వం పరిశోధనలు నిర్వహించడానికి గాను ఒక క్షేత్రాన్ని పెంచడానికి సమ్మతించిందని, అందులో "కోబాల్ట్ 60" వనరుల ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించనున్నట్లు జెనిటిక్స్ శాస్త్ర విభాగం ప్రధానాధిపతి శ్రీ ఒ. ఎస్. రెడ్డి తెలియజేశారు.

# ప్రజలకు సహాయం

## ఖడక్వాసలాలోని జాతీయ రక్షణ పరిషత్తులో 42వ కోర్సులో అభ్యర్థులు ప్రవేశం

ఖడక్వాసలాలోని జాతీయ రక్షణ పరిషత్తులో 1969 జూలై నెలలో ప్రారంభమయ్యే 42వ కోర్సులో అభ్యర్థులను ప్రవేశపెట్టుకోటానికిగాను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, డిశంబరు 17,18 తేదీలలో దేశంలో కొన్ని కేంద్రాలలో సైన్యం, నౌకాదళం, విమానదళాలు మూడింటికి కలిపి ఒక పరీక్ష జరుపుతుందని రక్షణ మంత్రిత్వశాఖ జారీచేసిన పత్రికా ప్రకటనలోవుంది. మెట్రిక్యులేషన్ లేదా అందుకు సమానమైన పరీక్షయందు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తులు పంపవచ్చును. 1969 జూలై 1వ తేదీనాటికి అభ్యర్థుల వయస్సు 15 ఏళ్ళకు తగ్గకుండాను $17\frac{1}{2}$ సంవత్సరాలకు మించకుండాను వుండాలి.

ఈ దేశంలోవున్న అభ్యర్థులు 1968 జూలై 22వ తేదీలోగా అందేట్లుగా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్‌కు దరఖాస్తులు పంపాలి. విదేశాలలోనూ, అండమాన్, నికోబార్, లక్షదీవులు, మినికాయ్, అమినదేవి దీవులలోనూ నివసించే అభ్యర్థులు 1968 ఆగస్టు 5వ తేదీలోగా అందేట్లుగా దరఖాస్తులు పంపవచ్చును.

## రాష్ట్రీయ భారత సైనిక కళాశాలలో అభ్యర్థుల ప్రవేశం

డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ భారత సైనిక కళాశాలలో అభ్యర్థులను ప్రవేశపెట్టుకోటానికిగాను ఈ యేడు ఆగష్టు 22, 23 తేదీలలో దేశంలో వివిధ కేంద్రాలలో పరీక్షలు జరుగుతాయి.

ఈ కళాశాలలో ప్రవేశింపకోరు అభ్యర్థుల వయస్సు 1969 జనవరి 1వ తేదీనాటికి 11 నుంచి 12 సంవత్సరాల లోపుగా వుండాలి. నిర్ణీత ఫారంమీద అభ్యర్థులు దరఖాస్తులను, 1968 జూలై 15వ తేదీలోగా అందేట్టుగా, అభ్యర్థుల తల్లిదండ్రులు, లేదా గార్డియన్లు సామాన్యంగా నివసించే రాష్ట్రం తాలూకు ప్రధాన కార్యదర్శికి పంపాలి. దరఖాస్తులు రెండు కాపీలు పంపాల్సివుంది, దరఖాస్తుతోకూడా సంతకం చేసిన ప్యాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు మూడింటిని జతపరచాలి.

లిఖిత పరీక్షలోనూ మౌఖిక పరీక్షలోనూ, ఉత్తీర్ణులైన అభ్యర్థులు సైనిక ఆసుపత్రులలో వైద్య పరీక్షకు హాజరు కావలసి వుంటుంది. ఈ పరీక్షలన్నీ అయిన తర్వాత చివరకు ఎన్నిక చేసిన అభ్యర్థుల పేర్లను రాష్ట్రప్రభుత్వాలకు తెలియచేస్తారు. రాష్ట్రీయ భారత సైనిక పరిషత్తు కళాశాల ప్రిన్సిపాల్, అటువంటి అభ్యర్థులకు, వచ్చి కళాశాలలో ప్రవేశించవచ్చుని తెలుపుతూ, నోటీసులు పంపుతారు.

ఈ శిక్షణకు సంబంధించిన వివరాలను, దరఖాస్తు ఫారాలు మొదలైన వాటిని డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ భారత సైనిక కళాశాల ప్రిన్సిపాల్‌కు వ్రాసికానీ, లేదా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు వ్రాసి కానీ తెప్పించుకోవచ్చును. రాష్ట్రీయ భారత సైనిక కళాశాల నిబంధలను కాపీ ఒక్కొక్కదానికి 60 పైసలు చొప్పున పంపి "మేనేజర్ ఆఫ్ పబ్లికేషన్స్, సివిల్‌లైన్స్, ఢిల్లీ-6" అన్న చిరునామాకు వ్రాసి తెప్పించుకోవచ్చును.

రాష్ట్రీయ భారత సైనిక కళాశాల నిబంధనల పుస్తకంలో 22-23 పేజీలలో పేర్కొనబడినటి కేంద్ర పాలిత ప్రాంతాల అభ్యర్థులకు ఉద్దేశించిన స్కాలర్‌షిప్పులను రద్దుచేశారు.

# క్రీడారంగం


## జాతీయ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ మహారాష్ట్ర కైవసం

హైదరాబాదు నిజాం కాలేజి ఆవరణలో జరిగిన రెండవ అఖిలభారత సాఫ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో మహారాష్ట్రకు చెందిన స్త్రీ పురుషుల జట్లు వరుసగా రెండవసారి ఛాంపియన్‌షిప్పును గెలుచుకున్నాయి. మహారాష్ట్ర పురుషులజట్టు ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టును 81.14 పరుగుల తేడాతో ఓడించింది. అదే విధంగా మహారాష్ట్ర స్త్రీల జట్టు ఆంధ్రప్రదేశ్ స్త్రీల జట్టును 16.5 పరుగులతో ఓడించింది. ఛాంపియన్‌షిప్, లీగ్ పద్ధతిపై ఆడబడింది. పురుషుల పోటీలో నాలుగు రాష్ట్రాలు పాల్గొన్నాయి. మహారాష్ట్ర జట్టు ఆరు పాయింట్లతో అజేయంగా నిలబడింది. ఆంధ్రప్రదేశ్‌కు నాలుగు పాయింట్లు దక్కాయి.




రెవిన్యూమంత్రి శ్రీ వి. బి రాజు మే 30వ తేదీన నిజాంకాలేజీ గ్రౌండ్స్‌లో రెండవ జాతీయ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్పు పోటీకి ప్రారంభోత్సవం చేస్తున్న దృశ్యం

# జిల్లాలనుంచి



మే 28 న ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి, ఏలూరు కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ స్వర్ణోత్సవ సభలో ప్రసంగిస్తున్నప్పటి దృశ్యం




ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ ఖండూభాయ్ దేశాయ్ జూన్ 1న, మదనపల్లిలో మునిసిపల్ ఆఫీస్ భవనానికి శంకుస్థాపన గావించారు

## మేలు రకం విత్తనాల కొనుగోలుకు తీర్మానం

కరీంనగర్ పంచాయతీ సమితి ఒకటవ స్థాయీ సంఘం సమావేశం మే నెల చివరి వారంలో సమితి అధ్యక్షుని అధ్యక్షతన జరిగింది. రైతులకు లాభం, నష్టంలేని ప్రాతిపదిక పై పంపిణీ చేసే నిమిత్తం సమితి నిధులనుంచి రూ. 6,600 ల ఖర్చుతో 100 క్వింటాళ్ళ మేలురకం వరి విత్తనాలనూ రూ. 2,500 లు ఖరీదు చేసే కూరగాయల విత్తనాలనూ కొనుగోలు చేయడానికి ఈ సమావేశంలో తీర్మానించారు.

## సంకరజాతి విత్తనాల సరఫరాకు డబ్బు కేటాయింపు

తూర్పు గోదావరి జిల్లాలోని రంగంపేట పంచాయతీసమితి స్థాయీ సంఘం, రైతులకు మేలురకం సంకరజాతి విత్తనాలు సరఫరా చేసే నిమిత్తం రూ. 15,000 లు క్రిమిసంహారానికి వాడే మందులు సరఫరాచేసే నిమిత్తం రూ. 4,000 లు కేటాయించింది.



గవర్నర్ శ్రీ ఖండూభాయి దేశాయ్ జూన్ 1 న చిత్తూరు జిల్లాపరిషత్తు సమావేశంలో ప్రసంగించారు



ఆరోగ్యశాఖామంత్రి శ్రీ పి. వి. నరసింహారావు మే 19న కరీంనగర్‌లో ఉచిత నేత్రచికిత్సా శిబిరానికి ప్రారంభోత్సవం జరిపారు



ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ ఖండూభాయ్ దేశాయ్ మే 25న విశాఖపట్నం జిల్లాలో సింహాచలం దేవాలయాన్ని సందర్శించారు

## చెరువుల మరమ్మతుకు డబ్బు మంజూరు

పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం పంచాయతీ సమితి సమావేశం, మే 23వ తేదీన కె. పెంటపాడులో జరిగింది. ఆ సందర్భంలో సరిపల్లి, పరిమెళ్ళ, పిప్పర గ్రామాలలోని మంచి నీటి చెరువుల మరమ్మతు కొరకు రూ. 41,500 లు మంజూరు చేశారు.

## మహిళా-శిశు సంక్షేమ విషయాలను గురించి గోష్ఠి

నిజామాబాదులోని మహిళా సంక్షేమశాఖ శిశు సంక్షేమ విషయాల విస్తరణాధికార్లు, గ్రామ సేవికలు పాల్గొన్న గోష్ఠి మే నెలలో నిజామాబాదులో జరిగింది. మహిళా సంక్షేమ శాఖ డైరెక్టరు శ్రీమతి శ్రీరాజ్యంసిన్హా గోష్ఠిని ప్రారంభించారు. జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ కె. ఆర్. రాజారెడ్డి అధ్యక్షత వహించారు.

## క్షామ నివారణ చర్యలు

క్షామ నివారణ చర్యల కొరకు నల్గొండ జిల్లాకు రూ. 27,31 లక్షలు కేటాయించారు.

## ఉత్తమ గ్రామం


ఆదిలాబాదు పంచాయతీ సమితిలోని పొన్నారి గ్రామాన్ని జిల్లా అంతటిలోకీ ఉత్తమ గ్రామంగానూ, ఆ గ్రామంలో గ్రామ సేవకుడుగా పనిచేస్తున్న శ్రీ రాజన్నను జిల్లాలో ఉత్తమ గ్రామ సేవకుడిగా ఎన్నిక చేశారు.

## 'దేశరక్షణ' ప్రదర్శన

కర్నూలు రైలు స్టేషనులో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సమాచార శాఖల ఆధ్వర్యాన 14 బోగీలలో 'దేశరక్షణను గురించి' న ప్రదర్శనను ఇటీవల ఏర్పాటు చేశారు. ప్రజలు చాల మంది తిలకించారు.



ఆంధ్ర సహకార, సమాజాభివృద్ధి శాఖ స్టేట్‌మంత్రి శ్రీ యమ్. యస్. గురుపాదస్వామి ఏలూరులో మే 28న ముఖ్యమంత్రి చిత్రపటాన్ని ఆవిష్కరించారు



ఏప్రిల్ 28న అనంతపురం జిల్లా పామిడిలో సదస్సుల నుద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి

## బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ మార్కెట్

బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ మార్కెట్‌కు మే 28న తాడేపల్లి గూడెంలో ముఖ్యమంత్రి శంఖుస్థాపనచేశారు. పురపాలక మంత్రి శ్రీ చెంచురామానాయుడు సభకు అధ్యక్షత వహించారు

## బందరు ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్

బందరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిప్రాంగణంలో రెండు లక్షల 60 వేల ఖర్చుతో నిర్మించిన 'జంట ఆపరేషన్ థియేటర్'కు రాష్ట్ర ఆరోగ్య శాఖమంత్రి శ్రీ పి. వి నరసింహారావు మే 23న ప్రారంభోత్సవం కావించారు సభకు కేంద్ర ఇరిగేషన్ పవర్ శాఖలమంత్రి డాక్టర్ కె. ఎల్. రావు అధ్యక్షతవహించారు

## కంటి వైద్యకేంద్రం

సరోజినీదేవి కంటి ఆస్పత్రి అధ్వర్యాన కరీంనగర్‌లో మే 19 నుంచి నెలరోజులపాటు కంటివైద్యకేంద్రం ఏర్పాటయింది. ఆరోగ్యశాఖమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు ఈ కేంద్రానికి ప్రారంభోత్సవం చేశారు.

## ప్రాంతీయ పశుగణాభివృద్ధి కేంద్రానికి ప్రారంభోత్సవం

మే 30న కృష్ణాజిల్లా తేలప్రోలులో ప్రాంతీయ పశుగణాభివృద్ధి కేంద్రానికి ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ప్రారంభోత్సవంచేశారు.

## అల్లూరి సీతారామరాజు స్మారక మందిరం

భీమవరంలో రూ 123 వేల ఖర్చుతో నిర్మించిన అల్లూరి సీతారామరాజు స్మారకమందిరానికి మే 29న ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు.

---

( 55 వ పుట తరువాయి )

రెండో అంతస్తులో గ్రంథాలయం ఉంది. దీనికి ప్రధానంగా రెండు విభాగాలు ఉన్నాయి_ఒకటి ప్రాచ్యవిభాగం. రెండవది_ పాశ్చాత్య విభాగం. ఇవిగాక ఒక రిఫరెన్స్ గది, బాలల విభాగం కూడా ఉన్నాయి. ఈ గ్రంథాలయానికి ప్రవేశ రుసుము లేదు. విడిగా దీనిలోకి వెళ్ళే ప్రవేశమార్గం ఉంది మ్యూజియంలోనుంచి కూడా దీనిలోకి వెళ్ళవచ్చు. గ్రంథాలయంలో ఉర్దూ, పెర్షియన్, అరబిక్ భాషలలో మొత్తం 7600 వ్రాతప్రతులున్నాయి వివిధ చిత్రకళా రీతులకు సంబంధించిన మీనియేచర్ పెయింటింగులతో వందకుపైగా సచిత్ర వ్రాతప్రతులుకూడా ఉన్నాయి.

అరబ్బీ, పార్శీ, ఉర్దూభాషలలో అరుదైనవి మొత్తం అచ్చు గ్రంథాలు 14,000 వరకు ఉన్నాయి వివిధ అంశాలమీద 30,000 ఆంగ్ల గ్రంథాలు వున్నాయి ఈ గ్రంథాలన్నిటినీ రిఫరెన్సు గ్రంథాలుగా మాత్రమే అందజేస్తుంటారు. ఇవిగాక రీడింగ్‌హాలులో అనేక వార్తాపత్రికలు, మాసపత్రికలుకూడా వున్నాయి.

చిట్టచివరి అంతస్థులో పరిపాలనా కార్యాలయం, లేబరేటరీ, ఫోటోగ్రఫీ, ఇంజనీరింగ్ విభాగాలు ఉన్నాయి. ఏ ఆధునిక మ్యూజియానికైనా తప్పనిసరిగా ఉండవలసిన అతి ముఖ్యాంశాలు యివన్నీ.

జాతీయ ప్రయోజనంగల సంస్థగా భారత పార్లమెంటు యీ సాలార్‌జంగ్ మ్యూజియంను గుర్తించడం సముచితమైనచర్య

భారతందేశంలోని మొత్తం 200 పైగా ఉన్న మ్యూజియంలలో యీవిధంగా సాలార్ జంగ్ మ్యూజియంలో ఉన్నట్టు అరుదైన అపూర్వ వస్తుసంచయం, కళాఖండాలు బహుళకాలవి కలిగి ఉన్నది మరొకటిలేదు ఈ మ్యూజియంలోని చైనా కళాఖండాలు, జపాను కళాఖండాలూ చాలాఅరుదైనవి. ఇక్కడి టిబెట్టు, నేపాలు, బర్మాదేశాల కళాఖండాలు అత్యంత సుందరమైనవి.

భారతీయ మ్యూజియంల చరిత్రలో యిది యిటీవలి కాలానిదే అయినప్పటికీ కళాప్రియులు, కళాకారులు, పర్యాటకులలో యీ మ్యూజియం పొందిన ప్రశస్తి యింతా అంతాకాదు.

కొత్తగా అధునాతనంగా నిర్మించిన భవనంలో యీ అపూర్వ కళాఖండాలు మరింత శోభాయమానంగా వెలుగొంది ప్రజా బాహుళ్యాన్ని ఆకర్షించగలవని విశ్వసించవచ్చు.

************

PUBLISHED BY THE DIRECTOR JANA SAMBANDHA SAKHA A P HYDERBAD PRINTED BY THE DIRECTOR OF PRINTING
AT THE GOVERNMENT CENTRAL PRESS, HYDERABAD

